# శ్రీహరి భక్తవిజయం

## (శ్రీహరి భక్తులకథలు)

రచన

**డా|| నొస్సం నరసింహాచార్య**
ఎం.ఏ.,టి.పి.టి.,పి.జి.డి.సి.జె.,పిహెచ్.డి.,
**ఉపసంపాదకులు,**
**తిరుమల తిరుపతి దేవస్థానములు**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2025**

# SRIHARI BHAKTAVIJAYAM

**( SRIHARI BHAKTULAKATHALU )**

*By*
**Dr. Nossam Narasimhacharya**
M.A.,T.P.T., P.G.D.C.J., Ph.D.,
SUB-EDITOR, TTD.

*Editor*
**Dr. Akella Vibhishana Sarma,** M.A., Ph.D.,
Special Officer
Publications Division

T.T.D. Religious Publications Series No.1521
© All Rights Reserved

*First Edition :* 2025

*Copies :* 500

*Published by*
**Sri J.Syamala Rao,** I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507

***D.T.P***
Publications Division,
T.T.D, Tirupati.

*Printed at :*
**Tirumala Tirupati Devasthanams Press,**
Tirupati - 517 507





# ముందుమాట

భారతదేశం పుణ్యభూమి కర్మభూమి వేదభూమి. ఈ భూమిపై శ్రీరాముడు, శ్రీకృష్ణుడు మొదలైన అవతారపురుషులతోపాటు ఎందరో మహాపురుషులు, మహర్షులు, అరుంధతీ, అనసూయ, సావిత్రి మొదలైన పతివ్రతాశిరోమణులు అవతరించారు. వారి ఆదర్శజీవనం ద్వారా, ఉపదేశాల ద్వారా సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ధార్మిక వారసత్వాన్ని మనకు అందించారు. స్వచ్ఛమైన జీవనవాహినిని మనదాకా ప్రవహింపజేశారు.

"నాహం వసామి వైకుంఠే న యోగి హృదయే రవౌ । మద్భక్తాః యత్ర గాయంతి తత్ర తిష్ఠామి" అంటూ తాను వైకుంఠంలోనో, యోగుల హృదయాలలోనో, సూర్యమండలంలోనో ఉండననీ, తన భక్తులు తనను ఎక్కడ కీర్తిస్తుంటారో అక్కడే తాను పరిపూర్ణంగా కొలువై ఉంటానని సాక్షాత్తు ఆ శ్రీమన్నారాయణుడే నారదమహర్షికి ఉపదేశించాడు. కలియుగంలో హరినామ సంకీర్తనకు మించిన తరుణోపాయం లేనేలేదు. ఇది భక్తిచేతనే సిద్ధిస్తుంది.

శ్రీమద్భాగవతంలో భక్త ప్రహ్లాదుడు శ్రవణ, కీర్తన, స్మరణ, పాదసేవన, అర్చన, వందన, దాస్య, సఖ్య, ఆత్మనివేదనలనే నవవిధ భక్తిమార్గాలను తెలియజేశాడు. ఈ భక్తిమార్గాలు కేవలం వయసుమళ్ళిన వారికే కాదు. యాంత్రిక జీవనంలో కొట్టుమిట్టాడుతున్న నేటి యువతతో పాటు, భావిభారత పౌరులైన పిల్లలకు కూడా అత్యంత ఆవశ్యకాలు.

మన సంస్కృతి గొప్పదనం తెలియనంతవరకు వాళ్ళు ఎంత విద్యావంతులైనా ప్రయోజనం మాత్రం శూన్యమే. మహనీయుల జీవితగాథలను మనం ఎందుకు తెలుసుకోవాలి? వారిని మనజాతి ఎందుకు అంతగా కీర్తిస్తున్నది? వారి ఇతివృత్తం నుండి మనం ఏమి గ్రహించాలి? అనే విషయాలను కథల రూపంలో అర్థమయ్యే రీతిలో

చెప్పగలగాలి. అప్పుడే మనం వారికి మన సాంస్కృతిక సంపదను అందించినవారమవుతాము. తద్వారా వారు మన సంస్కృతీ సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించే దారిదీపాలు అవుతారు. అందుకే ఈ శ్రీహరిభక్తవిజయం (హరిభక్తుల కథలు) అనే గ్రంథాన్ని రూపొందించడం జరిగింది.

భగవంతుని భక్తుల చరిత్రలను తెలుసుకోవడం, అర్థంచేసుకొని మననం చేసుకోవడం, వారి ఆదర్శాలను అందుకోవడం ద్వారా మన జీవనం సఫలమవుతుంది.

శ్రీహరి భక్తవిజయం అనే ఈ గ్రంథంలో...ప్రహ్లాదుడు, అంబరీషుడు, కుచేలుడు, ధ్రువుడు, నారదుడు, ఇంద్రద్యుమ్నుడు, అజామీళుడు, హనుమంతుడు మొదలైన భాగవతోత్తములతోపాటు, కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామివారి మాహాత్మ్యాన్ని తెలిపే వేంకటాచలమాహాత్మ్యంలోని భక్తాగ్రేసరులైన ఆదిశేషుడు, గరుత్మంతుడు, మాధవుడు, తొండమానుచక్రవర్తి, కురువరతి నంబిలతోపాటు చారిత్రక పురుషులైన అనంతాళ్వాను, పురందరదాసుల ఇతివృత్తాలు కూడా చక్కటి కథన శైలిలో వివరించబడ్డాయి.

ఈ గ్రంథాన్ని ముఖ్యంగా పిల్లలు, యువకులు చదివి, ఈ మహనీయులను ఆదర్శవంతంగా తీసుకుని తమ జీవితాలకు బంగారుబాటలు వేసుకుంటారని ఆశిస్తూ గ్రంథాన్ని రచించిన డాక్టర్ నొస్సం నరసింహాచారి గారికి శుభాభినందనలు.

సదా శ్రీవారిసేవలో...

డి. శ్యామల రావు

**కార్యనిర్వహణాధికారి,**

తిరుమల తిరుపతి దేవస్థానములు,

తిరుపతి.

# నివేదన

కలియుగంలో భగవంతుని చేరుకునే ఏకైక సాధనం భక్తి. అందుకే 'భక్తిరేవ గరీయసీ' అన్నారు. భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్ముడు భక్తితో పత్రం, పుష్పం, ఫలం, తోయం ఏదిచ్చినా స్వీకరిస్తాను అన్నాడు. భక్తిలేకుండా సమర్పించిన బంగారమైనా పరమాత్ముడు స్వీకరించడు. సత్యభామ తనవద్ద శ్యమంతకమణిద్వారా వచ్చిన అపార సంపద ఉన్నదన్న అహంకారంతో శ్రీకృష్ణుని తులాభారం వేస్తూ సమస్తాన్నీ త్రాసులోపెట్టి తూచింది. అయినా పరమాత్ముని రవ్వంతైనా కదల్చలేక పోయింది. అదే రుక్మిణీదేవి అత్యంతభక్తిశ్రద్ధలతో ఒకేఒక్క తులసీదళాన్ని తెచ్చి త్రాసులో వేయగానే పరమాత్ముడు సంతుష్టుడై త్రాసులో తూగాడు. అంటే భక్తితో సమర్పించిన తులసీదళం ముందు భక్తిలేని పర్వతమంత బంగారమైనా వ్యర్థమే అని తెలుస్తున్నది.

భాగవతమంటేనే భగవద్భక్తుల కథలు. అందుకే వారిని భాగవతోత్తములు అంటారు. అందులో కొందరు అవ్యాజ భక్తులున్నారు. ఆదిశేష, హనుమంత, గరుత్మంతులు అవ్యాజభక్తులు. అంతేకాక నిరంతర హరినామస్మరణ చేస్తూ త్రిలోకాలలో సంచరించే నారదుడు, భగవంతుని చేరుకొనేందుకు తపస్సుచేసిన బాల ధ్రువుడు, తాను నమ్మిన పరమాత్ముడు సమస్త విశ్వాంతరాలలో ఉన్నాడని కీర్తించిన భక్త ప్రహ్లాదుడు, శ్రీహరి శరణాగతి కోరి మోక్షాన్నిపొందిన గజేంద్రుడు, భగవంతుని స్నేహమే పరమావధిగా, మరేఇతర కోరికలులేని కుచేలుడు, ఏకాదశీవ్రతంచేత పరమాత్ముని మెప్పించిన అంబరీషుడు, ఇత్యాది భక్తశిఖామణుల చరిత్రలు ఎన్నెన్నో మనకు భాగవతంలో కనిపిస్తాయి.

అంతేకాకుండా కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వర స్వామివారి చరిత్రను ఆదిత్య, బ్రహ్మాండ, పాద్మ, భవిష్యాది ద్వాదశ పురాణాలు తెలియజేస్తున్నాయి. ఇదే శ్రీ వేంకటాచల మాహాత్మ్యం. వేంకటాచల మాహాత్మ్యంలోకూడా అనేక మంది భక్తుల కథలు వివరించబడి ఉన్నాయి.

తిరుమల శ్రీవారి ఆలయాన్ని కట్టించి నిరంతరం ఆ శ్రీనివాసునితో మాట్లాడిన పరమ భక్తుడు తొండమాను చక్రవర్తి, తన వృత్తినే పరమాత్ముని సేవగా భావించి, మట్టిపూలను శ్రీనివాసునికి సమర్పించి ధన్యుడైనవాడు కురువరతి నంబి (కుమ్మరిభీముడు), బ్రాహ్మణుడై పుట్టికూడా, అరిషడ్వర్గాలకు లోనై అనేక పాపకర్మలనుచేసి, తానేంచేస్తున్నాడో కూడా తెలియని స్థితిలో పరమపవిత్రమైన తిరుమలయాత్రచేసి, భక్తవత్సలుడైన శ్రీనివాసుని అనుగ్రహంతో సకల పాపాలను పోగొట్టుకున్న మాధవుడు- ఇలాంటి భక్తులకథలు ఎన్నెన్నో వేంకటాచలమాహాత్మ్యంలో ఉన్నాయి.

శ్రీహరి భక్తుల కథలన్నీ ఒకచోటచేర్చి భక్తులకు అందజేస్తే బాగుంటుందన్న తి.తి.దే వారి ఆలోచనకు ప్రతిరూపమే ఈ 'శ్రీహరిభక్త విజయం.' ఇందులో 14 కథలున్నాయి. ప్రతి కథ మనకు ఒక నీతిని ఒక ధర్మాన్ని బోధిస్తాయి. నిత్యజీవితంలో ఎలా నడుచుకోవాలో మార్గనిర్దేశనం చేస్తాయి. కృషి, దీక్ష, పట్టుదల, సాధించాలనే మనసు ఉంటే ఏదీ అసాధ్యంకాదని ఈ కథలు తెలియజేస్తాయి.

మణిపూసల వంటి శ్రీహరిభక్తుల కథలను ఏర్చి, కూర్చి సరళమైన భాషలో 'శ్రీహరి భక్తవిజయం' అనే శీర్షికతో ఈ గ్రంథాన్ని రచించినవారు ప్రముఖ రచయిత, అనువాదకులు డా॥ నొస్సం నరసింహాచార్యగారు. వీరు తి.తి.దేవస్థానముల ప్రచురణల విభాగంలో ఉపసంపాదకులుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంతచక్కటి గ్రంథాన్ని అందించిన రచయితకు ఆ శ్రీనివాసపరబ్రహ్మ కృపాకటాక్షాలు నిరంతరం తోడుండాలని ప్రార్థిస్తున్నాను.

ఈ గ్రంథం భావిభారత పౌరులైన బాలలతోపాటు, ముఖ్యంగా నేటి యువతకు ఎంతోఉపయోగపడుతుంది. కనుక ప్రతిఒక్కరు ఈ గ్రంథాన్ని చదివి తమతమ జీవితాలను సుగమం చేసుకోవాలని, అందుకు అవసరమైన శక్తిని, ఆసక్తిని కలియుగ ప్రత్యక్షదైవమైన ఆ శ్రీనివాసప్రభువు అనుగ్రహించాలని కోరుకుంటున్నాను.

**- డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ప్రహ్లాదుడు | 1 |
| 2. | నిరంతర హరినామ సంకీర్తనాతత్పరుడు – నారదుడు | 13 |
| 3. | అంబరీషుడు | 19 |
| 4. | కఠోరదీక్షాతత్పరుడు – ధ్రువుడు | 25 |
| 5. | కుచేలుడు | 36 |
| 6. | ఇంద్రద్యుమ్నుడు | 49 |
| 7. | అజామీళుడు | 56 |
| 8. | స్వామిభక్తిపరాయణుడు – హనుమంతుడు | 62 |
| 9. | అవ్యాజభక్తులు – ఆదిశేష గరుత్మంతులు | 65 |
| 10. | మాధవుడు | 69 |
| 11. | తొండమాను చక్రవర్తి | 72 |
| 12. | కురువరతి నంబి (కుమ్మరి భీముడు) | 75 |
| 13. | భక్తితో భగవంతుణ్ణే బంధించిన భక్తాగ్రగణ్యుడు – అనంతాళ్వాను | 80 |
| 15. | దాసశ్రేష్ఠులు – పురందరదాసులు | 85 |

# కథలలోకి వెళ్ళేముందు...

**శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాదసేవనం ।**
**అర్చనం వందనం దాస్యం సఖ్యం ఆత్మనివేదనమ్ ॥**

భగవంతుని చేరుకోవడానికి భక్తి ఒక్కటే మార్గం. ఇవి 9 విధాలని శ్రీమద్భాగవతం చెబుతున్నది. శ్రవణం – భగవత్కథను వినడం, కీర్తనం– నోరారా భగవంతుని గుణగణాలను పొగడడం, స్మరణం అన్ని వేళలా భగవంతుని నామాన్నే స్మరిస్తూ ఉండడం, పాదసేవనం – భగవంతుని పాదాలనే శరణుగా భావించి శరణాగతిని పొందడం, అర్చనం – పత్రం పుష్పం ఫలం తోయం మన శక్తిననుసరించి భగవంతుని అర్చించడం, వందనం – భగవంతుని నోరారా కీర్తిస్తూ నమస్కరించడం, దాస్యం– భగవంతుడు సర్వసమర్థుడు, సర్వస్వతంత్రుడు అట్టి భగవంతుని స్వామిగా భావించి మనం అతనికి దాస్యం (సేవ) చేయడం, సఖ్యం – భగవంతునికి స్నేహితునివలే దగ్గర చరించడం అంటే భగవంతుని కీర్తిస్తున్నవారికి, సేవిస్తున్నవారికి దగ్గరగా ఉంటూ భగవంతుని గుణ గణాలను కీర్తించే భక్తిని వంటబట్టించుకోవడం, ఆత్మనివేదనం– అంటే 'ఆత్మ'ను మనజన్మకు గల హేతువునుగూర్చి, 'వేదనం' ఆలోచించడం అంటే 84 లక్షల జీవరాశుల యోనులలో జన్మించిన మనము ఉన్నతమైన మానవజన్మను పొందాము. అయితే ఈ జన్మను భగవద్భక్తిద్వారా సఫలం ఎలా చేసుకోవాలి, పునర్జన్మలేకుండా మోక్షాన్ని ఎలా పొందాలనే మార్గాన్ని అన్వేషించి ఆ మార్గంలో నడవాలి. ఇవి నవవిధ భక్తిమార్గాలుగా శ్రీమత్ భాగవతం చెబుతున్నది.

వైష్ణవత్వం ప్రకారం శ్రీహరి సర్వోత్తముడు, సర్వతంత్ర స్వతంత్రుడు. అట్టి శ్రీహరిని నవవిధ భక్తిమార్గాలలో కొలిచి పరంధామాన్ని చేరిన

ఎందరో మహనీయులు మనకు పురాణాలలో దర్శనమిస్తారు. అట్టి మహనీయుల చరిత్రలను కథలుగా చిన్న పిల్లలకు సైతం అర్థమయ్యే రీతిలో తెలియజేయడం ద్వారా వారిలో భక్తిని ప్రచోదనం చేసి, ధార్మికతను పెంపొందించేందుకు, వారి భవిష్యత్తుకు బంగారు బాటను వేసేందుకు రూపొందిస్తున్న పుస్తకమే ఈ "శ్రీహరిభక్తవిజయం".

ఈ లఘుపుస్తకంలో ధ్రువుడు, ప్రహ్లాదుడు, అంబరీషుడు, ఇంద్రద్యుమ్నుడు, నారదుడు, అజామీళుడు, హనుమంతుడు, (వేంకటాచల మాహాత్మ్యం) మాధవుడు, కురువరతి నంబి, తొండమాన్ చక్రవర్తి, అనంతాళ్వాను, పురందరదాసు తదితరుల కథలు ఉన్నాయి. భక్తి ప్రచోదకులైన ఇట్టి మహానుభావుల జీవితాంశాలను కథారూపంలో తెలుసుకోవడం ద్వారా మనము, మన భవిష్యత్ తరాలు ధార్మికమార్గంలో నడిచేందుకు మార్గం సుగమం అవుతుంది.

హైందవధర్మవర్ధతాం అభివర్ధతాం...

# 1. ప్రహ్లాదుడు

ఏకాగ్రభక్తికి, మనోనిగ్రహానికి, అచంచలమైన హరిభక్తికి నిదర్శనం ప్రహ్లాదుడు. జయవిజయులు అహంకారపూరితులై శ్రీహరిదర్శనార్థం వచ్చిన బ్రహ్మమానసపుత్రులైన సనకసనందనాదులను అడ్డగించారు. వారు ఎంత చెప్పినా వినలేదు. చివరికి కోపోద్రిక్తులైన సనకసనందనాదులు జయవిజయులకు శ్రీహరినుండి ఎడబాటుకలిగేలా శపించారు. జయవిజయులు శ్రీహరిని శరణుకోరగా శ్రీహరి మహర్షుల శాపానికి తిరుగులేదు కనుక మూడు జన్మలు హరిద్వేషులుగా దైత్యులై జన్మిస్తారో, లేక ఏడు జన్మలు హరిభక్తులుగా జన్మిస్తారో తేల్చుకోమంటాడు. ఎక్కువ కాలం శ్రీహరిఎడబాటును భరించలేమని శ్రీహరిద్వేషులుగా మూడు జన్మలు ధరించి తదుపరి తిరిగి వైకుంఠానికి చేరేలా వరాన్ని పొందారు.

తొలిజన్మగా జయవిజయులు దితి, కశ్యప ప్రజాపతుల కుమారులుగా హిరణ్యాక్ష హిరణ్యకశిపులుగా జన్మించారు. ఇరువురు దుర్మార్గులుగా హరిద్వేషులుగా లోకాన్ని అల్లకల్లోలం చేశారు. లోకకంటకులైన హిరణ్యాక్ష, హిరణ్యకశిపుల బాధలను తాళలేక దేవతలు శ్రీహరిని శరణువేడారు. వారిపాపాలు పండిననాడు తానే స్వయంగా అవతరించి వారిని సంహరిస్తానని శ్రీహరి దేవతలకు అభయమిచ్చాడు. హిరణ్యాక్షుడు భూదేవిని అపహరించగా శ్రీహరి వరాహావతారాన్ని ధరించి అతనిని సంహరించాడు. భూదేవిని ఉద్ధరించాడు.

సోదరుని మరణవార్తవిన్న హిరణ్యకశిపుడు తనకు మరణమే లేకుండా వరాన్ని పొందడం కోసం అతి కఠోరమైన తపస్సును చేయసాగాడు. ఈ విషయాన్ని గ్రహించి దేవేంద్రుడు హిరణ్యకశిపుని తపస్సుకు భంగం కలిగించాలనే ఉద్దేశంతో గర్భవతి అయిన అతని భార్య లీలావతిని చెరబట్టే ప్రయత్నంచేశాడు. నారదుడు దేవేంద్రుని

వారిస్తూ ఆమె గర్భంలో ఉన్నది పరమ భాగవతోత్తముడైన విష్ణుభక్తుడని తెలిపి ఆమెకు తన ఆశ్రమంలో ఆశ్రయం కల్పించాడు. నిరంతర హరినామస్మరణతో జీవనం గడిపే నారదుని ఆశ్రమం అంటే ఇక వేరే చెప్పాలా.. శ్రీహరి లీలా విశేషాలు హరినామస్మరణ, ప్రవచనం ఇవి గర్భస్థశిశువుకు స్వతహాగా అలవడసాగాయి.

హిరణ్యకశిపుని తపస్సుకు మెచ్చి బ్రహ్మదేవుడు ప్రత్యక్షం కాగా అతను మరణమేలేకుండా వరాన్ని కోరాడు. బ్రహ్మ అది ప్రకృతివిరుద్ధమని మరేదైనా వరాన్ని కోరమన్నాడు. హిరణ్యాక్షుడు బాగా ఆలోచించి గాలిలోను, భూమిమీద, నిప్పులోను, నీరులోను, ఆకాశంమీద, రాత్రిపూట, పగటిపూట, చీకటిలోను, వెలుగులోను, జంతువులచేత, రాక్షసులచేత, మృగాలచేత, పాములచేత, దేవతలచేత, మానవులచేత, అస్త్రాలచేత, శస్త్రాలచేత, ప్రాణమున్నవాటిచేత, ప్రాణం లేనివాటిచేత తనకు మరణం లేకుండా వరాన్ని కోరాడు. బ్రహ్మ వరాన్ని ఇచ్చి అంతర్ధానమయ్యాడు. బ్రహ్మదత్తవర గర్వప్రభావంతో దానవేంద్రుడు విష్ణువును జయించాలని అన్ని లోకాలను వశం చేసుకొన్నాడు. దిక్పాలకులను, సాధువులను బాధించాడు. దేవలోకంపై దండెత్తి అందరినీ హింసించి దేవేంద్రుని పదవీభ్రష్టుని చేశాడు. యక్ష,గంధర్వ,కిన్నెర, కింపురుషాదులను హింసించాడు. తపోవనాలు ప్రవేశించి హవిర్భాగాలను తనే స్వీకరించాడు. తననే పూజించాలని, తన నామజపమే చేయాలని హరినామం వినిపించ కూడదని శాసనం చేశాడు.

నారదుని ఆశ్రమంలో ఉన్న హిరణ్యకశిపుని భార్య లీలావతి ఒక మగశిశువుకు జన్మనిచ్చింది. ఈ వార్తవిని హిరణ్యకశిపుడు నారదుని ఆశ్రమంలో ఉన్న భార్యాకుమారులను ఆదరించి కుమారునికి ప్రహ్లాదుడని నామకరణం చేశాడు (ప్రహ్లాదుడు అంటే అందరికి ఆహ్లాదాన్ని కలిగించే వాడు అనిఅర్థం).

ప్రహ్లాదుడు అందమైన రూపం కలవాడు. చక్రవర్తి కొడుకుగా పుట్టినా, ఎంత ధనమున్నా, చక్కటి చదువు ఉన్నా, గర్వం లేనివాడు. విషయభోగాలు లభించినాకూడా ఇంద్రియనిగ్రహం కలవాడు. వయస్సు, బలం, ప్రభుత్వం కలవాడైనా కూడా కామం, క్రోధం మొదలైనవి లేనివాడు. కామినులు మొదలైన భోగాలున్నా వ్యసనాలు లేనివాడు. విశ్వంలో ఉన్న ఏ వస్తువుపైనా కోరికలు లేనివాడు. విష్ణుభక్తి తప్ప తక్కినది ఏదీ కోరనివాడు ప్రహ్లాదుడు. ఇంత సద్గుణవంతుడైన ప్రహ్లాదుని గుణగణాలను పగవారైన దేవేంద్రుడు మొదలైనవారు కూడ కవుల వలె కీర్తించేవారు. ప్రహ్లాదుని సద్గుణాలను లెక్కించడానికి శేషుడు, బృహస్పతి, బ్రహ్మ కూడా సరిపోరు.

సమస్తభూతాలను తనలాగే సమదృష్టితో చూచేవాడు. పెద్దలకు భృత్యుని వలె నమస్కరించేవాడు. ఇతర స్త్రీలను తల్లివలె చూచి ప్రక్కకు తొలగేవాడు. దీనులను చూచి తల్లిదండ్రులవలె కాపాడాలని చింతించేవాడు. సఖులను సోదరులుగా, గురువులను దేవతలుగా తలచేవాడు. వేళాకోళానికైనా అబద్ధం ఆడేవాడు కాదు.

## ప్రహ్లాదుని విష్ణుభక్తి

మాధవుడు తనను చేరినట్లనిపిస్తేనే స్నేహితులతో చేరేవాడు. భక్తవత్సలుడైన విష్ణువు తనతో మాట్లాడినట్లైతేనే ఇతరులతో మాట్లాడేవాడు . దేవతావంద్యుడైన హరి తన హృదయంలో పొడచూపినట్లైతే సమస్తాన్ని మరచిపోయేవాడు. పుండరీకాక్షుని పాదపద్మాల ధ్యానమనే అమృతంతో తన మనస్సంతా నిండినట్లైతే అన్నింటిని మరచి జడునివలె ఉండేవాడు. ప్రహ్లాదునికి శ్రీమన్నారాయణ స్మరణం తప్ప తక్కిన జాడ్యాలేవీ లేవు.

ప్రహ్లాదుడు తల్లిగర్భంలో ఉన్నప్పటినుండే హరిభక్తిని అభ్యసించిన వాడు కనుక అదే పరంపరను కొనసాగిస్తూ హరినామచింతచేయసాగాడు.

**పానీయంబులు ద్రావుచున్ గుడుచుచున్ భాషించుచున్ హాసలీ**
**లానిద్రాదులు సేయుచున్ దిరుగుచున్ లక్షింపుచున్ సంతత (భా.7-123)**

నీళ్ళు త్రాగుతున్నా, భోజనం చేస్తున్నా, మాట్లాడుతున్నా, నవ్వుతున్నా, నిద్రిస్తున్నా, తిరుగుతున్నా, ఏ వస్తువును చూస్తున్నా శ్రీహరిచరణ ధ్యానమనే అమృతరసాస్వాదనలో మునిగి సమస్త విశ్వాన్ని మరచి పోయేవాడు.

శ్రీకృష్ణపరమాత్ముడు భగవద్గీతలో చెప్పినట్లుగా చూస్తూ, వింటూ, తాకుతూ, వాసన చూస్తూ, తింటూ, నడుస్తూ, నిద్రిస్తూ, ఊపిరి పీలుస్తూ, ఊపిరి విడుస్తూ, మాట్లాడుతూ, సమస్తాన్ని త్యజిస్తూ, భగవన్నామాన్ని గ్రహిస్తూ, కన్నులు తెరుస్తూ, మూస్తూ కూడా విష్ణుమూర్తినే ధ్యానిస్తూ ప్రహ్లాదుడు బ్రాహ్మీస్థితిలో ఉండేవాడు. శ్రీహరిని ధ్యానిస్తూ ఏ చేష్టలూ లేక ఏడ్చేవాడు. గోవిందుని భావిస్తూ గొంతెత్తి పాడేవాడు. విష్ణువు తప్ప మరేమీ లేదని గట్టిగా నవ్వేవాడు. జగన్నాథుడు అనే నిధి లభించిందని ఆనందంతో గంతులు వేసేవాడు. నారాయణా! గోవిందా! అంటూ ఆనందబాష్పాలతో శరీరం పులకరించగా కన్నులు మూసుకొని నిశ్చేష్టుడై పోయేవాడు.

ఏ విషయాలను పట్టించుకోకుండా జడునివలె ఉంటున్న ప్రహ్లాదుని చూచి హరిద్వేషి అయిన హిరణ్యకశిపుడు ఆతనికి రాక్షసవిద్యను నేర్పదలచాడు. కుమారుని పిలిచి "కుమారా! జనులందరు తప్పక చదువుకోవాలి. చదువుకోవడం ద్వారా యుక్తాయుక్త విచక్షణ, ఏది మంచి ఏది చెడు అనే వివేకం కలుగుతాయి. కనుక నిన్నుకూడా చదివించదలచాను. గురువులు నీకు విద్యను నేర్పుతారు. నీవు చక్కగా చదువుకోవాలి నాయనా" అని నచ్చజెప్పాడు. రాక్షసకులగురువైన శుక్రాచార్యుల కుమారులు చండామార్కులను పిలిపించి 'సుధీవరులారా! ఈ నా కుమారుడు విద్యాగంధశూన్యుడై అంధప్రక్రియనున్నవాడు. నా ప్రతాపం కొంచమైన తెలుసుకోలేకపోతున్నాడు. మీరు గురువులు, పెద్దలు,

ఆత్మబంధువులు, మా హితవును కోరేవారు. ఈ ప్రహ్లాదునికి విద్యాదానం చేసి రక్షించండి' అని అభ్యర్థించాడు.

వారు ఐదేళ్ళ ప్రాయుడైన ప్రహ్లాదకుమారుని తమవెంట గురుకులానికి తీసుకువెళ్ళారు.

కొంత కాలం గడిచింది. గురుకులంలో ప్రహ్లాదకుమారుడు గురువులు బోధించే విద్యలకు ఎదురుమాట్లాడక చక్కగా నేర్చుకుంటున్నాడు. గురువులు బోధించే విద్య మిథ్య అని గ్రహించికూడా వారికి ఎదురు మాట్లాడక వారు ఎలా చెబితే అలాగే చదువుకుంటూ, నిరంతరం శ్రీహరినామచింతనామృతమనే రసాస్వాదనతో కాలం గడపసాగాడు.

హిరణ్యకశిపుడు తన కుమారుడు ఎలా విద్యాభ్యాసం చేస్తున్నాడో తెలుసుకోవాలనే ఉత్సుకతతో కుమారుని వెంటబెట్టుకురమ్మని గురుపుత్రులకు కబురు పెట్టాడు. గురుపుత్రులు ప్రహ్లాదుని తోడుకొనిరాగా హిరణ్యకశిపుడు కుమారుని పుత్రవాత్సల్యంతో దగ్గరకు తీసుకొని 'కుమారా! చక్కగా విద్యాభ్యాసం చేస్తున్నావా? గురువులు నిను బాగా చదివిస్తున్నారా? వారు బోధించేవి నీకు బాగా అర్థమవుతున్నాయి కదా?' అని విచారించాడు.

అప్పుడు ప్రహ్లాదుడు 'తండ్రీ! గురువులు నన్ను బాగా చదివిస్తున్నారు. నేను ధర్మార్థముఖ్యశాస్త్రాలన్నీ చదివాను, ఇంకా చాలా చదువుకున్నాను. ఇవి అవి అని ఎందుకు చదువులలో ఉన్న సారమంతా చదువుకున్నాను' అని సవినయంగా వివరించాడు.

ఆశ్చర్యచకితుడైన తండ్రి 'కుమారా భేష్!.... అయితే నీవు నేర్చిన ఒక పద్యంచెప్పి దాని అర్థాన్ని వీనులవిందుగా వివరించవయ్యా" అన్నాడు.

అప్పుడు ప్రహ్లాదుడు **సర్వమున్నతని దివ్యకళామయమంచు విష్ణునం దుల్లము చేర్చి తారడవి నుండుట మేలు నిశాచరాగ్రణీ! (భా. 7-142)**

"దానవేంద్రా! శరీరధారులందరూ ఇల్లు అనే చీకటినూతిలో పడక, అజ్ఞానంతో మీరు మేము అనే తేడాలను చూపుతూ జీవించడం మాని సమస్తవిశ్వం విష్ణుకళామయమే అనే జ్ఞానంతో భగవంతునిలో హృదయం చేర్చి అడవిలో ఉండటమే మేలు" అని పేర్కొన్నాడు.

అది విని దానవేంద్రుడు కోపించి 'లోకంలో పిల్లలు ఎవరు ఎలా మాట్లాడితే వారు అలానే మాట్లాడుతారు. నీ ప్రవర్తన చాలా విచిత్రంగా ఉన్నది. హరిభక్తి మానమని నేను నిన్ను గురుకులానికి పంపితే నాకే నీవు హరిభక్తిని గూర్చి చెబుతావా? ఇది నీకు గురువులు నేర్పారా? లేదా ఎవరికీ తెలియకుండా గురువులు మాట్లాడుకుంటుంటే విని నేర్చినావా? లేదా ఇంకెవరైనా నేర్పించారా? అలా కాక నీకు నీవే నేర్చావా? విష్ణువు నాకు శత్రువు. వాణ్ణి ఎలా వర్ణిస్తున్నావు? దేవతలను తరమడమో, ఇంద్రాదిదిక్పాలకులను బాధించడమో, మునులను హింసించడమో, యక్షులు, కిన్నరులు మొదలగువారిని నాశనం చేయటమో కాకుండ 'హరి' అని 'గిరి' అని ఎందుకు చెడిపోతావు?" అంటూ కోపగించి గురుపుత్రులను వివరణకోరగా వారు 'రాజా! మావల్ల ఎటువంటి అపరాధమూ లేదు. ఈ సారి మేము మళ్ళీ చక్కగా విద్యనేర్పి తమవద్దకు ప్రహ్లాదుని తీసుకువస్తా'మని చెప్పి ప్రహ్లాదుని ఆశ్రమానికి తీసుకువెళ్ళారు.

హరిభక్తి మానమని దండించిన గురువులను చూచి అయస్కాంతం దగ్గర ఇనుము ఆకర్షింపబడినట్లుగా విష్ణుసన్నిధికి నా హృదయం ఆకర్షింపబడుతున్నది.

**మందారమకరందమాధుర్యమునఁ దేలు,**

**మధుపంబు వోవునే మదనములకు.... (భా. 7.150)**

అంటూ స్వచ్ఛమైన ఆకాశగంగా తరంగాలపై విహరించే రాజహంస వాగులు వంకలలో తిరుగుతుందా? తియ్యని లేత మామిడి చిగుళ్లు

తిని పులకించి పాడే కోకిలలు కొండమల్లెల చెంతకు వెళుతుందా? పున్నమి వెన్నెల్లో విహరించే చకోరము దట్టమైన మంచుపొరలవైపుకు వెళుతుందా? అలాగే శ్రీహరి పాదపద్మాల ధ్యానమనే అమృతాన్ని గ్రోలె నా మనస్సు ఇతర సుఖాలపైకి ఎలా వెళుతుంది? అని పలికాడు.

గురువులు కోపించారు. ప్రహ్లాదుని సామదానభేదదండోపాయాలతో త్రివర్గపాఠాలను బోధించారు. అయినా ప్రహ్లాదుడు ఆ విద్యను తృణప్రాయంగా భావించాడు. అతనికి హరిభక్తి మరింత రెట్టింపయింది. తోటి రాక్షస బాలకులకు కూడా హరిభక్తి ప్రాశస్త్యాన్ని బోధించసాగాడు. హిరణ్యకశిపుడు ప్రహ్లాదునికి ధర్మ–అర్థ–కామాలనే (త్రివర్గము) బోధించమని చెప్పాడు. ప్రహ్లాదుడు ధర్మార్థ ముఖ్యశాస్త్రాలు చదివానని చెప్పాడు. ప్రహ్లాదుడు నాల్గవ వర్గమైన మోక్ష పురుషార్థంలో ఆసక్తిని, జిజ్ఞాసను కనబరచినాడు. పరమభాగవతోత్తముడయ్యాడు. ఇది హిరణ్యకశిపునికి ఊహించని పరిణామం. అందుకే "నాకుం జూడఁగ చోద్య మయ్యెడి గదా నా తండ్రి!" అన్నాడు.

కొంతకాలానికి హిరణ్యకశిపుడు మళ్ళీ ప్రహ్లాదకుమారుని పరీక్షించ దలచి పిలవనంపగా అతడు గురుపుత్రులైన చండామార్కులతో కలిసి తండ్రిచెంతకు విచ్చేశాడు. బ్రహ్మాదిదేవతలకు కూడా అసూయను కల్పించే హరిభక్తి కలవాడు, మాధవ నామచింతనతో మైమరచిపోయేవాడు, సకల ప్రపంచం విష్ణుమయంగా భావించేవాడు, కారుణ్యవివేకాది లక్షణములు మూర్తీభవించినవాడు అయిన ప్రహ్లాదకుమారుని, దానవేంద్రుడు ప్రేమతో చేరదీసి 'నాయనా నీ విద్యాకౌశలాన్ని తనివితీరా వీక్షించాలని నా మనస్సు ఉవ్విళ్ళూరుతున్నది. ఒకపద్యం చదివి, అర్థం చెప్పి, తాత్పర్యాన్ని వివరించమని' అడిగాడు.

అప్పుడు ప్రహ్లాదుడు దానవేంద్రుడైన ఆ తండ్రితో పలికిన మాటలు ఒక్కొక్కటి ఒక్కొక్క అమూల్య రత్నాలే. ఆణిముత్యాలే. ఒక్క పద్యం,

అర్థం, తాత్పర్యం చెప్పమని అడిగిన తండ్రికి ప్రహ్లాదుడు నవవిధ భక్తిమార్గాలనే బోధించేశాడు. గ్రుడ్డివాడు చూడలేని పున్నమివెన్నెలలు, చెవిటివాడు వినలేని శంఖనాదాలు, నపుంసకుడు ఆస్వాదించలేని యవ్వనవతి నిండుజవ్వనం, బూడిదలో వేసిన హెూమద్రవ్యాలు, లోభి అనుభవించలేని సంపద ఎలా వ్యర్థమవుతాయో అలాగే హరిభక్తి లేనివారి జీవితాలుకూడా వ్యర్థమవుతాయని తెలియజేశాడు.

"కమలాక్షు నర్చించు కరములు కరములు, శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ..." అంటూ విష్ణువును పూజించే చేతులే చేతులు. శ్రీనాథుని వర్ణించే నాలుకే నాలుక. దేవరక్షకుని చూచే చూపులే చూపులు. శేషశయనుడైన హరికి మ్రొక్కే శిరస్సే శిరస్సు. విష్ణుని గూర్చి వినే చెవులే చెవులు. మధుసూదనునియందు లగ్నమైన మనస్సే మనస్సు. భగవంతునికి ప్రదక్షిణ చేసే పాదములే పాదములు. పురుషోత్తముని మీది బుద్ధే బుద్ధి. పరదైవమైన విష్ణువును యోచించే దినమే దినము. చక్రధారిని ప్రకటించే చదువే చదువు. భూదేవి భర్తఅయిన శ్రీహరిని గూర్చి చెప్పే గురువే గురువు. హరిపాదాలను ఆశ్రయించు అని చెప్పే తండ్రే తండ్రి అని తన తండ్రికి తెలియజేశాడు. అంతటితో ఆగక "కంజాక్షునకుఁ గాని కాయంబు కాయమే, పవనగుంభితచర్మభస్త్రి గాక" అంటూ పద్మాక్షుడైన విష్ణుమూర్తిని సేవించని శరీరం శరీరమే కాదు. గాలితో నిండిన తోలు తిత్తిమాత్రమే. వైకుంఠవాసుడైన విష్ణుమూర్తిని స్తోత్రం చేయని నోరు నోరు కాదు. కేవలం ఢమ ఢమ అని ధ్వనించే ఢక్క మాత్రమే. హరిని పూజించని చేయి చేయే కాదు. కేవలం చెట్టుకొమ్మతో చేసిన తెడ్డు మాత్రమే. ఇందిరాపతిని చూడని కన్నులు కన్నులా! శరీరమనే గోడలోని (కిటికీ)రంధ్రాలు మాత్రమే. సుదర్శనాయుధుని చింతించని జన్మము జన్మమే కాదు. నీటిపై కదిలే బుడగ మాత్రమే. విష్ణుభక్తిలేని పండితుడు పండితుడే కాదు. రెండు పాదాలతో నడిచే పశువు మాత్రమే.

**“సంసారజీమూతసంఘంబు విచ్చునే చక్రిదాస్యప్రభంజనము లేక...”** అంటూ ఓ రాక్షసేశ్వరా! విష్ణుమూర్తిసేవ అనే పెనుగాలి వీచకపోతే ఈ జననమరణాలనే దట్టమైన సంసారమేఘం వీడిపోదు. విష్ణుమూర్తి సేవ అనే అమృతవర్షం కురియకపోతే తాపత్రయాలతో కూడిన ఈ దావాగ్నులు చల్లారవు. శ్రీహరిపైగల జ్ఞానం అనే బడబాగ్ని లేకపోతే పాపపు జలరాసులు ఇంకిపోవు. పుండరీకాక్షుని గూర్చిన ధ్యానమనే సూర్యకాంతులు లేకుంటే కష్టాలనే గాఢాంధకారం సమసిపోదు. శార్ఙమనే కోదండాన్ని ధరించిన విష్ణుచింతనం అనే కాటుక కనులకు పెట్టుకోకపోతే అపురూపమైన, నిర్మలమైన ముక్తి అనే సంపదను చూడజాలం. ఈ మాటలు నీ కొఱకు నా కొఱకు మాత్రమే కాదు సాక్షాత్తు బ్రహ్మకు కూడా హరినామ స్మరణే ముక్తిమార్గము అని విష్ణుభక్తిని గూర్చి వివరించాడు.

ఇలా ఏమాత్రం భయపడకుండా మాట్లాడిన ఆ ప్రహ్లాదుని మాటలు చెవులకు మేకుల్లాగా గుచ్చుకోగా, చెక్కిళ్ళు అదరగా, కోపంతో పెదవి కొరుకుతూ అదిరిపడి గురుపుత్రుని చూచి, శత్రువుకు సంబంధించిన కథలను నా పుత్రునకు నేర్పారని కోపంతో రాక్షసరాజు ఇలా అన్నాడు– ‘గురుపుత్రులారా! నా కుమారునికి గొప్పవైన నీతిశాస్త్రాలను త్రివర్గ పాఠాలను బోధించమని మీకు అప్పగిస్తే వానికి అయోగ్యమైన నా విరోధిశాస్త్రాలను నేర్పి నన్నే మోసం చేశారు. మీరు భృగువంశంలో జన్మించినవారని మా శ్రేయోభిలాషులని నమ్మి మీతో పంపానే అయ్యో మీరు బ్రాహ్మణాకారంలో ఉన్నవారే కానీ నిజమైన బ్రాహ్మణులు కారు’ అని కోపోద్రిక్తుడైనాడు.

ఆ మాటలు విని పురోహితులు ‘రాజా మా వల్ల ఎటువంటి తప్పులు జరుగలేదు. నీ పాదాలపై ప్రమాణం మేము వైరిశాస్త్రాలు బోధించలేదు. అది నీ కుమారునికే పుట్టిన బుద్ధి. ఎవరూ చెప్పిందికాదు. జరిగినది వదిలి ఇకపై ఏం జరగాలో ఆలోచించండి’ అని విన్నవించారు.

చేసేది లేక హిరణ్యకశిపుడు కుమారునికి ఎన్నో విధాల హరిభక్తి మానమని నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. మానమని చెప్పేకొద్దీ ప్రహ్లాదునిలో హరిభక్తి మరింత రెట్టింపవుతున్న విషయాన్ని గమనించిన హిరణ్యకశిపుడు ప్రహ్లాదునికి క్రూరమైన దండనలు విధించాడు.

ఏనుగులతో త్రొక్కించాడు. పాములతో కరిపించాడు. మంటలలో పారవేయించాడు. సముద్రమధ్యంలో పడవేయించాడు. విషం త్రాగించాడు. పర్వతాలపైనుండి క్రిందకు దొర్లించాడు. స్తంభాలకు కట్టించి కొట్టించాడు. మండుటెండలో, జోరువానలో, మంచులో నిలబెట్టించి దండించాడు. నీరు ఆహారం ఇవ్వకుండా ఆకలిదప్పులకు గురిచేశాడు. కొరడాలతోను, గదలతోను కొట్టించాడు. బాణాలతో, కత్తులతో చిత్రహింసలకు గురిచేశాడు. అయినాకూడా ప్రహ్లాదుడు ఏమాత్రం జంకకుండా తన హరిభక్తితో వాటన్నిటినీ సహించాడు. ఏనాడూ తండ్రిని నిందించలేదు అలాఅని తన హరిభక్తిని మానలేదు. దండించినకొద్దీ హరిభక్తి ఇంకా పెరిగిందేకానీ తగ్గలేదు.

గురువుల పాఠాలు, తండ్రి అయిన తన మాటలు ఏమాత్రం లెక్కచేయని ప్రహ్లాదుని హరిభక్తితత్త్వానికి విసిగి వేసారి హిరణ్యకశిపుడు చివరికి ప్రహ్లాదుని నిందిస్తూ 'ఓరీ వంశనాశకా! నీ పినతండ్రిని చంపినవానిని పొగడుతున్నావు. పైగా జగన్నాథుడంటున్నావు. మరి నేను అమరావతిపై దండెత్తి దేవేంద్రుని రాజ్యసింహాసనాన్ని అధిష్ఠించి, అష్టదిక్పాలకులను నా బానిసలుగా చేసుకున్ననాడు నీ హరి ఎక్కడ దాగి ఉన్నాడు? సకలచరాచర ప్రపంచాన్ని నా పాదాక్రాంతం చేసుకుని సర్వం సహా సార్వభౌమునిగా నన్ను నేను ప్రకటించుకున్ననాడు నీ హరి ఎక్కడకు పారిపోయాడు? అటువంటి ఆ భీరుడిని నీవు సర్వాంతర్యామి, సర్వ జగద్రక్షకుడు, జగన్నాథుడు అని ఇంతగా పొగడుతూ, నీవు పుట్టిన వంశానికే తలవంపులు తీసుకువస్తున్నావు.

ఇది నీకు తగునా? కన్న తల్లిదండ్రులను, గురువులను, బంధువులను ధిక్కరించి హరి...గిరి అంటూ ఆ మాయావి మాయలో పడిపోతున్నావే వంశనాశనానికి కారకుడవవుతున్నావే ఇది నీకు ధర్మమా... సరే అయితే నీచే ఇంతగా పొగడబడుతూ కీర్తించబడుతున్న ఆ శ్రీహరి ఎక్కడున్నాడో నాకు చూపించు ఈ రోజు వానిని హతమార్చక మానను" అని కోపాగ్నిజ్వాలలను ప్రహ్లాదునిపై కురిపించాడు.

ప్రహ్లాదుడు'తండ్రీ శ్రీహరినిగూర్చి ఇక్కడ అక్కడ అని వెదకవలసిన పనిలేదు. సముద్రంలో ఉన్నాడు. భూమిపై ఉన్నాడు, ఆకాశంలో ఉన్నాడు, అగ్నిలో ఉన్నాడు. అన్ని దిక్కులలో ఉన్నాడు, సూర్యచంద్రులలో, పగలు, రాత్రులలో, ఓంకారంలో, బ్రహ్మవిష్ణుమహేశ్వరులలో, సమస్త జంతుజాలంలో, సమస్త వస్తుజలాల్లో, నీలో, నాలో అంతటా వ్యాపించి ఉన్నాడు' అని విష్ణువ్యాపకత్వాన్ని వివరించాడు. హిరణ్యకశిపుడు మరింత కోపోద్రిక్తుడై 'ఓరీ ఢింబకా! నీ హరి అన్ని చోట్లా ఉన్నాడని అంటున్నావే అయితే ఈ స్తంభంలో చూపగలవా నీ హరినీ గిరినీ? అలా చూపకపోతే ఈరోజు నీ శిరస్సు ఖండించి నిన్ను నేనే తుదముట్టిస్తాను' అంటూ గద్దించాడు. ప్రహ్లాదుడు 'పరమాత్ముడున్నాడు' అని తన నిశ్చితత్వాన్ని ప్రకటించాడు.

హిరణ్యకశిపుడు కోపం తీవ్రత మరింత హెచ్చుగా 'అర్భకా సర్వవ్యాపి అని నీచే పొగడబడుతున్న నీ హరి ఈ స్తంభంలో బహిర్గతుడగుగాక' అంటూ సభలోని వారందరూ భయపడేవిధంగా గట్టిగా అరుస్తూ బలంగా తన అరచేతితో సభామధ్యమునున్న స్తంభాన్ని గట్టిగా కొట్టాడు.

'సత్యం విధాతు నిజభృత్య భాషితం' అని తన నిజభక్తుడైన ప్రహ్లాదుని మాటలు సత్యమని చూపుటకు, దుష్టశిక్షణ, శిష్టరక్షణచేసి ధర్మసంస్థాపన చేయడంకొరకు శ్రీహరి ఆ స్తంభాన్ని పగులగొట్టుకొని బహిర్గతుడైనాడు. గట్టిగా అరుస్తూ ఎర్రని నిప్పులుగక్కే కళ్ళతో, కోపంతో ముడిపడిన

కనుబొమలతో, ఎఱ్ఱటి రక్తవర్ణపు నాలుకను చాచి, ముఖంపై పడుతున్న జూలును అసహనంతో విదిలిస్తూ శ్రీహరి సింహముఖంతో, మానవ శరీరంతో, వాడియైన గోళ్ళతో భీకరమైన ఆకారంతో నరసింహావతారంలో అవతరించాడు.

భీకరమైన ఆ నరసింహావతారాన్ని చూసిన హిరణ్యకశిపుడు మొదట కొంత జంకినా ఆ తరువాత ధైర్యంతో యుద్ధానికి తలబడ్డాడు. శిశువులతో తండ్రి ఆడుకున్నట్లు శ్రీహరి హిరణ్యకశిపునితో యుద్ధంచేస్తున్నట్లు నటించసాగాడు. సాయంసంధ్యాసమయం కాగానే హిరణ్యకశిపునికి బ్రహ్మదేవునివలన సమకూరిన వరాలన్నిటినీ సత్యంచేస్తూ గడపపై కూర్చుని హిరణ్యకశిపుని తన తొడలపై వేసుకొని, అతని రక్తం కార్చిచ్చులా యెగసిపడేలా తన చేతివేలి గోళ్ళతో ఉదరాన్ని చీల్చి హిరణ్యకశిపుసంహారం చేశాడు. ఈ దృశ్యాన్ని తిలకిస్తున్న దేవతలు జయజయధ్వానాలు చేశారు. హిరణ్యకశిపసంహారానంతరంకూడా శాంతించని ఉగ్రనరసింహుని శాంతింపజేసేందుకు ఇంద్రాది దేవతలు అనేక విధాలుగా ప్రార్థించారు. అయినా శాంతించలేదు.

అప్పుడు నారదుడు 'ఎవరికొరకైతే శ్రీహరి ఈ భీకర అవతారాన్ని ధరించాడో ఆతడే శ్రీహరిని శాంతింపజేయగలడు' అని పలికాడు. అప్పుడు ప్రహ్లాదుడు నరసింహావతారరూపి అయిన శ్రీహరిని తన వాక్పుష్పాలతో కీర్తిస్తూ ప్రార్థించగా శ్రీహరి ప్రసన్నుడైనాడు.

ఈ కథలో ఎన్ని కష్టాలెదురైనా ప్రహ్లాదుడు హరిభక్తిని ఏ మాత్రం మానలేదు. అదీ పరమాత్మునిపై ఉన్న నమ్మకం. హరినామస్మరణ ముందు ఎన్ని కష్టాలైనా పిపీలికాలే అవుతాయి. భగవంతుని మనస్ఫూర్తిగా నమ్మితే భగవంతుడు మనలను సదా సంరక్షిస్తాడని ప్రహ్లాదుని చరిత్ర ద్వారా తెలుస్తుంది.

* * *

# 2. నిరంతర హరినామ సంకీర్తనాతత్పరుడు - నారదుడు

భారతదేశం పరమపవిత్రమైన భూమి. ఈ పుణ్యభూమిపై ఎందరో దేవతలు, మహర్షులు, యోగులు, సిద్ధులు అవతరించి మరింత పావనం చేశారు. మనది ఆర్ష సంప్రదాయం. అంటే మహర్షుల పరంపరలో కొనసాగే సంప్రదాయం. అలాంటి మహర్షులలో నారదమహర్షి సుప్రసిద్ధుడు.

నారదమహర్షి జన్మవృత్తాంతాన్ని గురించి భాగవతాది పురాణాలు పేర్కొంటున్నాయి. పూర్వం శ్రీమహావిష్ణువు ఇంద్రాది దేవతలను బలిచక్రవర్తి బారినుండి రక్షించి పాతాళానికి పంపే నిమిత్తం వామనావతారాన్ని ధరించి వచ్చి మూడడుగుల నేలను దానంగా కోరాడు. బలిచక్రవర్తి దానం ఇవ్వడానికి సంసిద్ధుడైనాడు. అప్పుడు వామనరూపి శ్రీహరి త్రివిక్రమ అవతారాన్ని దాల్చి మొదటి అడుగుతో సకల విశ్వాంతరాళాన్ని ఆక్రమించాడు. అప్పుడు శ్రీహరి పాదం సత్యలోకాన్ని చేరింది. బ్రహ్మ జగన్నాథుని పాదాలను పూజించేందుకు నీటిని తేవడం కోసం తన మనసులో ఒక కుమారుని సంకల్పించాడు. ఆతడు నీటిని తీసుకురాగా బ్రహ్మ హరిపాదాలను అభిషేకించాడు. ఇలా బ్రహ్మ మనఃసంకల్పంచేత జన్మించిన కుమారునికి నారదుడని పేరు. (నార అనగా నీరు దా అంటే తెచ్చినవాడు.) ఈతడు బ్రహ్మకంఠంనుండి ఉద్భవించినవాడు.

నారదుడు సద్గుణ సంపన్నుడు. అరిషడ్వర్గాలకు అతీతుడు. వేదధర్మాన్ని ఆచరించేవాడు. శాంతుడు. సత్యవాది. అజాతశత్రువు. లోకకల్యాణం కోసం నారాయణ నామస్మరణకు జీవితాన్ని అంకితం చేసినవాడు. తల్లి అయిన సరస్వతీదేవివల్ల సంగీతవిద్యను పొందాడు. వాయుదేవుని వల్ల మహతి అనే వీణను పొందాడు.

నారదుడు బ్రహ్మదేవుని సమక్షంలో ఒకసారి తన గానవిద్యను ప్రదర్శించాడు. ఆతడు సంతసించి 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరీ మంత్రాన్ని ఉపదేశించాడు. ఆ మంత్ర ప్రభావంచేత నారదుడు నిరంతరం హరినామస్మరణ సంసేవాసక్తుడై ఉండేవాడు.

ఒకసారి బ్రహ్మ తన కుమారులనందరినీ పిలిచి గృహస్థాశ్రమాన్ని స్వీకరించి సృష్టికార్యాన్ని నిర్వహించవలసినదిగా ఆజ్ఞాపించాడు. అందుకు నారదుడు అంగీకరించలేదు. కోపగించిన బ్రహ్మ నారదుని స్త్రీలోలుడైన గంధర్వుడవుకమ్మని శపించాడు. బ్రహ్మదేవుని శాపాన్ననుసరించి నారదుడు ఉపబర్హణుడనే గంధర్వునిగా జన్మించాడు.

ఉపబర్హణుడు పూర్వజన్మవాసన వల్ల హరినామధ్యానం అబ్బింది. అతను చిత్రరథుడనే గంధర్వరాజపుత్రికలను వివాహమాడాడు. నిరంతరం వారితో కామాసక్తుడై ఉండేవాడు. ఇలా కొంతకాలానికి సృష్టికర్త బ్రహ్మ దేవసత్రమనే యాగం చేస్తూ హరినామసంకీర్తనకై ఉపబర్హణాది గంధర్వులను ఆహ్వానించాడు.

సత్రయాగంలో గంధర్వగణం గానం చేస్తుండగా అప్సరగణం మైమరిచి ఆనందంతో నాట్యం చేస్తున్నారు. యజ్ఞవాటిక హవిస్సుల సమర్పణచేత ఎగసిపడే అగ్నుల ధూమాలు సువాసనలను నింపుకుని అందరిమనసులకు ఆనందాన్ని కలిగిస్తున్నాయి. ఇలా వైభవోపేతంగా సత్రయాగం నిర్వహింపబడుతున్నది. బ్రహ్మశాపవశాత్తు నిరంతర స్త్రీలోలాసక్తుడైన ఉపబర్హణునికి చిత్తచాంచల్యం కలిగి అప్సరసపొందుగోరి కనుసైగచేశాడు. నిర్వహిస్తున్నది సత్రయాగం. నిర్వాహకుడు బ్రహ్మ. గానం చేస్తున్నవి దేవదేవుని అనంతలీలావిలాసాలు. ఇంతటి పుణ్యకార్యంలో ధర్మబాహ్యుడై ప్రవర్తిస్తున్న ఉపబర్హణుని బ్రహ్మ గమనించాడు. కోపోద్రిక్తుడైనాడు. అంతవరకు ఆనందోత్సాహాలతో వర్ధిల్లిన ఆ ప్రాంతం ఒక్కసారిగా బీభత్సరంగంగా మారిపోయింది. వెంటనే బ్రహ్మ కన్నులు కోపంతో ప్రళయాగ్ని చిచ్చులు వెదజల్లాయి. పెదవులు అల్లాడ

పటపటమని పళ్ళు కొరుకుతూ “ఓరీ గాంధర్వకుమారా! సత్రయాగంలో భాగంగా పుండరీకాక్షుని గానాలాపన చేసేవేళ దానిని విడనాడి సభామర్యాదనైనా పాటించక స్త్రీసాంగత్యానికై అర్రులు చాచుతున్న నీవు నీ దైవత్వమును విడనాడి భూమిపై శూద్రునివై జన్మించుదువు గాక” అని శపించాడు.

విధాత శాపవశంగా ఉపబర్హణుడు భూమిపై వేదవేత్తలైన యోగుల ఇంట పనిచేస్తున్న ఒక దాసికి కుమారునిగా జన్మించాడు. ఆ దాసి అల్లారుముద్దుగా పెంచుతూ చిన్న వయసులోనే మునిజనసేవకై నియోగించింది.

ఇంతలో వర్షాకాలం వచ్చింది. చాతుర్మాస్యవ్రతదీక్షతో జడధారులు సంచారము మాని ఒకేచోట ఉండేలా సంకల్పించుకుని ఆ వేదవేత్తల ఇంటనే నివసించసాగారు. ఆ బుడతడు వారిమధ్యనే పెరగసాగాడు. వారికి చేయవలసిన సపర్యలను ఏమరపాటులేకుండా ఆ బాలకుడే అత్యంత భక్తి శ్రద్ధలతో చేసేవాడు. వారు చేస్తున్న బ్రహ్మావాదములను వీనులవిందుగా వినేవాడు. వారు తినగా మిగిల్చిన దానిని మంగళ ప్రదంగా భావించి భుజించేవాడు. ఎండ,వానలు లెక్కచేయకుండా వారి సేవలోనే తరించే ఆ బాలకునిపై జడధారులందరూ అమితమైన కరుణను కలిగి ఉండేవారు. శ్రీకృష్ణ దివ్యకథామృతాన్ని నిరంతరం చదువుతూ, వర్ణిస్తూ, గానంచేస్తూ అత్యంత ఆనందభరితులై, భక్తిరసాస్వాదన చేయసాగారు. వారిమధ్యే మెలుగుతున్న ఆ బాలకుడు కూడా వారి ప్రవచనాలు వింటూ శ్రీహరిసేవయే ఇహపరసాధనమని కృతనిశ్చయు డయ్యాడు. యోగిజనుల సేవచేస్తూ, వారికరుణకు పాత్రుడయ్యాడు. అప్పుడే ఆతనికి ఈ జగమంతా మాయచేత ఆవరించబడినదని,ఆ మాయను తొలగించు ప్రకృతిగుణ పరిహారిణి హరిభక్తియే అని ఆతను గ్రహించాడు.

ఈలోపు చాతుర్మాస్య సంకల్పదీక్ష పరిసమాప్తమయ్యే సమయం వచ్చి తాపసులు వారి వారి సంచారాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ దీక్షాసమయంలో ఎటువంటి లోటులేకుండా తమను సేవించిన ఆ దాసీపుత్రునిపట్ల కరుణాంతరంగులై భగవత్తత్వాన్ని ఉపదేశించి దేశాటనకు బయలుదేరారు.

తాపసుల ఉపదేశానుసారం వారినుండి వాసుదేవుని మాయాభావాన్ని తెలుసుకొని ప్రణవపూర్వకముగా ఆ అష్టాక్షరీ మంత్రమూర్తిని భక్తితో కీర్తించసాగాడు. శ్రీహరి ఆ బాలకుని భక్తికిమెచ్చి ధైర్యసాహసాలను అనుగ్రహించాడు. మునిజనసేవచేయు సమయంలో ఎదురైన కష్టాలను ఆ బాలకుని తల్లి ఎన్నడూ వానితో చెప్పలేదు. తన అశక్తతనుకానీ, ఆకలిబాధలనుకానీ, ఆ బాలకునికి తెలుపలేదు. తన యజమానుల ఇంట అన్ని సేవలను ముగించుకుని ఇల్లుచేరి ఎంతో ప్రేమతో ఆ కుమారుని చేరదీసేది. తన ఒడిలో కూర్చోబెట్టుకొని అతని నుదుట ముద్దాడేది. అనేక విధాలుగా లాలించి పాలించేది.

ఇలా తల్లి ప్రేమకు పాత్రుడైన ఆ దాసీపుత్రుడు ఇల్లువిడిచి వెళ్ళలేక ఆమె మాతృప్రేమకు బద్ధుడై మోహాన్ని విడిచి శ్రీహరిస్మరణను విడవకుండా తదేకంగా భగవంతునే ధ్యానిస్తూ మౌనిగా ఉండసాగాడు. ఒకనాడు ఆతని తల్లి ఇల్లువిడిచి పాలుపిదుకడానికి వెళ్ళగా ఆ పచ్చికలమధ్య ఒకపాము ఆమెను కాటువేసింది. అది కాలసర్పం ఆ పాముకాటుకు ఆమె తన ప్రాణాలు విడిచింది. మాతృవియోగంతో ఆ బాలకుడు కొంత దుఃఖితుడైనా, ఒక్క క్షణంలో తేరుకొని బాధపడక, మోహవశుడు కాక తనకు వైష్ణవార్చనకు అడ్డంకులు తొలగాయని భావించాడు.

ఇక ఆ బాలకుడు అక్కడినుండి ఉత్తరాభిముఖుడై వెళ్ళసాగాడు. పురాలు, పట్టణాలు, నదీనదాలు, అడవులు, తరుగిరిపర్వతాలు, సుందర

సరోవరాలు, ఉద్యానవనాలు దాటుకొని నదులలో మునుగుతూ పవిత్రుడయ్యాడు. జనసంచారం లేని ఏకాంత ప్రదేశంలో ఒక రావిచెట్టు క్రింద విశ్రమించాడు. గురుముఖంగా తాను అలవర్చుకున్న పరమాత్మ స్వరూపాన్ని ధ్యానించుకునేందుకు అనువైన ప్రదేశమదని ఆనందించాడు. శ్రీహరిధ్యానమగ్నుడైనాడు. ఆతని తపస్సుకు మెచ్చి శ్రీహరి ప్రత్యక్షమైనట్లు భావించాడు. కన్నులు తెరిచి చూడగా శ్రీహరి కనిపించక పోవడం గమనించి పులకితగాత్రుడై శ్రీహరిని వెదుకుతూ నిర్మానుష్యమైన అడవిలో చెట్టూ పుట్టా, వాగువంక, తరుగిరులలో వెదకసాగాడు.

ఆవిధంగా విరామంలేకుండా వెదుకుతున్న ఆ బాలునిపట్ల కరుణాంతరంగుడైన శ్రీహరి అదృశ్యవాణిద్వారా గంభీరమధుర స్వరముతో "కుమారా! ఈవిధంగా నీవెందుకు వెర్రివానిలా నా గురించి వెదుకుతున్నావు. నీవు ఈ జన్మలో నన్ను దర్శించలేవు. అరిషడ్వర్గాలను జయించి కర్మసన్యాసం చేసిన మునిముఖ్యులే నన్ను దర్శించగలరు. ఇతరులు దర్శించలేరు. నీ ఆర్తిని తొలగించుటకే నా నిజరూపాన్ని దర్శింపజేశాను. దీక్షతో నన్ను భజించువారికి దోషములు అంటవు. నన్ను సేవించడం వల్ల భయము తొలగి జన్మాంతరం నందుకూడా అకుంఠిత భక్తి ఏర్పడుతుంది. నీవు నా అనుమతితో భక్తజన శేఖరుడవై జన్మిస్తావు. బాలకా! ఆ సృష్టి అనంతరం నిర్దోషుడవై పూర్వజన్మస్మృతితో జన్మించి శుద్ధసాత్త్వికాగుణంతో నిరంతరం నన్నే సమ్మరిస్తూ ప్రసిద్ధి నొందుతావు" అని పలికాడు.

శ్రీహరి పలుకులను విన్న ఆ బాలుడు సంతోషించి శ్రీహరి ఆజ్ఞానుసారం అరిషడ్వర్గాలను విడచి శుద్ధ సాత్త్వికగుణం శోభిల్లే విధంగా భగవంతుని గుణగణాలను కీర్తిస్తూ, భగవచ్చరిత్రలను తెలుసుకుంటూ ఆ భీకరారణ్యంలో తిరుగాడసాగాడు.

ఈ విధంగా హరినామసంకీర్తనతో కాలం గడుపుతున్న ఆతనిని మృత్యుదేవత ఆవహించింది. అప్పుడు పంచభూతాత్మకమూ, గర్వసంభూతము అయిన ఈ దేహాన్ని విడిచి శ్రీహరి కరుణచేత పరమభాగవతోత్తమదేహాన్ని పొందాడు. అంతట భయంకరమైన ప్రళయకాలం సమీపించింది. త్రైలోక్య సంహారకారణంగా జనించిన ఆయాసముతో పద్మగర్భుడు ప్రళయకాల పయోరాశిమధ్యలో నిదురిస్తుండగా ఆతని ఉచ్ఛ్వాస నిశ్వాసములద్వారా ఆ పరమ భాగవతోత్తముడు లోనికి ప్రవేశించాడు. సహస్రయుగాలు నిదురించి మేల్కొన్న బ్రహ్మ పునః సృష్టిని ప్రారంభించాడు. ఆతని ఉచ్ఛ్వాసము వలన మరీచ్యాది మునిముఖ్యులతో పాటు జన్మించిన ఆ పరమ భాగవతోత్తముడే నారదమహర్షిగా, బ్రహ్మమానస పుత్రునిగా పేరుగాంచాడు. ఈ విధంగా జన్మించిన నారదుడు అఖండ బ్రహ్మచర్య దీక్షను వహించి, శ్రీహరి అనుగ్రహంతో ముల్లోకాలలోను అడ్డంకిలేకుండా సంచరించసాగాడు. సప్త స్వరాలను తమంతతామే మ్రోగించే మహతి అనే వీణతో పద్మనాభుని గుణగణాలను కీర్తిస్తూ, లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ తనకు నచ్చినవిధంగా సకలలోకాలు తిరుగాడసాగాడు.

సంసారసాగరంలో మునిగితేలుతూ కర్మబంధాలచేత బంధింపబడినవారిని శ్రీహరినామసంకీర్తనమనే నావ తరింపజేస్తుంది. కనుకనే బ్రహ్మశాపవశాత్తు స్త్రీలోలుడైన ఉపబర్హణుని గాను, మరోజన్మలో దాసీపుత్రునిగాను జన్మించాడు. మునిజనసేవచేత విజ్ఞానఖనియై భగవన్నామస్మరణ ప్రభావంచేత నిరంతర హరినామస్మరణ చేస్తూ పరమభాగవతోత్తముడయ్యాడు నారదుడు. త్రిలోకసంచారియైన ఈ పరమపావనచరితుని జీవన విశేషాలను తెలుసుకోవడం ద్వారా నేటి యువత హరినామస్మరణ గొప్పదనాన్ని, అనుకున్నది సాధించడంలో నారదుని కృషి దీక్షాపట్టుదలలను అలవరచుకోవాలి.

* * *

# 3. అంబరీషుడు

భగవంతుడు భక్తపరాధీనుడుడని, తన భక్తుల సంరక్షణే ప్రధాన కర్తవ్యంగా భావించేవాడని అంబరీషమహారాజు కథచెబుతున్నది.

ఇక్ష్వాకు వంశానికి చెందిన నాభాగ మహారాజు కుమారుడు అంబరీషుడు. అతడు శ్రీహరి మహాభక్తుడు. సద్గుణసంపన్నుడు. సప్తద్వీపాలతోకూడిన ఈ భూభాగాన్ని శత్రుభేద్యంగా, సుభిక్షంగా పరిపాలిస్తూ ఉండేవాడు. సకల సిరిసంపదలతో తులతూగుతూ ఉన్నాకూడా ఎటువంటి గర్వాహంకారాలను తన దరిచేరనీయని సుగుణవంతుడు. నిరంతర హరినామచింతనతో కాలం గడుపుతున్నా ప్రజారక్షణలో ఏమాత్రం ఏమరుపాటు లేనివాడు.

**అంబరీషుని విష్ణుభక్తితత్పరత:-**

అంబరీషుడు మహావిష్ణుభక్తుడు. నిరంతరం తన మనస్సు శ్రీహరి పాదపద్మాలయందే లగ్నమై ఉండేది. అతని నోటినుండి వెలువడే ప్రతి పలుకు హరిగుణకీర్తనగా ఉండేది. అతని చేతులు విష్ణు ఆలయ శుభ్రతకొరకే ఉండేవి. చెవులు హరికథాశ్రవణం కొరకే ఉండేవి. ఆతని మైత్రి హరిభక్తులతోనే కొనసాగేది. అతని ముక్కు హరిప్రీతికరమైన తులసి సువాసనలను ఆఘ్రాణించడానికే ఉండేది. ఇంతటి మహత్తర హరిభక్తితత్పరుడు అంబరీషుడు.

యజ్ఞేశ్వరుడైన శ్రీహరిప్రీతికై సరస్వతీ నదీతీరంలో వశిష్టాది మహామునుల సమక్షంలో అనేక అశ్వమేధయాగాలు చేశాడు. అనేక దానధర్మాలు చేశాడు. హరిని స్మరిస్తూ, చూస్తూ, స్పృశిస్తూ, హరినామ సౌరభాన్ని ఆఘ్రాణిస్తూ, హరినామమాధుర్యాన్ని రుచిచూస్తూ హరిభక్తి

పూరితుడై ధర్మబద్ధంగా రాజ్యపాలన చేస్తూ రాజర్షిగా జీవితాన్ని గడపసాగాడు.

కొంతకాలానికి సకల సంపదల పట్ల, భోగభాగ్యాలపట్ల, సంసార బంధాల పట్ల విరక్తుడై ఏకాంతంలో భక్తిపారవశ్యంలో మునిగిపోయాడు. ఈ విధంగా తననే నిరంతరం నమ్మి సేవిస్తున్న తన భక్తుని రక్షణబాధ్యతను స్వీకరించిన శ్రీహరి, అతని రక్షణకై సుదర్శనచక్రాన్ని నియమించాడు.

ఒకానొక శుభముహూర్తాన తన పట్టపు దేవేరితో కలిసి వశిష్ఠాది మహామునుల అనుజ్ఞతో ఒక సంవత్సరంపాటు అతి కఠోరంగా ఏకాదశి వ్రతాన్ని ఆచరించాడు. వ్రతసమాప్తిలో భాగంగా మూడు రాత్రులు ఉపవాసదీక్షను వహించి మధువనంలో శ్రీహరిని వివిధ రకాల ద్రవ్యాలతో మహాభిషేక, ధూప, దీప, నైవేద్యాలతో అర్చించాడు. మనోహరమైన గంధాలను, దివ్యమైన పుష్పాలను శ్రీహరికి సమర్పించాడు. మేలుజాతివైన 600 కోట్ల గోవులను వెండి గిట్టలు, బంగారు కొమ్ములతో, పట్టు పీతాంబరాలతో అలంకరించి విప్రశ్రేష్ఠులకు గోదానము చేశాడు.

ద్వాదశినాడు పారణలో భాగంగా అనేకమంది బ్రాహ్మణోత్తములను పిలిచి పంచభక్ష్యపరమాన్నాలతోకూడిన భోజనాన్ని సమర్పించాడు. వారంతా తృప్తోస్మి అంటూ ఉండగా సరిగ్గా అదే సమయానికి సూర్య తేజస్సమానుడు, మహాతపస్సంపన్నుడు అయిన దూర్వాస మహర్షి అతిథిగా అక్కడకు విచ్చేశాడు.

అంబరీషుడు స్వయంగా తాను మహర్షికి అర్ఘ్యపాద్యాది ఉపచారాలన్నిటిని నిర్వర్తించి ఆతనికి వారు నిర్వహిస్తున్న మంగళకార్యాన్ని వివరించి భోజనానికి విచ్చేయవలసినదిగా అర్థించాడు.

దూర్వాసుడు అంబరీషుని అతిథ్యాన్ని అంగీకరించాడు. నదికివెళ్ళి స్నాన సంధ్యాదులను ముగించుకువస్తానని చెప్పి యమునానదికి బయలు దేరాడు. స్నానసంధ్యాదులలో మునిగితేలుతూ దూర్వాసుడు ఆలస్యం చేయసాగాడు.

ఇటువైపు అంబరీషుడు ద్వాదశి ఘడియలు వెళ్ళిపోవడానికి అరఘడియ మాత్రమే ఉన్నది. ఆ లోపుగా పారణ చేయకపోతే వ్రత ఫలితం దక్కదు. అలా అని అతిథిని భోజనానికి ఆహ్వానించి ఆతనిని వదిలి భోజనం చేస్తే అది భాగవత అపచారమవుతుంది. ఏం చేయాలన్న ధర్మసంకటంలో పడ్డాడు అంబరీషుడు. పండితులందరినీ ఆహ్వానించి తరుణోపాయం కోరాడు. అప్పుడు పండితులందరు చర్చించుకుని ఒక నిర్ణయానికి వచ్చి, 'రాజా! అతిథికారణంగా ఆలస్యమైందని సకాలంలో పారణ చేయకపోవడం ధర్మబద్ధంకాదు. ధర్మశాస్త్రాల ప్రకారం జలసేవనం పారణతో సమానం. అది భోజనంచేసినట్లు కాదు, అలాఅని చేయనట్లు కాదు. కనుక శ్రీహరిపై భారంమోపి జలపానం చేయండి' అని కర్తవ్యోపదేశం చేశారు. ఆ ప్రకారమే అంబరీషుడు జలపానం చేశాడు. దూర్వాస మహర్షి స్నానాదికాలు ముగించుకుని రాగానే జరిగిన ఉదంతాన్ని తన దివ్యదృష్టితో గ్రహించాడు. కోపోద్రిక్తుడై ఎర్రనికన్నులతో ముడివడిన కనుబొమలతో, అంబరీషుని చూస్తూ "ఓరీ దురాత్మా! నీవు మదాంధుడవు. ఘాతకుడవు. దుర్మార్గుడవు. అతిథిగా నన్ను ఆహ్వానించి నేను రాకమునుపే ధర్మభంగం చేసిన నీవొక విష్ణుభక్తుడవా? నన్ను ఇంతగా అవమానపరచిన నిన్ను ఏంచేస్తానో చూడు. నా శక్తి ఏమిటో ఇప్పుడే నీకు చూపుతాను. నిన్ను ఎవరు రక్షిస్తారో చూద్దాం" అంటూ కోపంతో కనుకొనలనుండి నిప్పులు గ్రక్కుతూ తన జుట్టులోని శిఖను ఒకదానిని తీసి భూమిపై విసిరాడు. అది శూలాయుధం కలిగిన కృత్యగా

మారగా దానిని అంబరీషునిపై ప్రయోగించాడు. అది భీకర ధ్వానాలు చేస్తూ అంబరీషుని హతమార్చడానికి ముందుకు వచ్చింది.

విశ్వవ్యాపి అయిన శ్రీమహావిష్ణువు దూర్వాసుని దుష్కృత్యాన్ని తెలుసుకుని అజ్ఞాని అయిన తపసిమాయను సరిచేయమని, తన భక్తుడైన అంబరీషుని రక్షణార్థం నియోగించిన సుదర్శనచక్రాయుధాన్ని ఆజ్ఞాపించాడు. శ్రీహరిచే ఆజ్ఞాపించబడిన సుదర్శనచక్రం ప్రళయాగ్నిని చిమ్ముతూవచ్చి, శూలధారియై అంబరీషునివైపు వెళుతున్న కృత్యను సంహరించింది.

అంతటితో ఆగక కృత్యను అంబరీషునిపై ప్రయోగించిన దూర్వాసుని వెంబడించసాగింది. దూర్వాసుడు సుదర్శన చక్రధాటికి తట్టుకోలేక మేరుపర్వతగుహలలో ప్రవేశించగా చక్రం కూడా గుహలోకి ప్రవేశించింది. ముని భూమిలో దూరితే తాను భూమిలో దూరింది. సముద్రంలో మునిగితే తాను సముద్రంలో మునిగింది. గగన వీధులలో ఎగబాకితే తాను ఎగబాకింది. ముని అణిగితే తాను అణుగుతుంది. నిలబడితే తాను నిలబడుతుంది. ఇలా ముని ఎటువెళితే అటు వెంబడించ సాగింది.

ముని బ్రహ్మదేవుని శరణుకోరుతూ బ్రహ్మలోకానికి వెళ్ళగా చక్రం అక్కడకూ ప్రవేశించింది. బ్రహ్మ 'నేను శ్రీహరి ఆజ్ఞాబద్ధుడను. అట్టి నేను ఈ సుదర్శనుని నిలువరింప అశక్తుడ'నని చెప్పేశాడు. అక్కడి నుండి దుర్వాస మహర్షి కైలాసానికి చేరుకొని పరమశివుని సుదర్శనచక్రం బారినుండి రక్షింపుమని శరణుకోరాడు. అప్పుడు మహేశ్వరుడు 'నేనూ, బ్రహ్మ మొదలు సమస్తసృష్టి ఎవరి మాయకులోనై ఈ స్థితిలో ఉన్నామో అట్టి మేమంతా శ్రీహరి ఆజ్ఞానువర్తులమే. మేమెవరము ఆతనిని

ఎదురింపజాలము. ఆతనిచే ప్రయోగింపబడిన ఈ సుదర్శన చక్రాన్ని నిలువరింపలేము. కనుక నీవు ఆతనినే శరణుకోరుట ఉత్తమ' మని పలికాడు. చేసేదిలేక సుదర్శన చక్రం వెన్నంటివస్తుండగా మహర్షి వైకుంఠానికి పయనమైనాడు. మహాలక్ష్మీయుతుడై శేషతల్పముపై విశ్రమించివున్న, చతుర్భుజుడైన శ్రీహరిని చేరి, 'స్వామీ! నీ దివ్యమహిమ తెలియలేక అహంకారంతో నీ వాత్సల్యానికి పాత్రుడైన భక్తునిపట్ల అపరాధము చేశాను. నా అపరాధాన్ని మన్నించి సుదర్శన చక్రాయుధమును ఉపసంహరించి నన్ను అనుగ్రహించు స్వామీ!' అని శరణుకోరాడు.

అప్పుడు శ్రీహరి 'మహర్షీ! బుద్ధిమంతులు, సాధుజనులు నన్ను భక్తి అనే తీగలతో బంధిస్తుంటారు. నేను వారి భక్తిపాశాలకు చిక్కి, వారిపట్ల ప్రేమతో వారినే అనుసరిస్తుంటాను. ఈ లోకంలో సమస్తాన్ని వీడి నన్ను ఎవరైతే సర్వకాల సర్వావస్థలలో శరణుకోరుతారో వారిని నేను సర్వదా సంరక్షిస్తాను. ఓ మహర్షీ ! సజ్జనుల హృదయమే నేను. సాధుసజ్జనులను నేను మాత్రమే తెలుసుకోగలను. నన్నుకూడా వారు మాత్రమే తెలుసుకోగలరు. వారిలో నా తేజస్సు ఉంటుంది. వారికి కష్టం కలిగించిన వారిని ఆయుధరూపంలో వెంటాడుతుంది. ఓ బ్రాహ్మణోత్తమా! ఎవరికి హాని చేయడంవల్ల ఈ ఆయుధం నిన్ను వెంటాడుతున్నదో వారే నిన్ను ఈ ఆయుధం బారినుండి రక్షించగలరు. అంబరీషుడు సద్గుణవంతుడు, కీర్తివంతుడు, దయాపరుడు. నీవు ఆతనినే శరణువేడు. ఆతడు నిన్ను తప్పక రక్షించగలడు' అని ఉపదేశం చేశాడు.

శ్రీహరి ఆజ్ఞమేరకు దూర్వాసమహర్షి తిరిగి అంబరీష మహారాజు వద్దకే వచ్చి రక్షించమని శరణువేడాడు. అంబరీషుడు అత్యంతభక్తి శ్రద్ధలతో ఎల్లపుడూ విష్ణుకరస్పర్శచే పరమ పవిత్రమైన సుదర్శన చక్రాయుధాన్ని శాంతించమని వేనోళ్ళ స్తుతించాడు. దుష్టజన శిక్షణకై

శ్రీహరిచే ప్రయోగింపబడే అవక్ర విక్రమ పరాక్రమవంతమైన ఓ సుదర్శన చక్రరాజమా! దయతో మహర్షిని రక్షించమని ప్రార్థించాడు. రెండుచేతులు జోడించి శిరస్సునవుంచి నమస్కరించాడు.

అంబరీషుని ప్రార్థనను మన్నించిన సుదర్శనచక్రం తన దావాగ్ని జ్వాలను శాంతింపజేసి వెనుకకు మరలింది. ఆ తరువాత దూర్వాస మహర్షి తన అపరాధాన్ని తెలుసుకొని శ్రీహరి భక్తుల శక్తి ఎటువంటిదో గ్రహించాడు. శ్రీహరి తనపట్ల అపరాధము చేసినవారినైనా మన్నిస్తాడేమో కానీ, తన భక్తులపట్ల అపరాధము చేసినవారిని అస్సలు సహించడు. ఎవరి నామస్మరణచేతనే సకలపాపాలు తొలగి పుణ్యవారాశి వరిస్తుందో అట్టి పరమ మంగళమూర్తిని ఇంతగా భక్తితో కొలిచే అంబరీషుని విష్ణుభక్తిని కొనియాడి తన పయనాన్ని ముందుకు కొనసాగించాడు దూర్వాస మహర్షి.

భగవంతునికి శరణాగతిని పొందిన భక్తులను ఆ భగవంతుడే రక్షిస్తాడు అని ఈ అంబరీషుని కథ మనకు తెలియజేస్తున్నది.

* * *

## 4. కఠోరదీక్షాతత్పరుడు – ధ్రువుడు

కల్పారంభంలో బ్రహ్మ సృష్టికార్యాన్ని కొనసాగించేందుకు స్వాయంభువ మనువు, శతరూపాదేవిలను సృష్టించాడు. వీరికి ఇరువురు కుమారులు కలిగారు. వారే ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు. ఇరువురు పెరిగి పెద్దవారై ధర్మబద్ధంగా రాజ్యపాలన కొనసాగిస్తున్నారు.

ఉత్తానపాదునికి సునీతి సురుచి అని ఇరువురు భార్యలు. పెద్ద భార్య సునీతి సుగుణవంతురాలు, మృదుస్వభావి, మధురభాషి, నిత్యము శ్రీహరి పాదచింతనతో సదసద్వివేకం కలిగి అందరి మన్ననలు పొందినది. చిన్నభార్య సురుచి అందగత్తె, అందుకు తగ్గ అహంకారి. పరుష పదజాల కర్కష స్వభావవర్తనురాలు. కానీ అందగత్తె కనుక ఉత్తానపాదునికి సురుచి అంటేనే ఒకింత ప్రేమ ఎక్కువ. అందుకే అన్ని అర్హతలు ఉన్న పెద్దభార్య సునీతికి కాకుండా, అందగత్తె అయిన సురుచిని పట్టపురాణిగా స్వీకరించాడు.

ఇది సహజమే. ఈ లోకంలో మంచి చెబితే ఎవరికీ సహించదు. అయితే దీర్ఘకాలం సుఖాన్ని ఆనందాన్ని ప్రసాదించేది మంచిమాత్రమే. అదే చెడు, క్షణికానందాన్ని ఇస్తుంది కనుక, త్వరగా ఆకర్షిస్తుంది. అందుకే ఈ లోకం మంచి కన్నా చెడువైపే ఎక్కువగా మొగ్గుచూపుతుంది.

ఉత్తానపాద మహారాజుకు కొంతకాలానికి సునీతి వల్ల ధ్రువుడు, సురుచి వల్ల ఉత్తముడు అనే కుమారులు జన్మించారు. ఇరువురికి తండ్రి అంటే అమితమైన ప్రేమ. ఉత్తానపాదునికి అంతే..

ఒకానొకనాడు ఉత్తానపాదుడు సురుచి కుమారుడైన ఉత్తముని తన తొడపై కూర్చోబెట్టుకొని లాలిస్తుండగా, ధ్రువుడు కూడా తండ్రితొడపై కూర్చునే ప్రయత్నం చేశాడు కానీ, తండ్రి ఆతడిని ఆదరించకుండా

ఉండడం గమనించి సవతితల్లి అయిన సురుచి గర్వంతో ధ్రువుని నిలువరిస్తూ ఇలా అన్నది.

"ధ్రువా నీవు రాజకుమారుడవే అయినా నీకు మహారాజు తొడపై కూర్చునే అర్హత లేదు. ఉత్తమునికి మాత్రమే ఉన్నది. ఉత్తముడు నా గర్భంలో జన్మించాడు. నీవు సునీతి గర్భంలో జన్మించావు. నీవు నీ తండ్రి తొడపై కూర్చోవాలంటే మొదట విష్ణుభగవానుని అనుగ్రహాన్ని సంపాదించు. మరుజన్మలో నా గర్భంలో జన్మించు. అప్పుడే నీకు నీ తండ్రి తొడపై కూర్చునే అర్హత వస్తుంది. ఈ జన్మలో నీవు నీ తండ్రి తొడపై కూర్చోజాలవు" అని పరుషంగా మాట్లాడింది.

తండ్రి తొడ నెక్కు వేడుక దగిలెనేనిఁ
బూని నా గర్భమున నాఁడె పుట్ట కన్య
గర్భమునఁ బుట్టి కోరినఁ గలదె నేఁడు
జనకు తొడ నెక్కు భాగ్యంబు సవతి కొడుక!

అదిగాన నీ వధోక్షజు
పదపద్మము లాశ్రయింపుడీ పాయక హరి నా
యుదరమునఁ బుట్టఁ జేయును,
వదలక యట్లయిన ముదము వఱలెడి నీకున్.

సవతితల్లి అయిన సురుచి ఆడిన మాటలకు తండ్రికూడా ఏమీ అనలేదు. చిన్నవాడైన ధ్రువుడు కంటతడిపెట్టుకొని రోదిస్తూ తన తల్లి అయిన సునీతిని చేరాడు. సునీతి ఏం జరిగిందో తెలియక ఆందోళనతో "కుమారా ధ్రువా! ఏం జరిగింది నాయనా? ఎక్కడైనా క్రిందపడ్డావా? ఎవరైనా ఏమైనా అన్నారా? అని వాత్సల్యంతో తన తొడపై కూర్చోబెట్టుకొని అడిగింది.

చెలికత్తెల ద్వారా జరిగిన ఉదంతం, సవతి తల్లి ఆడిన మాటలు తెలుసుకొని సునీతి దుఃఖిస్తూ "కుమారా! పినతల్లి ఆడిన మాటలు సత్యమే నాయనా! బాధపడకు. నేను సేవకురాలినే. నేను అభాగ్యురాలనే. ఈ అభాగ్యురాలి కడుపున పుట్టిన నీకు ఈ అవమానం తప్పలేదు. సునీతియే పట్టపురాణి. మీ తండ్రిగారి తొడపైన కూర్చునే అధికారం ఆమె గర్భంలో జన్మించిన ఉత్తమునికే ఉన్నది. సురుచి నిన్ను నిలువరించినా, పరుష పదజాలంతో దండించినా, ఆమె నీకు ఉపకారమే చేసింది. అదే భగవదనుగ్రహాన్ని పొందమని చెప్పడం. నీవు తపస్సుచేసి విష్ణుభగవానుని అనుగ్రహాన్ని పొందే సమయం ఆసన్నమైనది. నీవు కఠోర తపమాచరించి ఆ పరంధాముని అనుగ్రహాన్ని పొందితే ఇంతకన్నా ఉన్నతమైన స్థానమే నీవు పొందగలవు.

పరికింప నీ విశ్వపరిపాలనమునకై-
యర్థి గుణవ్యక్తుఁ డైనయట్టి
నారాయణుని పాదనళినముల్ సేవించి-
తగ బ్రహ్మ బ్రహ్మపదంబు నొందెబీ
ఘనుఁడు మీ తాత యా మనువు సర్వాంతర-
యామిత్వ మగు నేకమైన దృష్టిఁ
జేసి యాగముల యజించి తా భౌమ సు-
ఖములను దివ్యసుఖముల మోక్ష

సుఖములను బొందె నట్టి యచ్యుతునిఁ బరుని
వితత యోగీంద్ర నికర గవేష్యమాణ
చరణ సరసిజ యుగళు శశ్వత్ప్రకాశు
భక్తవత్సలు విశ్వసంపాద్యు హరిని.

"లోకాలను రక్షించడానికి సగుణస్వరూపాన్ని గ్రహించిన నారాయణుని పాదపద్మాలను ఆరాధించి బ్రహ్మదేవుడు బ్రహ్మపదాన్ని పొందాడు. నీ తాత అయిన స్వాయంభువ మనువు భగవంతుని సర్వాంతర్యామిత్వాన్ని గుర్తించి ఏకాగ్రతతో యజ్ఞాలను చేసి ఆ దేవదేవుని సేవించి ఇహలోక సుఖాలను, పరలోక సుఖాలను అనుభవించి పరమపదాన్ని పొందాడు. నాశం లేనివాడు, యోగీశ్వరులు అన్వేషించి ఆరాధించే పాదపద్మాలు కలవాడు, ఆయన అనంత కాంతిస్వరూపుడు, భక్తవత్సలుడు, విశ్వ సంసేవ్యుడు అయిన హరిని ఆశ్రయించు. స్వధర్మాయత్తమైన ఏకాగ్ర చిత్తంలో నిలిపి ఆరాధించు. ఆ పరమాత్ముని కంటె నీ దుఃఖాన్ని తొలగింప గలిగినవాడు మరొకడు లేడు." అన్నది సునీతి. పరమార్థసిద్ధికి కారణాలైన తల్లి మాటలను ధ్రువుడు విని తనకు తానే ఒక నిర్ణయానికి వచ్చి పట్టణం నుండి బయలుదేరాడు.

ఈ వృత్తాంతాన్ని నారదమహర్షి తెలుసుకొని ధ్రువుని దగ్గరకు వచ్చి, అతని కోరికను తెలుసుకొని, పాపాలన్నిటినీ పారద్రోలే తన చల్లని చేతితో అతని శిరస్సును స్పృశించాడు. 'అవమానాన్ని సహింపని క్షత్రియ తేజస్సు అద్భుతమైనది. పసివాడైనా కూడ పినతల్లి పలికిన దుర్వాక్కులను మనస్సులో ఉంచుకొని నగరంనుండి వెళ్ళిపోతున్నాడు' అని మనస్సులో ఆశ్చర్యపడి "నాయనా! సకల సంపదలు కలిగిన గృహాన్ని విడిచి ఒంటరిగా ఎక్కడికి పోతున్నావు? బంధువులు చేసిన అవమానంచేత బాధపడుతున్నట్లున్నావు" అని పలుకగా ధ్రువుడు ఇలా అన్నాడు "సవతితల్లి మాటల వల్ల అయిన గాయాన్ని భగవద్ధ్యానం అనే ఔషధంతో నయం చేసుకొనేందుకు వెళుతున్నాను స్వామి" అని ధ్రువుడు పలికాడు.

ఐదేళ్ళప్రాయుడైన ధ్రువుని పలుకులు విని నారదుడు " కుమారా! నీవు బాలకుడవు. ఐదేళ్ళయినా నిండనివాడవు. ఆటపాటలతో కాలం

గడపవలసినవాడవు. నీ సవతి తల్లి ఆడిన మాటలను అవమానంగా భావించి వెళుతున్నావా? కుమారా! ప్రతిమనిషికి వారివారి పూర్వజన్మ ఫలితాన్ననుసరించి మానావమానాలు ఎదురవుతూ ఉంటాయి. తెలివిగల మానవులు అవి దైవసంకల్పంవల్ల కలిగినవిగా భావించి తృప్తిపడతారు. అయినా ఈ వయసులో నీవు వాటిని పట్టించుకోకూడదు. అలాకాదని నీ సవతి తల్లి పలికినట్లు శ్రీహరి ధ్యానమగ్నుడనే అవుతానంటే చెబుతాను విను.. యోగీంద్రులైనవారు సర్వమును త్యజించి కొన్ని జన్మలుగా భగవంతుని ధ్యానంలోనే గడిపినా, భగవంతుని దర్శించలేకపోతున్నారు.

ఆ హరిని దర్శించడం నీకు చాలా కష్టం. కనుక నా మాటలను విని, నీ వ్యర్థప్రయత్నాన్ని మాని, వెనుతిరిగి వెళ్ళు. మోక్షసాధన అంటావా అందుకు ఇంకా నీకు చాలా సమయం ఉన్నది. భగవంతుని అనుగ్రహంతో జీవితంలో సుఖదుఃఖాలు ఏవి కలిగినా సంతోషంతో వాటిని స్వీకరించే వాడినే 'విజ్ఞాని' అంటారు" అని నారదుడు ధ్రువుని మార్గాన్ని మరల్చేలా పరీక్షించాడు.

అప్పుడు ధ్రువుడు నారదునితో.."మహాత్మా! సుఖదుఃఖాల వల్ల తెలివి కోల్పోయిన వారికి శాంతి లభించదని అన్నారు. శత్రువులకు భయం కలిగించే క్షాత్రధర్మాన్ని నేను అవలంబించాను. కనుక నాకు వినయం ఎక్కడిది? సురుచి పలికిన దుర్భాషలు అనే బాణాలచేత బ్రద్దలైన నా హృదయంలో శాంతికి చోటులేదు. కాబట్టి ముల్లోకాలలోను శ్రేష్ఠమైనది, ఇతరులెవ్వరూ పొందలేనిది అయిన స్థానాన్ని నేను పొందాలని ఆశపడుతున్నాను. అందుకు నాకు చక్కని ఉపాయాన్ని తెలియజేయండి మీరు బ్రహ్మమానసపుత్రులు, నేర్పుతో వీణను మ్రోగిస్తూ, లోకాలకు మేలు చేకూర్చే నిమిత్తం సూర్యభగవానునివలె సంచరించే మహాత్ములు" అని ప్రార్థించాడు.

పుణ్యచరితా! నిన్ను మోక్షమార్గానికి ప్రేరేపించినవాడు పరమాత్ము డైన ఆ వాసుదేవుడే కనుక, నీవు ఏకాగ్రచిత్తంతో ఆతనినే ఆరాధించు. పురుషార్థసిద్ధికి మానవునకు శ్రీహరిపాదపద్మాలు తప్ప మరొక సాధనం లేదు.

వర యమునానదితటమునఁ
హరి సాన్నిధ్యంబు శుచియు నతిపుణ్యమునై
పరఁగిన మధువనమునకును
సరసగుణా! చనుము మేలు సమకూఱు నచటన్.

యమునానది ఒడ్డు శ్రీహరికి నివాసస్థానము. పవిత్రమూ, పుణ్యప్రదమూ అయిన మధువనానికి వెళ్ళు. నీకు శుభం కలుగుతుంది. పరమ పవిత్రమైన ఆ యమునానదిలో ముప్పూటలా స్నానమాచరించి, నిశ్చలమైన బుద్ధితో, ఏకాగ్రచిత్తంతో, యమ, నియమాది కఠోర నియమాలతో శ్రీహరిని ధ్యానించు.

శ్రీహరి ఆశ్రితుల పట్ల అపారమైన కృపను చూపేవాడు. దయాసముద్రుడు. పురుషార్థాలను ప్రసాదించేవాడు. శరణన్నవారికి ఆశ్రయమిచ్చేవాడు. శుభాలను కలిగించేవాడు. శ్రీవత్సం అనే అందమైన పుట్టుమచ్చ కలవాడు. సర్వలోక రక్షకుడు. సర్వమూ చూచేవాడు. పురుషోత్తముడు. పుణ్యస్వరూపుడు. నీలమేఘశ్యాముడు. అవ్యయుడు.

హార కిరీట కేయూర కంకణ ఘన-
భూషణుం డాశ్రిత పోషణుండు
లాలిత కాంచీకలాప శోభిత కటి-
మండలుం డంచిత కుండలుండు
మహనీయ కౌస్తుభమణి ఘృణి చారు గ్రై-
వేయకుం డానంద దాయకుండు

సలలిత ఘన శంఖ చక్ర గదా పద్మ-
హస్తుండు భువన ప్రశస్తుఁ డజుఁడు
క్రమ సౌరభ వనమాలికాధరుండు
హతవిమోహుండు నవ్యపీతాంబరుండు
లలిత కాంచన నూపురాలంకృతుండు
నిరతిశయసద్గుణుఁడు దర్శనీయతముఁడు

ఆ శ్రీహరి హారాలు, కిరీటం, భుజకీర్తులు మొదలైన అలంకారాలతో అలరారుతూ ఉంటాడు. ఆయన ఆశ్రితులను పోషించేవాడు. అతని కటిప్రదేశం అందమైన మొలత్రాడుతో ప్రకాశిస్తూ ఉంటుంది. ఆయన చెవులకు మకరకుండలాలను ధరిస్తాడు. కౌస్తుభం అనే మణికాంతులతో అందమైన కంఠమాలను ధరిస్తాడు. ఆయన ఆనందాన్ని కలిగించేవాడు. శంఖ చక్ర గదా పద్మాలను నాలుగు చేతులలో ధరించిఉంటాడు. ఆయన లోకప్రసిద్ధుడు. కమ్మని సువాసనగల వనమాలను మెడలో వేసుకుంటాడు. ఆయన అజ్ఞానాన్ని పోగొట్టేవాడు. సరిక్రొత్త పచ్చని పట్టువస్త్రాన్ని కట్టుకుంటాడు. మేలిమి బంగారు అందెలు ఆయన కాళ్ళకు అలంకరింపబడి ఉంటాయి. గొప్ప సద్గుణాలు కలవాడు. దర్శించవలసిన వాడు.

ఆ పరంధాముడు ఆశ్రితుల మనసులకు ఆనందాన్ని కలిగించే వాడు. భక్తుల హృదయపద్మాలలో నివసించేవాడు. అటువంటి ఆ పురుషోత్తముని హృదయమునందు నిలుపుకొని తదేకంగా ధ్యానించు. ఆతని దివ్యమంగళ విగ్రహం నీ హృదయపలకంపై స్థిరంగా నిలిచి పోతుంది. ఏ మంత్రాన్ని నిశ్చలభక్తితో ఏడు దినములు జపిస్తే దేవతల సందర్శనం కలుగుతుందో అట్టి ద్వాదశాక్షరాలతో కూడిన వాసుదేవ మంత్రమైన 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే మంత్రాన్ని జపించు.

గరికపోచలవలె శ్యామలవర్ణం కల వాసుదేవుణ్ణి గరికపోచలతో, అందమైన పద్మాలవంటి కన్నులు కలిగినవానిని పద్మాలతో, తులసి మాలను ధరించేవానిని తులసీదళాలతో, మాలిన్యంలేని శీలం కలవానిని పూలమాలలతో, పక్షివాహనుని పత్రాలతో, లోకాలకు ఆదిమూలుడైన మహానుభావుని వనమూలికలతో, పచ్చని పట్టువస్త్రాలు ధరించేవానిని నారబట్టలతో సేవించాలి. భగవంతుణ్ణి మృణ్మయ, శిలామయ, దారుమయ ప్రతిమలలోకాని, నిర్మల జలాలలో కాని, పవిత్ర స్థలాలలో కాని ఆరాధించాలి.

మనోనిగ్రహం కలవాడై నారవస్త్రాలను ధరించినవాడై, సదాచార సంపన్నుడై, కందమూలాలనే భుజిస్తూ, శ్రీహరి వివిధ అవతారాలను, లీలలను మనసులో తదేకంగా స్మరిస్తూ ఉండాలి. ఆత్మార్పణ బుద్ధితో చేసే పూజలను ద్వాదశాక్షరీ మంత్రంతో వాసుదేవునకు సమర్పించాలి. ఈ విధంగా త్రికరణశుద్ధిగా భక్తితో పూజించేవారు విష్ణుమాయలో చిక్కుకోరు. వారికి భగవంతుడు ధర్మార్థకామమోక్షాలలో కోరిన దానిని అనుగ్రహిస్తాడు. విరక్తితో ముక్తిని కోరువాడు, ఎడతెగని భక్తిభావంతో సేవిస్తూ ఉంటాడు" అని నారదుడు ఉపదేశించగా ధ్రువుడు అతనికి ప్రదక్షిణం చేసి, నమస్కరించి, మహర్షులు నివసించేది, కోరిన కోరికలను ప్రసాదించేది, భగవంతుని పాదపద్మాలచేత అలంకరింపబడింది అయిన మధువనానికి బయలుదేరాడు.

అలా బయలుదేరి మధువనాన్ని చేరాడు. పవిత్ర యమునానదిలో స్నానంచేసి నారదమహర్షి ఆదేశానుసారం ఏకాగ్రచిత్తంతో యమ నియమాలతో శ్రీహరినే మనసులో నిలుపుకొని వాసుదేవమంత్రాన్ని జపిస్తూ ఒంటికాలిపై నిలబడి కఠోర తపోదీక్షను కొనసాగించాడు. అతని తపశ్శక్తి ముల్లోకాలకు వ్యాపించింది. వారు ఆ తాపాన్ని భరించలేక పోయారు. అంతేకాక ఒంటికాలిపై నిలబడి తపస్సుచేస్తున్న ధ్రువుని

కాలి బొటనవ్రేలు ఒత్తిడికి భూమి ఒకవైపుకు ఒరిగిపోయింది. ధ్రువుడు తన ప్రాణవాయువును నిరోధించి పరమాత్మునితో అనుసంధానం చేశాడు. దేవతలందరూ శ్రీహరిని చేరి ధ్రువుని అనుగ్రహించవలసినదిగా ప్రార్థించారు.

దేవతలు విన్నవించగా శ్రీహరి వారితో ఇలా అన్నాడు. "ఉత్తానపాదుని కొడుకు విశ్వవ్యాపినైన నాయందు తన మనస్సును సంధానం చేసి తపస్సు చేస్తున్నాడు. అందువల్ల మీకు ప్రాణనిరోధం కలిగింది. ఆ బాలుణ్ణి తపస్సు నుండి విరమింప జేస్తాను. భయపడకండి. మీ మీ లోకాలకు వెళ్ళండి" అని పలుకగా భయం తొలగిన దేవతలు సంతోషంతో వాసుదేవునకు నమస్కరించి తమ లోకాలకు బయలుదేరి వెళ్ళారు. ఆ తరువాత... శ్రీహరి గరుత్మంతుని అధిరోహించి మధువనాన్ని చేరాడు. కఠోరమైన దీక్షతో తదేకంగా మనసులో వాసుదేవుని రూపును నిలుపుకొని తపస్సుచేస్తున్న కారణంగా శ్రీహరి గరుడవాహనారూఢుడై వచ్చి తన ఎదుట సాక్షాత్కరించినాకూడా అచంచలంగా తపస్సు చేయసాగాడు. శ్రీహరి ఆతని మనస్సులోని రూపాన్ని మాయంచేయగా ధ్రువుడు తన కళ్ళఎదుట ప్రత్యక్షమైన కరుణాసముద్రుడైన శ్రీహరిని దర్శించాడు. తొట్రుపాటుచెందాడు. ఆనందబాష్పాలు చెక్కిళ్ళపైనుండి జాలువారగా ఆనందభరితుడై శ్రీహరిని తదేకంగా చూస్తూ నిలబడిపోయాడు. తదుపరి శ్రీహరికి సాష్టాంగ దండప్రణామం చేశాడు. నిలబడి స్వామిని చూస్తూ స్తుతించాలని ప్రయత్నం చేశాడు కానీ, తనకు స్తుతించడం రానికారణంగా అలాగే ఉండిపోయాడు. సర్వాంతర్యామి అయిన పరమాత్ముడు తన పాంచజన్య శంఖంతో ఒకసారి ధ్రువుని బుగ్గను తాకాడు. అంతటితో విశేషమైన శక్తి ధ్రువుని ఆవహించింది. ధ్రువుడు అప్పుడు శ్రీహరిని వివిధ రీతులలో అత్యంత భక్తి శ్రద్ధలతో

నీకు మ్రొక్కెద నత్యంత నియమ మొప్ప
భవ్యచారిత్ర! పంకజపత్రనేత్ర!
చిరశుభాకార! నిత్యలక్ష్మీవిహార!
యవ్యయానంద! గోవింద! హరి! ముకుంద!

సర్వేశ్వరా! భవ్యచరిత్రా! కమలదళనయనా! శాశ్వత శుభాకారా! లక్ష్మీవిహారా! అవ్యయానందా! గోవిందా! హరీ! ముకుందా! నీవు కల్పాంత కాలంలో సర్వప్రపంచాన్ని నీలో విలీనం చేసుకుంటావు. శేష తల్పంమీద శయనిస్తావు. యోగనిద్ర పొందుతావు. అప్పుడు నీ నాభి అనే సముద్రంలో నుండి పుట్టిన బంగారు తామరపువ్వులోనుండి చతుర్ముఖ బ్రహ్మను సృష్టిస్తావు. అటువంటి తేజోమయమైన నీ పరబ్రహ్మ స్వరూపానికి నిశ్చల నియమంతో నమస్కరిస్తున్నాను' అని స్తుతించాడు.

ధ్రువుని స్తుతికి సంతోషించిన శ్రీహరి ఆతనిపై విశేషమైన అనురాగంతో వాత్సల్యంతో 'అచంచల దీక్షావ్రతా! ధ్రువా! నీ మనసులోని అభిప్రాయాన్ని చక్కగా గ్రహించాను. అది దుర్లభమైనా, నీకోరిక తీరుస్తాను.

కట్టుకొయ్య చుట్టూ పశువుల మంద తిరిగినట్లుగా గ్రహాలు, నక్షత్రాలు, తారాగణాలు, జ్యోతిశ్చక్రం, నక్షత్ర స్వరూపాలైన ధర్ముడు, అగ్ని, కశ్యపుడు, శుక్రుడు, సప్తర్షులు, తారకలతో కూడి దేనికి ప్రదక్షిణం చేస్తారో, అటువంటి ధ్రువక్షితి అనే మహోన్నత స్థానాన్ని ఇరవైఆరువేల సంవత్సరాల తరువాత నీవు పొందుతావు. అది ఎవ్వరికీ అందరానిది. ఇదివరకు ఎవ్వరూ దానిని పొందలేదు. ముల్లోకాలు నశించేటప్పుడు కూడా అది నశించకుండా ప్రకాశిస్తూ ఉంటుంది. అటువంటి స్థానాన్ని నీవు అలంకరిస్తావు. అంతవరకు నీ తండ్రి రాజ్యాన్ని నీవు సర్వజనరంజకంగా ధర్మమార్గాన పరిపాలిస్తావు. ఇంద్రియాలను

జయిస్తావు. ధ్రువా! నీవు యజ్ఞపురుషుడనైన నన్ను సంపూర్ణ దక్షిణలతో కూడిన యజ్ఞాలచేత ఆరాధిస్తావు. ఈ లోకంలోని అనంత సౌఖ్యాలను అనుభవిస్తావు. మరణకాలంలో నన్ను మనస్సులో స్మరిస్తూ, సకల లోకాలకు వందనీయమై, పునరావృత్తిరహితమై సప్తర్షిమండలం పైన ఉండే నా స్థానాన్ని పొందుతావు." అని భగవంతుడు ధ్రువుడు కోరిన కోరికలను ప్రసాదించి, అతడు చూస్తూ ఉండగానే గరుత్మంతుణ్ణి అధిరోహించి వైకుంఠమునకు వేంచేసాడు.

నారదమహర్షివల్ల ఈ వృత్తాంతాన్ని తెలుసుకున్న ఉత్తానపాదుడు రాజ్యానికి తిరిగి వస్తున్న ధ్రువునికి ఎదురేగి ఆతనిని ఆలింగనం చేసుకుని రాజ్యానికి తీసుకువచ్చాడు. ఆతనిని మహారాజుగా నియమించాడు. ఉత్తానపాదుడు వానప్రస్థాశ్రమాన్ని స్వీకరించి అరణ్యానికి బయలుదేరాడు.

ఉదార యశస్సంపన్నుడైన ధ్రువుని చరిత్రను సజ్జనులు విశేషంగా కీర్తిస్తుంటారు. ధ్రువోపాఖ్యానం కీర్తిని సంపదలను పెంపొందింపజేస్తుంది. ఈ కథను తెలుసుకోవడం వల్ల స్వర్గము, శాశ్వతమైన పరమపదము సిద్ధిస్తాయి. అమరత్వాన్ని గురించి తెలియజేసే ఈ కథాశ్రవణం సకల పాపాలను నాశనం చేస్తుంది. భగవద్భక్తి లభిస్తుంది. ఉత్తమ గుణశీలాలు సిద్ధిస్తాయి. చక్కటి జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది.

* * *

# 5. కుచేలుడు

నవవిధ భక్తి మార్గాలలో సఖ్య భక్తికి నిదర్శనం కుచేలుడు. ద్వాపర యుగంలో పరమాత్ముడు దుష్టశిక్షణ, శిష్టరక్షణకై కృష్ణావతారాన్ని ధరించాడు. కృష్ణావతారం పరిపూర్ణ అవతారం. శ్రీకృష్ణబలరాములు సాందీపనీ మహర్షివద్ద విద్యాభ్యాసం చేశారు. ఈ సందర్భంలోనే శ్రీకృష్ణునికి ఒక మిత్రుడు తోడైనాడు. అతడే సుదాముడు. గురుకులంలోని శిష్యవర్గంలో ఉత్తముడు సుదాముడు. సద్గుణవంతుడు. శ్రీకృష్ణుడు స్నేహం చేయడానికి కావలసిన అర్హతలన్నీ ఉన్నవాడు. దేనిపైనా కోరికలు ఉండేవికావు. శాంతస్వభావుడు. ధర్మవర్తనుడు. సహజంగానే బ్రహ్మజ్ఞానం కలవాడు. రాగద్వేషాలు అతనికి తెలియవు. క్రమశిక్షణతో విద్యనేర్చుకొనే వాడు.

ఒకసారి సాందీపని మహర్షి అరణ్యానికి వెళ్ళి హోమసమిధలు తీసుకురమ్మని సుదాముని ఆజ్ఞాపించాడు. సుదాముడు అరణ్యానికి వెళుతుంటే అతనికి తోడుగా శ్రీకృష్ణుడుకూడా పయనమైనాడు. అరణ్యంలోకి వెళ్ళగానే నలువైపులా పుష్కలావర్త మేఘాలు కమ్ముకొని ఘోరున భీకరవర్షం కురవడం ప్రారంభించింది. ఆ సమయంలో శ్రీకృష్ణుడు సుదాముని చేతిని గట్టిగా పట్టుకొని ఆతనికి ధైర్యం చెప్పాడు. ఈలోపు సమిధలకై అరణ్యానికి వెళ్ళిన శ్రీకృష్ణకుచేలులను వెదుకుతూ సాందీపని మహర్షి అరణ్యానికి చేరుకున్నాడు. ఒకవైపు కారుచీకటి పైగా పెద్ద గాలివాన. శిష్యులు ఏమైనారో అని ఆవేదనతో గురువుగారు వెదక నారంభించారు. గురువుగారిని చూసిన వారిరువురూ నమస్కరించగా "కుమారులారా! ఇంత భీకర వర్షంలో నా ఆజ్ఞను మన్నించి సమిధలు సేకరించేందుకు వచ్చిన మీరిరువురి ధైర్యానికి, స్నేహానికి నేను ముగ్ధుడనైనాను. మీరిరువురు భవిష్యత్తులో స్నేహానికి మారుపేరుగా

ఉంటూ సుఖసంతోషాలతో సిరిసంపదలతో ఆయురారోగ్యాలతో, పిల్లా పాపలతో వర్ధిల్లుతారని ఆశీర్వదించాడు.

మరొకనాడు శ్రీకృష్ణుడు భోజనసమయంలో తనప్రక్కనే కూర్చున్న కుచేలుని విస్తరిలోని అపూపంలో కొంత భాగాన్ని ఆతనికి తెలియకుండా తీసుకున్నాడు. అది గమనించిన కుచేలుని ప్రక్కన కూర్చున్న మరొక సహపాఠి కృష్ణుడు తన విస్తరిలోంచి అపూపాన్ని కొంత దొంగిలించాడని ఫిర్యాదుచేశాడు. కుచేలుడు తన విస్తరిలోని మిగిలిన అపూపాన్ని కృష్ణునికి భక్తితో సమర్పించాడు. ఆ తరువాత చూడగా విష్ణుమాయచే సుదాముని విస్తరిలో రెండు అపూపాలు దర్శనమిచ్చాయి. అది గమనించిన వారందరూ ఆశ్చర్యపోయారు. సుదాముడు ఇదంతా శ్రీకృష్ణుని లీలగా భావించాడు.

శ్రీకృష్ణబలరాములు అచిరకాలంలోనే సకలవిద్యావిశారదులై గురుదక్షిణగా మృతుడైన గురుపుత్రుని సమర్పించి తల్లిదండ్రులవద్దకు పయనమైనారు. ఆ సందర్భంలో శ్రీకృష్ణసుదాములు ఒకరినొకరు కౌగిలించుకొని మధురజ్ఞాపకాలను గుర్తుచేసుకోసాగారు. ఆ దృశ్యాన్ని గమనించిన సాందీపని మహర్షి ' ఆహా ఒకరు సాక్షాత్తు పరమాత్మ మరొకరు సాక్షాత్తు పరమాత్మ భావము. ఇటువంటి మైత్రి ఇంతవరకు చూడలేదు. వీరి మైత్రి ఇలాగే వర్ధిల్లుగాక' అని ఆశీర్వదించాడు.

కాలం గడిచింది. శ్రీకృష్ణసుదాములు ఇరువురు పెరిగి పెద్ద వారయ్యారు. శ్రీకృష్ణుడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తూ అష్టమహిషీ మణులను వివాహమాడి సిరిసంపదలతో తులతూగే ద్వారకాధీశుడైనాడు. మరోవైపు సుదాముడు అనుకూలవతియైన వామాక్షి అనే కన్యను వివాహమాడి తనకున్నదానితోనే సర్దుకుంటూ జీవించసాగాడు. కాలం గడిచేకొద్దీ సుదాముని సంసారం పెరిగి పెద్దదయ్యింది. 'దరిద్రునికి సంతానమెక్కువ' అన్న చందంగా సుదాముని సంతానం దినదిన

ప్రవర్ధమానమయ్యిందేకానీ ఆతని సంపదకాదు. కటిక దారిద్ర్యం వారిని ఆవహించింది. దానితో కట్టుకున్న వస్త్రాలుకూడా చిరిగినవైనాయి. అందరు అతనిని కుచేల అని పిలువసాగారు. కుచేల అంటే చిరిగిన వస్త్రాలు కలవాడని అర్థం. మొదటినుండి పేదరికంలోనే జీవనం గడుపుతూ ఉన్నా, ఉన్నవాటితోనే సర్దుకుపోయేవాడు కుచేలుడు. భర్త కష్టసుఖాలలో సర్దుకుపోయే మహాసాధ్వీమణి కుచేలుని భార్య. ఆమె పేరు వామాక్షి. ఆ ఆదర్శ దంపతులకు తగ్గవారే ఆ సంతానం. కుచేలుని భార్య వామాక్షి తనకేమీ లేకపోయినా ఉన్నది తన భర్త, పిల్లలకు వండిపెట్టి తను పస్తులుండేది.

ఇలా ఉండగా కొన్నాళ్ళకు ఇంట్లో ఆహారం పూర్తిగా నిండుకుంది. పిల్లలు ఆకలితో నకనకలాడుతున్నా తల్లిదండ్రులను ఏనాడూ ఇది కావాలని అడగలేదు. పెదాలు ఎండిపోతే నీటితో తడుపుకొని వెళ్ళేవారు. కడుపులో ఆకలిమంటలు అధికమైతే నీటిని తాగి సర్దుకొనేవారు. ఎన్నాళ్ళలా ఉండగలరు? ఒకనాడు డొక్కలెండిపోయి కన్నీళ్లుకూడా ఆవిరై పోగా ఆ పిల్లలు విస్తరి ఆకులు చేతపట్టుకొని వెళ్ళి తల్లి చుట్టూతా చేరి అమ్మా చాలా ఆకలిగా ఉన్నదమ్మా ఏదోఒకటి ఒక్క ముద్ద పెట్టవా? అని దీనంగా బ్రతిమలాడారు. తల్లి కాళ్ళు చేతులు పట్టి లాగుతూ ఏడ్వడం ప్రారంభించారు. కుచేలుడు మాత్రం నిరంతరం పరమాత్మ ధ్యానంలోనే గడిపేవాడు. పిల్లల ఆకలిబాధను చూచి ఆవేదన దిగమింగుకొనలేక కుచేలునివద్దకు వెళ్ళింది. కుచేలుడు సరిగ్గా అదేసమయానికి హరిపూజ ముగించి నివేదనకు ఏమైనా ఉందేమో చూడమని భార్యకు చెప్పాడు.

అప్పుడు ఆ పతివ్రతామతల్లి 'స్వామీ! పిల్లలు ఆకలిబాధను తాళలేకపోతున్నారు. మనం ఇంకెన్నాళ్ళీ దరిద్రాన్ని అనుభవించాలి. సకలలోకాలను పరిపాలించే అధినాయకుడు, విశ్వవ్యాపకుడు, పరంధాముడు, దయార్ద్రహృదయుడు, కరుణాపూర్ణవరప్రదుడు, ద్వారకా

నివాసుడు అయిన శ్రీకృష్ణపరమాత్మ మీకు మంచి మిత్రుడని చెప్పారుకదా! మీరు ఆ పరమాత్ముని ఎందుకు ఆశ్రయించరాదు. పరమాత్మ ఆశ్రితజన వత్సలుడు కదా మీరు ఆ పరమాత్ముని దర్శిస్తే మన కష్టాలన్నీ తొలగి సుఖసంతోషాలతో వర్ధిల్లవచ్చును. మన దారిద్ర్యం అనే అంధకారంనుండి ఆతనే మనను రక్షించగలడు.

"బాలసఖుడైన అప్పద్మపత్రనేత్రు
గాన నేగి దారిద్ర్యాంధకార మగ్ను
లైన మమునుద్ధరింపుము హరికృపా క
టాక్ష రవిదీప్తి బడసి మహాత్మనీవు"

వరదుడు సాధుజనభక్తవత్సలు డార్తశరణ్యు డిందిరా
వరుడు దయాపయోధి భగవంతుడు కృష్ణుడు తా గుశస్థలీ
పురమున యాదవ ప్రకారముల్ భజియింపగనున్నవాడు నీ
వరిగిన నిన్న జూచి విభుడప్పుడ యిచ్చు ననూనసంపదల్

శ్రీకృష్ణుడు సాధుజనభక్తవత్సలుడు, కోరిన వరాలను ప్రసాదించే వాడు. శరణన్నవారిని రక్షించేవాడు. సంపదలకు నిలయమైన లక్ష్మీదేవికి భర్త, దయాసముద్రుడు. కుశస్థలీనగరంలో ఉంటూ యాదవుల పూజలందుకుంటున్నాడు. మీరు వెళ్ళి ఆతనిని దర్శిస్తేచాలు. ఏమీ అడుగకుండానే మీకు సంపదలను ప్రసాదిస్తాడు. కనుక తమరు ఒకసారి శ్రీకృష్ణపరమాత్మదర్శనానికి వెళ్ళడం సముచితంగా ఉంటుందని నా భావన' అని పలికింది.

భార్య చెప్పిన మాటలలో కష్టాలు తొలగి సుఖాలు ప్రాప్తించడం అన్న విషయం అటుంచి శ్రీకృష్ణదర్శనానికి వెళ్ళడం అనేది కుచేలునికి చాలా ఆనందాన్ని కలిగించింది. కృష్ణదర్శనంతో ఇహము పరమూ కలిసివస్తాయని భావించాడు. ఆమె సద్బుద్ధికి ఆనందించాడు.

కుచేలుడు భార్యతో 'నీవు చెప్పినది సమంజసంగానే ఉన్నది కానీ, పెద్దలు, పూజ్యులు, పిల్లలు ఉన్న చోటకు ఉట్టిచేతులతో వెళ్ళరాదుకదా! పత్రం, పుష్పం, ఫలం, తోయం ఏదో ఒకటి తీసుకెళ్ళాలని మన ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. శ్రీకృష్ణునికి సమర్పించేందుకు మనఇంట ఏమైనా ఉన్నాయా? అని అడిగాడు.

అప్పుడు ఆ సాధ్వీశిరోమణి ఇల్లంతా వెదికి ఎక్కడో మూలన ఒక పాత్రలో ముక్కిపోయిన కాసిని అటుకులను తెచ్చి చిరిగిన కుచేలుని అంగవస్త్రంలోనే ఒకమూలన పడిపోకుండా జాగ్రత్తగా కట్టి కృష్ణదర్శనానికి ఇప్పుడు వెళ్ళిరమ్మని కోరింది. కుచేలుడు భార్య కోరికపై కుశస్థలీ నగరానికి బయలుదేరాడు.

ఒకవైపు కృష్ణుని దర్శనానికి వెళుతున్నానన్న ఆనందం ఉంటే మరోవైపు ఎప్పుడో గురుకులంలో చూసిందే తన మిత్రుని మరలా చూసిందేలేదు. ఎలా ఉన్నాడో...ఎక్కడో అంతఃపురంలో దాసదాసీ జనులతో సేవలందుకుంటూ ఉంటాడు. ఆతనివద్దకు అసలు నన్ను ద్వారపాలకులు లోనికైనా పంపుతారో లేదో.. వారు అడ్డగించి నన్ను ఎక్కడికి పోతున్నావని అడిగితే ఏంచెప్పాలి? నేను శ్రీకృష్ణుని స్నేహితుడిని అంటే వారు నమ్ముతారా? వారికి నేను ఏమిచ్చి లోపలికి వెళ్ళగలను. లోపలికి వెళ్ళినా శ్రీకృష్ణుడు ఇప్పుడు నన్ను గుర్తుపడతాడో లేడో.. ఆహా.. నా కృష్ణుడు అలాంటివాడు కాడు. నేను వచ్చానని తెలిస్తే తానే ఎదురు రాగలడు. అని ఇలా అనేక విధాలుగా ఆలోచిస్తూ ఆ నగరంలోని సౌధాల అందచందాలను, అక్కడి ప్రజల వైభవాన్ని చూస్తూ ద్వారకానగరంలో అత్యంత సుందరమైన ఒక మహాసౌధం వద్దకు చేరుకున్నాడు. ఆ సౌధం చాలా హడావిడిగా ఉన్నది. అనేక మంది స్త్రీలు ఆ సౌధంలోనుండి వస్తూన్నారు. ఆ సౌధం బంగారు గోపురాలతో అలంకరించబడింది. ఆ

సౌధంలో శ్రీకృష్ణుడు ఉన్నట్లు తెలుసుకుని ఆ మందిరం వద్దకు వెళ్ళాడు. శ్రీకృష్ణుని నివాసాన్ని చేరుకున్న ఆనందంతో ఆతని కళ్ళు ఆనంద బాష్పాలతో నిండిపోయాయి. సరాసరి ఆ భవనంలో ప్రవేశించాడు కుచేలుడు.

ఏమి వైభవం... శ్రీకృష్ణుడు ఎదురుగా హంసతూలికాతల్పంపై ప్రియభార్యామణితో సంభాషిస్తుండగా ఎంతోమంది శ్రీ కృష్ణునికి సేవలు చేస్తున్నారు... పాదాలు ఒత్తుతున్నవారు కొందరు, ఊయల ఊపుతున్న వారు కొందరు, వింజామరలు వీస్తున్నవారు కొందరు, గంధం పూస్తున్న వారు కొందరు అబ్బబ్బబ్బ వైభవమంటే శ్రీకృష్ణునిదే అనుకున్నాడు. అంతమందిలో శ్రీకృష్ణుని అందాన్ని చూస్తూ అలానే నిలుచుండిపోయాడు. శ్రీకృష్ణుడు సాక్షాత్తు నవమన్మథునిలా ఉన్నాడు.

ఇందీవరశ్యాము వందిత సుత్రాము
గరుణాల వాలు భాసుర కపోలుఁ
గౌస్తుభాలంకారుఁ గామితమందారు
సురుచిరలావణ్యు సురశరణ్యు
హర్యక్షనిభమధ్యు నఖిలలోకారాధ్యు
ఘనచక్రహస్తు జగత్ప్రశస్తు
ఖగకులాధిపయానుఁ గైశేయపరిధాను
బన్నగ శయనును నబ్జాతనయను
మకరకుండల సద్భూషమంజుభాషు
నిరుపమాకారు దుగ్ధసాగరవిహారు
భూరిగుణసాంద్రు యదుకులాంబోధిచంద్రు
విష్ణు రోచిష్ణు జిష్ణు సహిష్ణుఁ గృష్ణు ॥

నల్లటి కలువపూలను పోలిన శరీరకాంతితో, కరుణారసపూరిత నేత్రాలతో, మిలమిల మెరిసిపోతున్న మకరకుండలాలతో అలంకరింపబడిన చెవులతో, మెడలో తళతళ మెరిసే కౌస్తుభమణితో, సింహపు నడుమువంటి సన్నటి నడుముతో పసుపువర్ణముకలిగిన పట్టువస్త్రాన్ని ధరించి సాక్షాత్ మన్మథమన్మథునిలా ఉన్నాడు.

చక్రాన్ని చేతధరించి దేవతలకుకూడా అభయాన్ని ప్రసాదించే చక్కటి మాటకారితనం కలవాడు, యదుకులమనే సముద్రానికి చంద్రునివంటి వాడు. ఈతడు గరుడవాహనుడు, శేషశయనుడు అయిన సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే అని అనుకుంటూ తనను తాను మైమరచిపోయి ముందుకు వెళ్ళాడు.

కటిక దారిద్ర్యంతో, చిరిగిన వస్త్రాలతో, తైలసంస్కారంలేకుండా ఎర్రగామారిన వెంట్రుకలతో, భుజాన ఒక జోలెను ధరించి వస్తున్నా, విద్యతో తేజోమయుడైన బ్రాహ్మణోత్తముని దూరంనుండే చూచి తనబాల్య సఖుడైన సుదామునిగా గుర్తించాడు. స్వయంగా తానే హంసతూలిక తల్పంపైనుండి వెంటనే లేచి ఎదురేగి సుదాముని మిత్రమా! స్వాగతం అంటూ కౌగిలించుకున్నాడు. ఆతనిని తోడ్కొనివచ్చి తను కూర్చునే హంసతూలికాతల్పంపై కుచేలుని కూర్చోబెట్టాడు. స్నేహితుడనే ప్రేమతో, బ్రాహ్మణోత్తముడనే గౌరవంతో బంగారు చెంబులో నీళ్ళుతెప్పించి బంగారు పళ్ళెంలో ఆతని పాదాలను ఉంచి పాదపూజచేశాడు. ఆ జలాన్ని తన శిరస్సుపైన, తన పరివార శిరస్సుపైనా ప్రోక్షణ చేశాడు. కస్తూరి, చందనాలతోకూడిన సుగంధ ద్రవ్యాలను కుచేలుని శరీరానికి పూశాడు. సువాసనలు వెదజల్లే వివిధ పుష్పాలతో కట్టిన పూమాలను ఆతనిమెడలో ధరింపజేశాడు. ఇష్టసఖుల చేతులలో ఉన్న వీవనలు తానే అందుకుని స్వయంగా వీవన వీచాడు. ఇలా అనేక ఉపచారాలు చేసి గోవత్సంతో కూడిన గోవును ఆతనికి దానంగా ఇచ్చాడు.

ఆ తరువాత శ్రీకృష్ణుని పట్టపురాణి రుక్మిణీదేవి వీవెనలు తానందుకుని వీస్తుండగా కృష్ణుడు కుచేలునితో..'మిత్రమా ఎంత కాలమయ్యింది నిన్ను చూచి.. అంతా కుశలమే కదా.. అంటూ తమ గురుకుల జీవితంలోని మధుర ఘట్టాలను ఒక్కొక్కటిగా గుర్తుచేసుకుంటూ.. ఇరువురూ ఆనందబాష్ప నయనపూరితులు అయ్యారు. ఆ దృశ్యాన్ని ఆశ్చర్యంగా చూస్తున్న ఇష్టసఖులు, పరివారజనం

"ఏమి తపంబు సేసెనొకొ! యీ ధరణీదివిజోత్తముండు తొల్
బామున! యోగివిస్ఫుర దుపాస్యకుఁడై తనరారు నీ జగ
త్స్వామి రమాధినాథు నిజతల్పమునన్ వసియించి యున్నవాఁ
డీ మహనీయమూర్తి కెనయే మునిపుంగవు లెంతవారలున్?

తన మృదుతల్పమందు వనితామణి యైన రమాలలామ పొం
దును నెడఁగాఁ దలంపక యదుప్రవరుం డెదురేఁగి మోదముం
దనుకఁగఁ గౌఁగిలించి యుచితక్రియలం బరితుష్టుఁ జేయుచున్
వినయమునన్ భజించె ధరణీసురుఁ డెంతటి భాగ్యవంతుడో?"

ఈ బ్రాహ్మణోత్తముడు పూర్వజన్మలో ఎంతటి తపస్సు చేసుకున్నాడో కదా! యోగులచేత దేవతలచేత పూజింపబడే ఈ జగన్నాథుడు, లక్ష్మీపతి తను కూర్చునే ఆసనంపై ఈతనిని కూర్చోబెట్టి గౌరవించాడు. రుక్మిణీ దేవితో హంసతూలికాతల్పంపై కూర్చుని భాషిస్తున్న స్వామి, ఆమెను కూడా వదలి స్వయంగా ఎదురువెళ్ళి ఆనందంగా ఆతనిని కౌగిలించుకుని స్వాగతం పలికి సకలమర్యాదలుచేసి సత్కరించాడు. సాక్షాత్తు జగన్నాథుని చేత పూజింపబడిన ఈ బ్రాహ్మణోత్తముడు, ఎంతటి భాగ్యవంతుడో కదా! అని పరివారజనమంతా అనుకుంటూ ఆశ్చర్యానికి లోనైనారు.

తమ బాల్యజీవితవిశేషాలను గుర్తుకు తెచ్చుకుని మాట్లాడుతున్న కృష్ణునితో కుచేలుడు 'కృష్ణా మనగురుకులవాస సందర్భంలో నీవు చేయని పనంటూ ఉన్నదా? నీవే జగద్గురువువు మళ్ళీ నీకొకగురువంటూ

ఉంటారా? అయినా ఇదంతా నీ లీలావినోదమే కదా ! లీలామానుష రూపుడవు నీవు కృష్ణయ్యా!' అంటూ ఇరువురూ నవ్వుకున్నారు.

ఆ తరువాత కృష్ణుడు కుచేలునితో 'అవును ఇంతకూ నీ బాల్య సఖునికోసం ఏం తీసుకొచ్చావేమిటి? నీకు నా మీద భక్తి ఎక్కువ కదా! ఆ భక్తితో నావద్దకు బయలుదేరేముందు ఏదోఒకటి తెచ్చేఉంటావు. నీ వేమితెచ్చినా అది ఎంత చిన్నదైనా నేను దానిని అపూర్వమైనదిగా భావించి స్వీకరిస్తాను.

దళమైనఁ బుష్పమైనను
ఫలమైనను సలిలమైనఁ బాయని భక్తిం
గొలిచిన జను లర్పించిన
నెలమిన్ రుచిరాన్నముగనె యేను భుజింతున్.

నిశ్చలమైన భక్తితో పత్రమిచ్చినా పుష్పమిచ్చినా ఫలాన్నిచ్చినా చివరకు నీటిని ఇచ్చినాకూడా నేను అపూర్వమైనదిగా స్వీకరిస్తాను. భక్తిలేకుండా ఆడంబరంగా మేరుపర్వతమంత బంగారిచ్చినా కూడా నేను దానిని స్వీకరించను. ఇంతకూ నాకు ఏమి తీసుకొచ్చావు మిత్రమా! అంటూ కుచేలుని చిరిగిన ఉపరివస్త్రంలో తీసుకువచ్చిన అటుకుల మూటను చూస్తూ అడిగాడు.

కుచేలుడు ఇంత గొప్ప ఆతిథ్యమిచ్చిన జగన్నాథునికి పిడికెడు ముగ్గిన అటుకులు ఇవ్వడం చాలా అవమానకరంగా భావించి సిగ్గుతో తలదించుకుంటూ ఆ అటుకులమూటను దాచే ప్రయత్నం చేశాడు. సుదాముని రాకకు గల కారణాన్ని తన దివ్యదృష్టితో గ్రహించాడు కృష్ణుడు. "గత జన్మలో ఈ కుచేలుడు ఐశ్వర్యాన్ని కోరి మమకారాన్ని పెంచుకున్నాడు. ఐశ్వరంలోకూడా నేనే ఉన్నానన్న విషయాన్ని మరచి

పోయాడు. సంపదలనే కోరుకున్నాడు. ఆ కారణంగా ఈ జన్మలో దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నాడు. ఇప్పుడు కూడా భక్తితో నన్ను దర్శించాలని రాలేదు. నన్ను దర్శించడం వల్ల భార్యముఖంలో ఆనందాన్ని కలిగించేందుకే వచ్చాడు. ఏ కారణంగా వచ్చినా నా దర్శనభాగ్య పుణ్యం వ్యర్థమవదు. గతజన్మలో ఈతని కోరిక తీరలేదు. అది ఈ జన్మలో తీరుస్తాను. అష్టైశ్వర్యాలు ఈతనికి ప్రసాదించి పరీక్షిస్తాను" అనుకున్నాడు శ్రీకృష్ణుడు.

కుచేలుడు సిగ్గుతో దాస్తున్న అటుకులమూటను చూసి 'అదేమిటి మిత్రమా! నాకొరకు తెచ్చింది నాకు ఇవ్వవా?' అంటూ ఆ మూటను తానే తీసుకున్నాడు. ఆ మూటను విప్పి అందులోని అటుకులను చూస్తూ 'ఆహా! నాకెంతో ప్రియమైన అటుకులు. ఎంతకాలమైందో వీటిని ఆరగించి' అంటూ ఒక పిడికిలి తీసి నోట వేసుకున్నాడు. "ఈ పిడికెడు అటుకులు నాతోపాటు సకల లోకాలను తృప్తిపరచగలవు" అని రెండవ పిడికిలితో అటుకులు తీసుకోబోతుండగా రుక్మిణీదేవి శ్రీకృష్ణుని వారిస్తూ 'స్వామి మీరు ఇక ఈ పిడికిలి కూడా ఆరగిస్తే మీతోపాటు మేముకూడా ఆ బ్రాహ్మణునికి సేవకులు కావాల్సివస్తుంది. ఇక చాలు' అని ఆపింది. శ్రీకృష్ణుడు సరే నన్నాడు.

ఆ రాత్రి కుచేలుడు శ్రీకృష్ణుని భవనంలోనే సేదతీరాడు. మెత్తటి పాన్పుపై పడుకుని రాజభోగాలనుభవించాడు. మరునాడు తెలవారగానే స్నానసంధ్యాదులు ముగించి శ్రీ కృష్ణుని అనుమతితో తిరుగు ప్రయాణం అయ్యాడు. మార్గమధ్యానికి రాగానే తను వచ్చిన కారణం గుర్తుకు వచ్చింది కుచేలునికి. తన భార్య కృష్ణదర్శనానికి ఎందుకు పంపిందో గుర్తు చేసుకున్నాడు.'ఎంతపనైపోయింది. శ్రీకృష్ణుడు నన్ను ఈ విషయాన్ని మరిపించడానికే కాబోలు ఇంత మర్యాదలు చేసి నన్ను రాజభోగాలను అనుభవింపజేశాడు.. జగన్నాథుడే.. భక్తవత్సలుడే.. నాకేం కావాలో...

నేనెందుకు వచ్చానో తెలుసుకోలేడా? తెలిసే నన్ను మరిపించాడా? ఏది మాయో ఏది సత్యమో ఎవరికీ తెలియదు.

కృష్ణుడు మహా మాయావి. అందుకే నన్ను కోరిక కోరకుండా మాయలో పడవేశాడు. అయినా ఆ పరాత్పరుని దర్శనం కావడమే గొప్ప విశేషం. సాక్షాత్తు బ్రహ్మరుద్రాదులకు సైతం సాధ్యం కాని శ్రీహరి దర్శనభాగ్యం నాకు కలిగింది. నేను ఎంతటి పుణ్యం చేసి ఉండకపోతే లీలామానుష స్వరూపుడు నన్ను ఇంతగా ఆదరిస్తాడు. ఇంతగా గౌరవిస్తాడు. లక్ష్మీదేవికి నివాసమైన హృదయంతో నన్ను కౌగిలించు-కున్నాడు. రుక్మిణీదేవిచేత వీవెనలు వీయించాడు. తానే స్వయంగా నా పాదపూజచేశాడు. పైగా ఆ నీటిని పాదతీర్థంగా తానే కాక తన పరివారానికి ప్రోక్షణ చేశాడు. కానీ ధనం మాత్రం ఒక్కరవ్వంత కూడా ప్రసాదించలేదు. దరిద్రునికి మితిమీరిన సుఖాలను ప్రసాదిస్తే అన్నీ మరచిపోతాడని కృష్ణునికి తెలుసు. అందుకే నాకు తన ఆతిథ్యంతో స్వర్గసుఖాలను ప్రసాదించి వచ్చిన పనిని మరిపించాడు. అయినా ఇదంతా ఆతని లీల..” అనుకుంటూ ఇంటిదారిపట్టాడు.

తన ఇంటి మార్గానికి రాగానే ఆశ్చర్యపోయాడు. సూర్యకాంతిని తిరస్కరించే బంగారుకాంతులీనే మేడలు, వజ్రవైఢూర్యాలు పొదిగిన వాకిళ్ళు, పచ్చటి ఉద్యానవనాలు. ఆ ఉద్యానవనాలలోని పండ్లను ఆరగించేందుకు వచ్చిన చిలుకలు, వివిధరకాల అందమైన పక్షులు చంగుచంగున గెంతుతున్న జింకలు, ఆనందంతో పురివిప్పి నాట్యమాడు తున్న నెమళ్ళు. చక్కగా తీర్చిదిద్దిన సెలయేర్లు, స్నానపు కొలనులు. రంగురంగుల పుష్పాలతో అలంకరించబడిన స్వాగత తోరణాలు. ఆ బంగారు సౌధాలలో హడావిడిగా సంచరిస్తున్న దాసదాసీజనం. వారు ధరించిన ఆభరణాలుకూడా అమూల్యమైన మణులు పొదిగినవే.

దేవలోకాన్ని పోలినట్లు ఉంది ఆ ప్రాంతం. తనకళ్ళను తానే నమ్మలేక పోయాడు కుచేలుడు. "ఆలోచనలో పడి బహుశా మార్గం తప్పినట్లున్నాను. లక్ష్మీప్రసన్నతను పొందిన సంపన్నులు ఉండే ప్రాంతమిది" అనుకుని వెనుకముందు చూసుకుంటూ నిలబడిపోయాడు.

ఈలోపు కొంతమంది అందమైన స్త్రీలు కుచేలుని వద్దకు మేళతాళాలతో వచ్చి చందనాన్ని మైపూతగాపూసి ఆ సౌధంలోనికి రమ్మని ఆహ్వానించి తీసుకెళ్ళారు. ఆ సౌధం అందచందాలు చూసుకుంటూ లోనికి వెళ్ళాడు. ఆశ్చర్యం ఎదురుగా సాక్షాత్తు మహాలక్ష్మీదేవియే నిలబడినదా అన్నట్లు వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలు పొదిగిన బంగారు ఆభరణాలను ధరించి నమస్కరిస్తున్న తన భార్యామణి వామాక్షిని చూశాడు. ఇక నేను కుచేలుడినికాదు కుబేరుడినే అనుకున్నాడు. వామాక్షి సుదాముని ఉచితాసనంపై కూర్చోబెట్టి సకలోపచారాలు చేసి పట్టు వస్త్రాలను బంగారు ఆభరణాలను ధరింపజేసింది. ఆ తరువాత సుదాముడు ఆ మేడలోని నలుమూలలా తిరిగి చూశాడు. అద్భుతమైన వజ్రవైఢూర్య మరకతమాణిక్యాలతో కూడిన గోడలు, చంద్రశాలావేదికలు. మతిపోయే సంపదలన్నీ ఇప్పుడు ఆతని అధీనంలోనే ఉన్నాయి. అయినా ఆతని మనసు మాత్రం నిర్మలంగా శ్రీకృష్ణభక్తిపైనే నిలకడగా ఉంది. గతజన్మలోలాగా సంపదలనే భ్రమలో పడలేదు. ఇదంతా శ్రీకృష్ణుని లీల.. భగవంతుని మాయ అనే భావించసాగాడు.

నిజానికి ఒక్కపూటకూడా తినడానికి గతిలేని కటిక దారిద్ర్యాన్ని అనుభవించిన తనకు ఒక్కసారిగా ఇంత సంపద ఎలా వచ్చింది. నేను కృష్ణుడిని ఏమీ అడగలేదు. కృష్ణుడు నీకు ఏంకావాలనీ అడగలేదు. వెళ్ళివస్తానంటే సరేనని సాదరంగా సాగనంపాడు. కానీ సాగనంపే ముందు నాపై ఆతని కంటినుండి ప్రసరించిన దయ అనే కాంతి ఉందే అదే ఈ

సంపదలకు మూలం. సర్వవ్యాపి అయిన పరమాత్ముడు కృష్ణుడు. ఆతనికి నాకేంకావాలో తెలుసుకోవడం పెద్ద పనికాదు. నిశ్చలభక్తిని కలిగి ఉంటే అడగకుండానే మనకేంకావాలో అది అనుగ్రహిస్తాడు పరమాత్ముడు. కోరికలు వ్యామోహాలు ఉంటే ఎంతటి సంపద ఉన్నా వాళ్ళు కటికదరిద్రులే అవుతారు. పరమాత్ముడు మనకు సంపదలను ఇచ్చి వాటిపై వ్యామోహాన్ని పెంచుకుంటాడా? లేక వాటిలోకూడా నన్నే దర్శిస్తాడా? అని పరీక్షిస్తాడు. భగవంతునికి మనపై అనుగ్రహం కలగాలంటే మనం సంపూర్ణ సమర్పణా బుద్ధిని కలిగి ఉండాలి. “త్వదీయ వస్తు గోవింద తుభ్యమేవ సమర్పయేత్” అనే సంపూర్ణ సమర్పణాబుద్ధితో ఉంటే భగవంతుని అనుగ్రహం మనపై తప్పక కలుగుతుంది. ఇటువంటి భక్తి సర్వదా నాకు ఇలానే ఉండాలి అని కుచేలుడు అనుకున్నాడు.

కుచేలుడు కటిక దారిద్ర్యంతో చిరిగిన, మలిన వస్త్రాలను ధరించి అందరూ అపహసించేలా ఉన్నా శ్రీకృష్ణపరమాత్ముడు తన స్నేహితుడైన కుచేలుని ఆదరించి, అందరూ ఆశ్చర్యపోయేలా అతిథిసత్కారాలు చేశాడు. అంతేకాదు కుచేలుని చిరిగిన వస్త్రంలో ఒకమూలన భక్తితో తెచ్చిన ముక్కిన అటుకులనుకూడా స్వయంగా తానే తీసుకుని ఏమాత్రం సంకోచంలేకుండా తిన్నాడు. కుచేలుడు అడగకుండానే మనసులో కోరుకున్నదానికన్నా ఎక్కువగా అనుగ్రహించాడు.

ఇంతటి అపార కరుణకు పాత్రతను ఇచ్చినది భగవంతునిపై భక్తి. ‘భక్తిరేవ గరీయసి’. నిశ్చలభక్తితో భగవంతుని ఆరాధిస్తే ఆతడే మనకు ఎప్పుడు ఏం ప్రసాదించాలో అవన్నీ ప్రసాదిస్తాడని కుచేలుని కథ ఋజువుచేస్తున్నది.

* * *

# 6. ఇంద్రద్యుమ్నుడు

పూర్వం పాండ్యదేశాన్ని ఇంద్రద్యుమ్నుడు అనే మహారాజు పరిపాలిస్తుండేవాడు. అతడు ధర్మప్రవర్తకుడు. ఆతని పాలనలో దేశం సస్యశ్యామలంగా సుభిక్షంగా ఉండేది. అతడు గొప్ప విష్ణుభక్తుడు.

ప్రతినిత్యము విష్ణుఆరాధనచేయనిదే పచ్చి గంగైనా ముట్టేవాడు కాదు. గృహస్థాశ్రమధర్మాన్ని అనుసరించి ఇంటికి వచ్చిన అతిథి అభ్యాగతులకు లేదనకుండా దానధర్మాలు చేసేవాడు. మహాత్ములను నిరంతరం సేవించేవాడు. శ్రీహరికథామృతాన్ని నిరంతరం వీనుల విందుగా మహనీయులచే చెప్పించుకుని వినేవాడు.

ఇంద్రద్యుమ్నుని సంతానం యుక్తవయస్కులు కాగానే వారికి చేయవలసిన సంస్కారాలన్నీ నిర్వర్తించి రాజ్యభారాన్ని అప్పగించాడు. తాను వానప్రస్థాశ్రమధర్మంలో అడుగిడి అరణ్యాలకు బయలుదేరి ఒక సుందర ప్రదేశంలో ఆశ్రమాన్ని ఏర్పాటుచేసుకున్నాడు. అక్కడే నివసిస్తూ మౌనవ్రత దీక్షను పూని ప్రతినిత్యము శ్రీహరిని ఆరాధిస్తూ ఉండేవాడు.

ఇదిలా ఉండగా ఒకరోజు ఆ మార్గంలో వెళుతున్న అగస్త్యమహాముని ఇంద్రద్యుమ్నుని ఆశ్రమానికి విచ్చేశాడు. సరిగ్గా అదే సమయానికి ఇంద్రద్యుమ్నుడు మౌనవ్రతంతో విష్ణుపూజామగ్నుడై ఉన్నాడు. అందువల్ల మహర్షిరాకను గమనించలేదు. తనకు అతిథి సత్కారం చేయలేదని కోపగించిన అగస్త్యమహర్షి "ఓరీ మదాంధా! మహర్షులు ఇంటికి వచ్చినాకూడా లెక్కచేయక అతిథి సత్కారాలుచేయక మిన్నకున్నావు. ఏ మదాంధకారంతో నీవు నన్ను గౌరవించలేదో అదే మదంతోకూడా మదపుటేనుగువవుదువు గాక" అని శపించాడు.

'ఋషీణాం వాచ అర్థానుధావతే" అన్న వాక్యాన్ని అనుసరించి ఇంద్రద్యుమ్నుడు మహర్షిశాపకారణంగా గజేంద్రునిగా మారి వనగిరులలో సంచారం చేస్తూ త్రికూటపర్వతాన్ని చేరుకున్నాడు.

మరోవైపు ఆ అరణ్యంలో ఆడ ఏనుగుల సమూహం ఒకటి మార్గం తప్పి సంచరిస్తూఉండగా గజేంద్రుడు వాటిని తన వెంట తీసుకొని త్రికూట పర్వతాన్ని చేరాడు.

మరోవైపు నిరంతరం స్త్రీసాంగత్యంతో సుఖసంతోషాలలో తేలియాడే హూహూ అనే గంధర్వరాజు గంధర్వ కాంతలతో కలిసి ఒకానొక సరోవరంలో జలక్రీడలాడుతూ ఉన్నాడు. ఆ మార్గాననే వెళుతున్న దేవలుడు అనే మహర్షి సాయం సంధ్యాకాలం కావడంతో హూహూ జలక్రీడలాడుతున్న సరోవరంలో స్నానసంధ్యాదులకొరకు వెళ్ళాడు. గంధర్వకాంతలతో జలక్రీడలాడుతున్న హూహూను కాసేపు వేచి ఉండమని కోరాడు. అయితే గంధర్వరాజు మహర్షి పలుకులను తిరస్కరించాడు. పైగా గంధర్వకాంతలముందు తన గొప్పతనాన్ని ప్రదర్శించాలని భావించి నీటి అడుగుభాగం గుండా వెళ్ళి సంధ్యావందనం ఆచరిస్తున్న దేవలమహర్షి పాదాలను పట్టి లాగేశాడు. తద్వారా మహర్షి నీటిలో మునిగిపోయాడు. హూహూ దుశ్చర్యకు కోపగించిన దేవల మహర్షి "ఓరీ మదాంధుడా! ఎలాగైతే నీటి అడుగుభాగం గుండా వచ్చి నా పాదాలు పట్టి లాగి నన్ను అవమానించావో అలాగే జలచరమైన మొసలివై చరించుదువు గాక" అని శపించాడు.

దేవలుని శాపవశాన హూహూ మొసలిగా మారి త్రికూటపర్వతంపై ఉన్న ఒక అందమైన సరోవరంలో నివసించసాగాడు.

గజేంద్రుడిగా మారిన ఇంద్రద్యుమ్నుడు పరివారంతో కలిసి త్రికూట పర్వతంలో సంచరిస్తూ మొసలికి ఆవాసమైన సరోవరాన్ని చేరాడు. ఆ సరోవరం అందమైన కమలాలతో లతాసమూహాలతో అలరారుతున్నది. గజేంద్రము తన పరివారంతో కలిసి ఆ సరోవరంలో దిగి స్వేచ్ఛగా జల క్రీడలాడసాగింది. అందులోని కమలపుష్పాలను తమ తొండములతో పెకలిస్తూ, తమనాథుడైన గజేంద్రునిపై వేస్తూ, సరోవరంలోని మట్టిని ఒకదానిపై ఒకటి వేసుకుంటు క్రీడిస్తున్నాయి.

ఆ సరోవరంలోనే నివసిస్తున్న మొసలి ఈ అల్లకల్లోలాన్ని చూసి ఏవో జంతువులు సరస్సులో ఉన్నాయని భావించి నీటిలోపలిగుండా వెళ్ళి గజేంద్రుని కాలిని గట్టిగా పట్టేసింది.

గజేంద్రము మొసలిపట్టును విడిపించుకునే ప్రయత్నంలో తన పొడవైన తొండంతో కొట్టిన దెబ్బకు మొసలి చావుదెబ్బ తిని నీళ్ళలో పడిపోయింది. వెంటనే అది తేరుకొని మళ్ళీ ఏనుగు ముందరి కాలిని పట్టుకుని మడుగులోకి ఈడ్చింది. ఏనుగు మొసలిని గట్టుపైకి లాగింది. “ఏనుగు కంటె మొసలి, మొసలి కంటె ఏనుగు బలమైనవి” అనుకుంటూ అన్ని లోకాల్లోని వీరులు ఆశ్చర్యపోయారు.

కరి మకరి రెండూ ఎడతెరపి లేకుండా ముట్టెలతో తాకుతూ, తలలు ముక్కలయ్యేటట్లుగా, నెత్తురు కారేటట్లు వాడిపండ్లతో పొడుచుకున్నాయి. పట్టు వదలకుండా గట్టిగా నిలదొక్కుకున్నాయి. సరస్సులో నీళ్ళు రక్తంగా మారి సుళ్ళు తిరుగుతున్నాయి. వాటి పోరాటం భయంకరంగా సాగింది. ఆ సమయంలో మొసలితో పోరాడుతున్న గజరాజును ఒంటరిగా విడిచిపెట్టి వెళ్ళలేక ఆడ ఏనుగులు చూస్తూ ఉండిపోయాయి.

మొసలికి నీళ్ళలోనే స్థానబలం కావడంవల్ల క్రమంగా దానికి బలమూ, పట్టుదలా పెరిగాయి. గజరాజు రాను రాను శరీరంలో శక్తి ఉడిగిపోయి కృష్ణ పక్షపు చంద్రునివలె అంతకంతకు నీరసపడుతున్నాడు.

మొసలి తన పరాక్రమంతో ఎన్నో విధాలుగా గజరాజును నొప్పించింది. గజేంద్రుడు ఘోరమైన మొసలి వాడి కోరలకు చిక్కి బాధతో అలమటించాడు. అయినా సరే గజరాజు విసుగు చెందకుండా వెయ్యి సంవత్సరాలపాటు అహోరాత్రులూ తీవ్రంగా పోరాటం కొనసాగించాడు.

పూర్వజన్మ పుణ్యఫలం వల్ల గజేంద్రము “ఈ మొసలిని ఎలా గెలవాలి? ఏ దేవుని ప్రార్థించాలి? ఎవరు నన్ను కాపాడతారు? ఈ మొసలిని అడ్డగించే వారెవ్వరు? అని ఆలోచన చేసింది.

చివరకు ఇలా ప్రార్థించింది.‘ఈ లోకం ఎవరి వల్ల పుడుతుందో, ఎవనితో కలిసి ఉంటుందో, చివరికి మరల ఎవరియందు కలిసిపోతుందో అటువంటి ఆ భగవంతుని శరణు కోరుతాను. శాశ్వతంగా అఖండమైన రూపంతో ప్రకాశించే ఆ దేవదేవుణ్ణి తలవంచి ప్రార్థిస్తున్నాను. దేవుడు ఆర్తుల ఎడల ఉంటాడంటారు. అన్ని దిక్కుల్లోను ఉంటాడని అంటారు. అటువంటి దేవుడు మరి ఉన్నాడో! లేడో!’ అని ఈ విధంగా తలంచి మనస్సులో భగవంతుని ప్రార్థించాడు. “భగవంతుడా! నాలో కొంచెం కూడా శక్తి లేదు. నా ధైర్యం తగ్గిపోయింది. ప్రాణాలు ఏ క్షణంలోనైనా పోయేటట్లున్నాయి. మూర్ఛ వస్తోంది. శరీరం చిక్కి పోయింది. నీవుతప్ప నాకు వేరే దిక్కు లేదు. రావయ్యా! కరుణించి నన్ను కాపాడవయ్యా” అని వేదుకున్నాడు.

కలఁ డందురు దీనులయెడఁ,
గలఁ డందురు పరమయోగి గణములపాలం
గలఁ డందు రన్ని దిశలను,
గలఁడు గలం డనెడువాఁడు గలఁడో లేఁడో

లా వొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యె బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను మూర్ఛవచ్చె దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్
నీవె తప్ప నితఃపరం బెఱుగ మన్నింపందగున్ దీనునిన్
రావే ఈశ్వర కావవే వరద సంరక్షింపు భద్రాత్మకా !

అని ఆర్తితో ప్రార్థించాడు గజేంద్రుడు. గజేంద్రుడు ప్రార్థించే సమయానికి శ్రీహరి అక్కడెక్కడో వైకుంఠపురంలోని మూలసౌధం ( ప్రధానమేడ). ఆ మేడ పరిసరాల్లో మందారవనం, అందులో అమృతసరస్సు. దాని చెంతనే పర్యంకము (మంచం). దానిపై లక్ష్మీదేవితో వినోదిస్తున్నాడు. గజేంద్రుని 'పాహీ! పాహీ! (రక్షించు,రక్షించు) అని పెట్టిన కేక శ్రీమన్నారాయణునికి వినిపించింది. భక్తరక్షైకదీక్షాదక్షుడైన శ్రీహరి వెంటనే బయలుదేరాడు. భక్తుని రక్షించడానికి భగవంతుడు బయలుదేరిన తీరు అమోఘం.

అల వైకుంఠపురంబులో నగరిలో నా మూల సౌధంబు దా
పల మందారవనాంతరామృత సరః ప్రాంతేందు కాంతోపలో
త్పల పర్యంక రమావినోది యగు నాపన్న ప్రసన్నుండు వి
హ్వల నాగేంద్రము "పాహిపాహి" యనఁ గుయ్యాలించి సంరంభియై

సిరికిం జెప్పడు శంఖచక్ర యుగముంజేదోయి సంధింపడే
పరివారంబును జీర డభ్రగపతిం బన్నింప డాకర్ణికాం
తర ధమ్మిల్లము జక్క నొత్తడు వివాదప్రోత్థిత శ్రీ కుచో
పరిచేలాంచలమైన వీడడు గజప్రాణావనోత్సాహియై.

గజేంద్రుని ప్రాణాలు కాపాడాలనే ఉత్సాహంతోఉన్న విష్ణుమూర్తి అప్పటిదాకా తనతో వినోదిస్తున్న లక్ష్మీదేవికీ చెప్పలేదు. శంఖచక్రాలను తీసుకోలేదు. సేవకులనెవరినీ పిలువలేదు. తన వాహనమైన గరుత్మంతుని రమ్మని చెప్పలేదు. చెవులపై జారిపడిన ముంగురులను చక్కదిద్దుకోలేదు. ప్రణయకలహవేళ తన భుజకీర్తులకు తగులుకున్న లక్ష్మీదేవి పవిట కొంగైనా వదల్లేదు. అలాగే వెళ్ళిపోయాడు.

స్వామి ఎక్కడికి వెళుతున్నాడో అర్థంకాక విష్ణువు వెనుక లక్ష్మీదేవి, ఆ వెనుక అంతఃపుర స్త్రీలు, గరుత్మంతుడూ, శంఖమూ, చక్రమూ, నారదుడూ, విష్వక్సేనుడు, వారి వెనుక వైకుంఠంలో నున్న మిగిలిన పరివారమూ విష్ణుమూర్తిని వెంబడించారు.

లక్ష్మీదేవి జగన్నాథుడు ఎక్కడకు వెళుతున్నాడో అడగాలనుకుంది, కాని అడగలేకపోయింది. ఆకాశమార్గాన్న వెళుతున్న విష్ణుమూర్తిని చూస్తున్న దేవతలు నమస్కారాలు చేసారు. కాని గజరాజును కాపాడాలనే తొందరలో మైమరచి వారి మ్రొక్కులు కూడా అందుకోలేదు. అలా బయలుదేరివెళ్ళిన నారాయణుడు త్రికూటపర్వతాన్ని చేరాడు. గజేంద్రుని దీనస్థితిని గమనించి మొసలిని చంపడానికి తన సుదర్శనచక్రాన్ని పంపాడు. ఆ చక్రం దేవతలను కాపాడేది, భూమండలాన్ని వణికించే వేగం కలది. ఎదురులేనిది. ఆ చక్రాయుధం రివ్వున వెళ్ళి మొసలి తలను ఖండించివేసింది. మొసలి పట్టువిడిచిపెట్టడంతో గజరాజు ఉత్సాహంగా కాళ్ళు కదిలించాడు. విష్ణువు పరమపావనమైన తన చేతిని అందించి గజరాజును మడుగులో నుండి బయటకు రావడానికి సాయపడ్డాడు. అతని వెన్ను తట్టి బాధ పోగొట్టాడు. విష్ణుమూర్తి హస్త స్పర్శతో గజేంద్రుని శరీరతాపమంతా చల్లారిపోయి, ఆతని అనుగ్రహంతో వైకుంఠాన్ని చేరుకొంటాడు.

'నిరంతరం ఎవరైతే నన్ను స్మరిస్తారో వారిని నేనెప్పుడు విస్మరించను' అని శ్రీహరి శ్రీమహాలక్ష్మికి చెప్పాడు.

ఆ మొసలి ముని శాపం వలన కలిగిన తన మకర రూపం వదలి 'హూహూ' అనే గంధర్వుడిగా మారిపోయింది. ఆ గంధర్వుడు స్వామిని మిక్కిలి భక్తితో కీర్తించి, స్వామి అనుగ్రహం పొంది గంధర్వలోకానికి వెళ్ళిపోయాడు.

ఈ గజేంద్రమోక్షం కథ చదివేవారికి, వినేవారికి కీర్తి పెరుగుతుంది. పాపాలు, దుఃఖాలు నశిస్తాయి. ఆపదలు అంతరిస్తాయి. శుభాలు కలుగుతాయి. ఇంతేకాదు, తెల్లవారుజామునే లేచి ప్రశాంతమైన మనస్సుతో విష్ణువునూ, గజరాజునూ, ఆ సరస్సునూ, శ్వేతదీపాన్నీ, పాలసముద్రాన్నీ, త్రికూటపర్వతశిఖరాలనూ, లక్ష్మీదేవినీ, ఆదిశేషుని, గరుడుని, శంఖ చక్ర గదాయుధాన్నీ, విష్ణుభక్తులను తలంచేవారు మృత్యుసమయంలో నిర్మలమైన విష్ణురక్షణ పొందుతారు.

* * *

# 7. అజామీళుడు

పూర్వం కన్యాకుబ్జమనే పట్టణంలో అజామీళుడు అనే ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు పూర్వజన్మ సుకృతముచేత ఒక సదాచార సంపన్నుడైన బ్రాహ్మణదంపతులకు జన్మించాడు. అజామీళుని తండ్రి ఆతనికి ఉపవీతుని చేసి వేదాధ్యయనం చేయించాడు. అజామీళుడు అనతి కాలంలోనే సకలవిద్యా సంపన్నుడైనాడు. తండ్రికి పూజాదికర్మలలో చేదోడు వాదోడుగా ఉంటూ సహకరించేవాడు. పూజకు కావలసిన ద్రవ్యాలన్నీ సమకూర్చేవాడు. నిరంతరం భగవంతుని స్మరిస్తూ పెద్దలను, గురువులను, అతిథులను గౌరవిస్తూ ఉండేవాడు. ఆతని సద్గుణాలను వినయశీలతను గురించి అందరూ గొప్పగా చెప్పుకొనేవారు.

అజామీళుడు యవ్వనంలో అడుగుపెట్టగానే ఒక చక్కటి సుగుణవతి, సౌందర్యవతి అయిన యువతినిచూసి ఆతని తల్లిదండ్రులు శాస్త్రోక్తంగా వైభవోపేతంగా వివాహం జరిపించారు. వారిరువురి జీవితం కొంతకాలం సుఖమయంగా కొనసాగింది.

అది మధుమాసం. ప్రేయసీప్రియులు కామోత్కర్షితులై జీవనం సాగిస్తున్నారు. ఇలా ఉండగా ఒకనాడు యజ్ఞయాగాలకు అవసరమైన దర్భలను తీసుకువచ్చేందుకు అజామీళుడు అరణ్యానికి బయలుదేరాడు. అక్కడ ఒక అందమైన యువతిని చూశాడు. ఆమె ఒక వరకాంత. ఆమె అందానికి అజామీళుడు దాసోహమయ్యాడు. ఇంద్రియ నిగ్రహాన్ని కోల్పోయాడు. ఆమెను పొందగోరాడు. వేశ్యావ్యామోహంలోపడి కొట్టుమిట్టాడుతున్న అజామీళుడు కన్నతల్లిదండ్రులను, అగ్నిసాక్షిగా కట్టుకున్న భార్యను, విద్యనేర్పిన గురువులను, బంధువులను అందరిని విడనాడాడు. అంతేకాదు, తను నేర్చిన వేద విద్యలను, నిత్యాగ్నిహోత్రాన్ని కూడా విడనాడాడు. ఆమె దయాభిక్షపై బ్రతుకు కొనసాగించసాగాడు.

నిరంతర భగవన్నామ స్మరణ చేసిన నాలుక ఆ వెలయాలి స్మరణలో నిమగ్నమయ్యింది. హరిపూజచేసిన చేతులు జారిణి బిగికౌగిలికై వేచి చూడసాగాయి. ఇలా ఆమెతో సహజీవనం చేస్తూ పదిమంది సంతానాన్ని పొందాడు. వారిలో చివరివానికి నారాయణ అని పేరుపెట్టి ఎంతో అల్లారు ముద్దుగా పెంచసాగాడు. నారాయణుడు ప్రక్కనలేనిదే అజామీళుడు ఆహారం కూడా తీసుకునేవాడుకాదు. ఆ పిల్లవానిపై అంత అమితమైన ప్రేమను సంతరించుకున్నాడు.

కాలం గడిచేకొద్దీ వృద్ధాప్యం దాపురించింది. శరీరంపై పట్టు సడలింది. అవయవాలు ఒక్కొక్కటిగా పనిచేయడానికి మొరాయించ సాగాయి. అయినా భగవన్నామస్మరణ మాత్రం గుర్తుకురాలేదు. వారకాంత వ్యామోహం, పుత్రవ్యామోహం తగ్గలేదు. మోహబంధంలోనే కొట్టుమిట్టాడుతున్నాడు.

అనుకున్నట్లుగానే మరణసమయం దగ్గర పడడంతో మృత్యుదేవత ఆవహించింది. బ్రాహ్మణ్యాన్ని త్యజించి, భగవదారాధనను మరచి, తల్లిదండ్రులను, కట్టుకున్న ఇల్లాలిని విడనాడి అశుద్ధమైన ఆహారాన్ని భుజిస్తూ హేయమైన జీవితాన్ని గడిపిన అజామీళుని ఎదుట యమ భటులు కనిపించారు. క్రూరమైన చూపులతో వాడియైన ఆయుధాలను, పాశాలను ధరించి, భయంకరంగా ఉన్న ఆ యమభటులను చూడగానే అజామీళుడు భయంతో వణికిపోసాగాడు. దూరంగా ఆడుకుంటున్న తన చిన్న కుమారుని 'నారాయణా..... నారాయణా.....' అని పిలుస్తూనే తుదిశ్వాస విడిచాడు.

ఇన్ని అకృత్యాలు చేసినా, మరణసమయంలో నారాయణ నామస్మరణ చేయడంతో అజామీళుని పాపాలన్నీ పటాపంచలైపోయాయి. ఆతనిని తీసుకెళ్ళేందుకు విష్ణుదూతలు వచ్చారు. అప్పటికే అక్కడున్న యమదూతలను దూరంగా గెంటివేశారు.

యమదూతలు వారిని చూసి 'మీరెవరు? మీరు చూడడానికి కన్నులకు ఇంపుగా ఉన్నారు. మాతో ఎందుకు జగడానికి వస్తున్నారు? యమధర్మరాజు శాసనం మీకు తెలియదా? మేమే యమకింకరులము. మా ధర్మాన్ని మేము నిర్వర్తిస్తుంటే మీరెందుకు మమ్ములను అడ్డు కుంటున్నారు? అని అడిగారు. అప్పుడు విష్ణుదూతలు- మీరు యమదూతలా? ధర్మాధర్మాలు మీకు తెలియవా? పాపాత్ములకు, పుణ్యాత్ములకు మీకు తేడా తెలియదా? ఎవరిని ఎలా దండించాలో మీకు తెలియదా? అని తీవ్రంగా పలికారు.

అప్పుడు యమభటులు 'వేదం చెప్పిందే ధర్మం. వేదంలో లేనిది అధర్మం. ఈ అజామీళుడు ధర్మాన్ని అతిక్రమించాడు. వేదాధ్యయనం చేసి, సదాచార సంపన్నుడై ఉండి, నిత్యనైమిత్తిక కర్మలను నిర్వహిస్తూ, పెద్దలను, గురువులను గౌరవించేవాడై, భార్యప్రేమను పొందినవాడైనా కూడా ఒక వేశ్యవ్యామోహంలో పడి వాటన్నిటిని మంటగలిపాడు. తనధర్మాన్ని వదిలేశాడు. తల్లిదండ్రులను, భార్యను దుఃఖసాగరంలో ముంచాడు. వేశ్యావ్యామోహంలో మునిగితేలుతూ అదే పరమావధిగా భావించాడు. భగవన్నామస్మరణ చేయాల్సిన నోటితో భామినీ నామస్మరణ చేశాడు. ఇటువంటి పాపాత్ముడు నరకానికి కాక స్వర్గానికి వెళతాడా? అని పలికారు.

అప్పుడు విష్ణుదూతలు వారిని అడ్డుకుంటూ- 'ఓరీ మూర్ఖులారా.. ఇతడు ఎంతటి క్రూర పాపాత్ముడైనా తను ప్రాణం వదిలేముందు హరినామస్మరణ చేశాడు. హరినామ స్మరణ చేయడంతో అతని పాపాలన్నీ హరించుకుపోయాయి. అంటూ హరినామ స్మరణ మహత్వాన్ని ఈ విధంగా చెప్పారు.

సీ. బ్రహ్మహత్యానేక పాపాటవుల కగ్ని,
కీలలు హరినామకీర్తనములు
గురుతల్పకల్మషక్రూరసర్పములకుఁ,
గేకులు హరినామకీర్తనములు
తపనీయశౌర్యసంతమసంబునకు సూర్య,
కిరణముల్ హరినామకీర్తనములు
మధుపానకిల్బిషమదనాగసమితికిఁ,
గేసరుల్ హరినామకీర్తనములు

తే.గీ. మహితయోగోగ్రనిత్యసమాధివిధుల,
నలరు బ్రహ్మాదిసురలకు నందరాని
భూరినిర్వాణసామ్రాజ్యభోగభాగ్య,
ఖేలనంబులు హరినామకీర్తనములు. (6-118)

శ్రీహరినామ సంకీర్తనలు బ్రహ్మహత్య మొదలైన పాపాలు అనే అడవులను కాల్చేసే అగ్నివంటివి. గురు ద్రోహులు అనే దుష్ట సర్పాల పాలిట నెమళ్ళ వంటివి. బంగారాన్ని దొంగిలించడం అనే చీకట్లకు సూర్య కిరణాలవంటివి. మద్యపానం అనే పాపపు ఏనుగులపాలిట సింహాల వంటివి. నిత్యం యోగసమాధిలో ఉండే బ్రహ్మాదిదేవతలు కూడా పొందడానికి వీలులేని మోక్షసామ్రాజ్యంలో, భోగభాగ్య క్రీడాసౌఖ్యాలను ఇచ్చేది ఈ హరినామ కీర్తనలు.

సీ. ముక్తికాంతైకాంతమోహనకృత్యముల్,
కేలిమైహరినామకీర్తనములు
సత్యలోకానందసౌభాగ్యయుక్తముల్,
కేలిమై హరినామకీర్తనములు
మహితనిర్వాణసామ్రాజ్యాభిషిక్తముల్,
కేలిమైహరినామకీర్తనములు

బహుకాలజనితతపఃఫలసారముల్,
కేలిమై హరినామకీర్తనములు

తే.గీ. పుణ్యమూలంబు లనపాయపోషకంబు,
లభిమతార్థంబు లజ్ఞానహరణకరము
లాగమాంతోపలబ్ధంబు లమృతసేవ,
లార్తశుభములు హరినామకీర్తనములు. (6-119)

శ్రీవిష్ణుమూర్తి నామకీర్తనలు-ముక్తికాంత ఏకాంతంలో చేసే మోహనకృత్యాలు. బ్రహ్మలోకానందాన్ని కలుగచేసే సౌభాగ్యాలతో కూడినవి. మోక్షసామ్రాజ్యానికి అభిషేకం చేసేవి. మనమెన్నో జన్మాలలో చేసిన తపస్సుకు పండిన పండ్లరసాలవంటివి. పుణ్యాలకు మూలాలు. కోరిన కోరికలు తీర్చేవి. అజ్ఞానాన్ని హరించేవి. ఉపనిషత్తులవల్ల లభించేవి. అమృతాన్ని సేవించడం వంటివి. ఆర్తి పొందిన భక్తులకు శుభాలిచ్చేవి.

కోరదగింది, పుణ్యమార్గానికి నెలవైనది, మునీంద్రుల మనస్సులనే సరస్సుల్లో విహరించేది, నిర్మలమైనది అయిన శ్రీవిష్ణునామాన్ని కీర్తించేవాడు ధన్యుడు.

ఇక్కడ అజామీళుడు పుత్రప్రేమతో 'నారాయణా' అని పిలిచినా శ్రీవిష్ణుమూర్తిని స్మరించినట్లే. అందువల్లనే పుట్టిన బిడ్డకు దేవుడిపేరు పెట్టాలి. బిడ్డను, భగవంతుని పేరుతో పిలిచినా, భగవన్నామంతో ఆటలాడినా, గేలిచేసినా, పద్యంతోగాని, గద్యంతోగాని, గీతంతోగాని హరినామాన్ని పలికినా సకలపాపాలూ నశిస్తాయి. కిందపడినప్పుడూ, దుఃఖం కలిగినప్పుడూ, జ్వరంతో పలవరించినప్పుడూ, పాముకాటుకు గురైనప్పుడూ, పీడలు కలిగినప్పుడూ 'హరిహరీ!' అంటూ భగవంతుణ్ణి స్మరించిన వాళ్లకు నరకయాతన లుండవు.

అజామీళుడు మరణకాలంలో హరినామస్మరణామృతం సేవించాడు. అదెలా వ్యర్థమౌతుంది? అని విష్ణుదూతలు భాగవతధర్మాలు చెప్పి అజామీళుని విడువవలసిందని ఆదేశించారు. యమదూతలు గత్యంతరంలేక తిరిగి యమలోకానికి వెళ్ళారు. విష్ణుదూతలు వైకుంఠానికి వెళ్ళారు.

అజామీళుని మీదగల యమపాశాలు విడిపోయాయి. అతడు యమదూతల–విష్ణుదూతల సంవాదం విని శ్రీమన్నారాయణుణ్ణి ధ్యానించి విష్ణుభక్తుడయ్యాడు. అతని ఆత్మలో విష్ణుజ్ఞానదీపం ప్రకాశించింది. తాను చేసిన తప్పులు తలచుకొని పశ్చాత్తాపం పొందాడు. మోహం విడిచిపెట్టాడు. శ్రీకృష్ణుని దయను కోరాడు.

క. హరిభక్తులతో మాటలు,
ధర నెన్నడు జెడని పుణ్యధనముల మూటల్
వరముక్తికాంత తేటలు,
నరిషడ్వర్గంబు చొరని యరుదగు కోటల్. (152)

అని తలచి గంగాద్వారం చేరి, యోగాభ్యాసంతో, శ్రీవిష్ణుమూర్తిని ఆత్మలో నిలిపి దేహంవిడిచి, విష్ణుభటులు తెచ్చిన విమాన మెక్కి, వైకుంఠం చేరి సద్యోముక్తి పొందాడు.

అజామీళుని కథ హరినామ కీర్తన మాహాత్మ్యాన్ని మనకు వివరిస్తుంది. మనం ఏ పని చేస్తున్నా, ఏ అవస్థలో ఉన్నా, మనసులో నిరంతం భగవంతుని నామస్మరణ చేస్తూ ఉండాలని అదే మోక్షమార్గమని ఈ అజామీళుని కథ మనకు ఉపదేశిస్తుంది.

* * *

# 8. స్వామిభక్తి పరాయణుడు - హనుమంతుడు

త్రేతాయుగంనాటి మాట. పూర్వం మహాభక్తులైన అంజనాదేవి కేసరి అనే వానరశ్రేష్ఠ దంపతులు ఉండేవారు. వారికి చాలా కాలంగా సంతానం లేదు. వారు సంతానం కొరకు మతంగ మహామునిని సేవించారు. మతంగమహాముని వారి సేవలకు మెచ్చి "అమ్మా! అంజనాదేవీ నీవు ఇక్కడకు దక్షిణదిక్కులో పదియోజనముల దూరంలో **ఘనాచలమనే** నృసింహక్షేత్రమున్నది. దానిపై సుందరమైన బ్రహ్మతీర్థ మున్నది. ఆ బ్రహ్మతీర్థానికి తూర్పుదిక్కున 10 యోజనముల దూరంలో సువర్ణముఖరీ నది ప్రవహిస్తున్నది. ఆ నదికి ఉత్తరదిక్కున వృషభాద్రి అనే పర్వతమున్నది. ఆ పర్వతంపై సర్వతీర్థనివాసమైన స్వామి పుష్కరిణి అనే పుష్కరిణి ఉన్నది. అందులో స్నానమాచరించి క్షేత్రాధిపతి అయిన ఆది వరాహస్వామిని, అర్చామూర్తిగా అవతరించిన శ్రీనివాసస్వామిని దర్శిస్తే సకలపాపాలు తొలగిపోతాయి. ఆ తీర్థానికి ఉత్తరదిక్కున భీకరారణ్యంలో ఆకాశగంగా తీర్థం ఉన్నది. ఆ తీర్థంలో సంకల్ప పూర్వకంగా స్నానమాచరించి వాయుదేవుని ప్రీతికై తపస్సును ఆచరించు ఆతని అనుగ్రహం వల్ల నీకు వాయువేగమనోవేగాలకన్నా వేగం కలవాడు, ఇంద్రియాలను జయించగలవాడు, బుద్ధిమంతుడు, శ్రేష్ఠుడు అయిన ఒక పుత్రుడు జన్మిస్తాడు. ఆతడు శ్రీరామచంద్ర భక్తిసేవాపరాయణుడై లోకంలో ఎనలేని ఖ్యాతిని పొంది చిరంజీవి కాగలడు అని పేర్కొన్నాడు.

మతంగ మహాముని ఆజ్ఞానుసారం అంజనాదేవి ఆకాశగంగ ప్రాంతాన్ని చేరి దృఢనిశ్చితురాలయి కఠోర తపస్సును చేసింది. అంజనాదేవి తపస్సుకు మెచ్చి వాయుదేవుడు ప్రత్యక్షం కాగా అంజనాదేవి ఒక సత్పుత్రుని ప్రసాదించమని కోరింది.

అందుకు వాయుదేవుడు అంజనా నేనే ఒక అంశతో నీకు దివ్యపుత్రుడనై జన్మిస్తానని పలికి సూర్యుడు మేషరాశిలో ప్రవేశించినపుడు చిత్తానక్షత్రంతో కూడిన పౌర్ణమినాడు అంజనాదేవికి వాయుదేవుడే పుత్రుడై అవతరించాడు. ఆతడే అంజనీసుతుడైన ఆంజనేయుడు.

సీతాన్వేషణలో భాగంగా రామలక్ష్మణులు ఋష్యమూక పర్వతాన్ని చేరగా, సుగ్రీవుని ఆజ్ఞమేరకు హనుమంతుడు మారువేషంలో రామలక్ష్మణులను సమీపించి వివరాలు కోరాడు.

హనుమంతుని మెడలోని కాంచనమాల ఆధారంగా శ్రీరామచంద్రుడు హనుమంతుని గుర్తించగా నాటినుండి హనుమ శ్రీరామచంద్రుని తన స్వామిగా భావించి సేవించి తరించాడు.

శ్రీరామసుగ్రీవుల మైత్రిని జరిపి వాలిని వధింపజేశాడు. తమ నాయకుడైన సుగ్రీవుని రాజుగా చేయడంలో తన బుద్ధికుశలతను ప్రదర్శించిన సమయాలోచితపరుడు హనుమంతుడు.

సీతాన్వేషణలో భాగంగా సముద్రాన్ని లంఘించి పయనిస్తున్నవేళ మైనాకుడు తనపై విశ్రాంతిని తీసుకొని వెళ్ళమని అభ్యర్థించాడు. కానీ తాను స్వామికార్యంలో ఉన్నానని అది పూర్తి అయ్యేవరకు విరామం లేదని చెప్పాడు. అయినా మైనాకుని అభ్యర్థన మేరకు కేవలం పాదం మోపి ముందుకు పయనించిన స్వామికార్య పరాయణుడు.

మార్గమధ్యంలో ఎదురైన అనేక అవాంతరాలను శ్రీరామనామ మహిమతో తృణప్రాయంగా భావించి తుత్తునియలు చేస్తూ లంకానగరాన్ని చేరిన బలశాలి.

అశోకవనంలో సీతమ్మజాడను కనుగొని ఆమె ఈ స్థితికి కారణమైన దశకంఠుని లంకానగరాన్ని సర్వనాశనం చేయాలని సంకల్పించాడు.

సీతమ్మను అప్పగించి శ్రీరాముని శరణువేడమని హెచ్చరిస్తూ లంకాదహనం చేశాడు.

సీతమ్మజాడను శ్రీరామునికి తెలిపి ఆతని అనుగ్రహంతో వానర వీరులతోకలిసి లంకానగరానికి సముద్రంపై వారధికట్టాడంలో ఆతని సాంకేతిక పరిజ్ఞానం, సమూహకార్యదక్షత(టీమ్ వర్క్) అమోఘమైనవి.

శ్రీరామచంద్రుని శరణువేడిన విభీషణునికి ఆశ్రయాన్ని కల్పించడంలో రామచంద్రునికి తన వంతుగా సూచనలందించాడు. ఈ విషయంలో హనుమంతుని యుక్తాయుక్త విచక్షణ అనుసరణీయం.

మేఘనాథుని నాగాస్త్రానికి మూర్ఛితుడైన లక్ష్మణుని కాపాడేందుకు సుషేణుని సూచనమేరకు హిమవత్పర్వతాన్ని చేరి సంజీవనీ మూలికలతో కూడిన పర్వతాన్ని తీసుకువచ్చి లక్ష్మణమూర్ఛనుండి తేరుకొనేలా చేసిన అతులిత బలధాముడు అంజనీపుత్రుడు.

రావణవధానంతరం సీతారాముల పట్టాభిషేక వేళ సీతాదేవి హనుమ స్వామిభక్తికి మెచ్చి ఇచ్చిన మౌక్తిక మణిహారంలో శ్రీరామనామ మాధుర్యంలేదని త్యజించి, తన హృదయంలో సీతారాములను చూపిన అసలు సిసలైన రామభక్తుడు హనుమంతుడు.

హనుమంతుడు అంతటి స్వామిభక్తిపరాయణుడు కనుకనే శ్రీరామచంద్రుని గాఢాలింగనానికి పాత్రుడై చిరంజీవిగా వెలుగొందు తున్నాడు. శ్రీరామసేవాదురంధరుడైన హనుమంతుని స్మరిస్తే బుద్ధి బలం, యశస్సు, ధైర్యం, నిర్భయత్వం, ఆరోగ్యం, వాక్పటుత్వం సిద్ధించడంతో పాటు, జడత్వం సోమరితనం తొలగిపోతాయి.

* * *

# 9. అవ్యాజభక్తులు - ఆదిశేష గరుత్మంతులు

కశ్యప ప్రజాపతికి వినత కద్రువ అనే ఇద్దరు భార్యలు. వీరిద్దరు తమ భర్తఅయిన కశ్యప ప్రజాపతిని చాలా కాలం విశేషంగా సేవించారు. కశ్యప ప్రజాపతి వినత కద్రువల సేవలకు మెచ్చి ఏమి వరం కావాలో కోరుకొమ్మన్నాడు. అప్పుడు కద్రువ అగ్నిసమానులు, దీర్ఘదేహులు మహా పరాక్రమ సంపన్నులు అయిన వేయిమందిని సంతానంగా ప్రసాదించమని కోరింది. ఇక వినత కద్రువ పుత్రులకన్నా శ్రేష్ఠులు, భుజబల సంపన్నులు, కీర్తి ప్రతిష్ఠలు పొందు ధర్మసంపన్నులు అయిన ఇద్దరు కుమారులను ప్రసాదించమని కోరింది.

కశ్యప ప్రజాపతి వారి కోరికను మన్నించి పుత్రకామేష్టిని చేసి వారికి సంతానాన్ని ప్రసాదించాడు. వినత, కద్రువలిద్దరు గర్భవతులు కాగా వారి గర్భంలోని పిండాలను నేతి కుండలలో మంత్రించి ఉంచి వాటినుండి సంతానం బయటకు వచ్చేవరకు వేచి ఉండమని ఆజ్ఞాపించాడు. ఇలా 500 సంవత్సరాలు వేచి ఉండగా కద్రువ కుండలలో నుండి శేషుడు, వాసుకి, ఇరావంతుడు, తక్షకుడు మొదలైన వేయి మంది సర్పశ్రేష్ఠులు పుట్టారు. వినత సంతానం మాత్రం బయటకు రాలేదు.

కద్రువ సంతానం పట్ల అసూయతో వినత తన కుండలలో మొదటి కుండలోని అండాన్ని బయటకుతీసి బ్రద్దలు గొట్టింది. అందులోనుండి ఇంకా పూర్తిగా శరీరాన్ని పొందని, తొడలనుండి క్రిందిభాగం లేని ఒక దివ్యతేజస్సంపన్నుడైన కుమారుడు జన్మించాడు. తండ్రి ఆజ్ఞను ధిక్కరించి తనను అర్ధశరీరునిగా 'అనూరుని'గా జనింప జేసినందుకు తన తల్లిపై కోపంతో "అమ్మా! నీవు నీ సవతిపట్ల అసూయతో నన్ను ఇలా అసంపూర్ణాకారునిగా అనూరునిగా జనింపజేశావు. కనుక నీవు నీ

సవతికి దాసివిగా మారుతావని శపించాడు. అప్పుడు వినత కుమారా ఎంత తప్పుచేసినా తల్లిని ఇలా శపించడం న్యాయమేనా? అని ప్రశ్నించింది. అనూరుడు 'అమ్మా! రెండవ అండాన్ని కదిలించకు. అందులోనుండి మహాభుజబలశాలి, అమిత తేజోమయుడు అయిన కుమారుడు జన్మించి నిన్ను శాపవిముక్తురాలిని చేస్తాడు.' అని పలికి తను సూర్యభగవానుని రథసారథిగా వెళ్ళిపోయాడు.

కొంత కాలానికి వినత కద్రువలు క్షీరసాగరపు ఒడ్డున విహరిస్తున్న దైవాశ్వమైన 'ఉచ్చైశ్రవాన్ని' చూశారు. కద్రువ వినతతో "చెల్లీ చూశావా! ఆ దివ్యాశ్వం. తెల్లని చంద్రునిలోని నల్లని మచ్చవలే శరీరమంతా తెల్లగా ఉంటూ తోక మాత్రం నల్లగా ఉన్నదికదా! అని పలికింది. అది గమనించిన వినత "అయ్యో! అక్కా! ఆ అశ్వం తోకతో సహా నిజంగానే తెల్లగా ఉన్నది నీవు ఏ కళ్ళతో ఎలా చూస్తున్నావో" అని పలికింది. అందుకు వారిద్దరి మధ్య మాటా మాటా పెరిగి "ఆ అశ్వానికి తోక నల్లగా ఉంటే నీవు నాకు దాసిగా ఉండాలి. తెల్లగా ఉంటే నేను నీకు దాసిగా ఉంటాను అని కద్రువ పలికింది. అందుకు వినత కూడా సమ్మతించింది. ఇద్దరు ఆ దివ్యాశ్వం వద్దకు వెళ్ళాలని అనుకుంటుండగా కద్రువ 'ఇది సంధ్యా సమయం. ఇప్పుడు పతిసేవకు వేళ అయినది. రేపు వచ్చి చూద్దాం' అని అనగా ఇద్దరూ తమ తమ అంత:పురాలకు వెళ్ళిపోయారు.

నిజానికి ఉచ్చైశ్రవం సంపూర్తిగా శ్వేతాశ్వమే అయినా వినత తన సంతానం కన్నా ఉత్తమ సంతానం కావాలని కోరింది కనుక ఆమెపట్ల అసూయతో కద్రువ ఆమెను తన దాసిగా చేసుకోదలచింది.

కద్రువ సర్పశ్రేష్ఠులైన తన సహస్ర సంతానాన్ని పిలచి విషయాన్ని చెప్పి వారిలో ఎవరైనా వెళ్ళి ఆ దివ్యాశ్వ వాలానికి చుట్టుకొని నల్ల

కనిపించేట్లుగా ఉండాలని కోరింది. తమ తల్లి కోరిక ధర్మబద్ధమైనదికాదు. అధర్మం చేయడం వారికి ఇష్టంలేదు, కనుక ధర్మపరులైన ఆ సర్పశ్రేష్ఠులు అందుకు అంగీకరించలేదు.

కద్రువ తన సంతానం తనకోరికను మన్నించని కారణంగా వారంతా పరీక్షిత్తు మహారాజు కుమారుడైన జనమేజయుడు చేసే సర్పయాగంలో పడి మరణిస్తారని శపించింది.

ఆ శాపాన్ని విని భయపడిన తక్షకుడు అను సర్పం తల్లి కోరికను మన్నించడానికి సిద్ధపడ్డాడు. మరునాడు వినత కద్రువలు దివ్యాశ్వాన్ని పరీక్షించే సమయానికి దాని తోకకు చుట్టుకొని నల్లగా కనపడేలా చేసి తన తల్లి అయిన కద్రువను గెలిపించాడు. తద్వారా వినత కద్రువకు దాసిగా మారింది. వినతాసుతుడైన అనూరుని శాపం ఫలించింది.

కొంత కాలానికి వినత రెండవ కుమారునిగా అండంనుండి మహా భుజబల పరాక్రమశాలి, మహా కీర్తిమంతుడు, మహాతేజ స్సంపన్నుడు అయిన గరుత్మంతుడు జనించి ఆకాశంలో స్వేచ్ఛావిహారం చేశాడు. అతను అలా విహరిస్తుండగా చూపరులకు ఆకాశంలో ఇద్దరు సూర్యులు ఉన్నట్లు తోచింది.

వినత తన కుమారుడైన గరుత్మంతునికి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించి తనను దాస్యవిముక్తురాలిని చేయమని కోరింది. గరుత్మంతుడు పెదతల్లి అయిన కద్రువ వద్దకు వెళ్ళి తన తల్లికి దాస్యవిముక్తికై ఏంచేయాలో తెలుపమని కోరాడు. అప్పుడు కద్రువ క్షీరసాగరమథనంలో బహిర్గతమైన అమృతభాండాన్ని తెచ్చిఇచ్చి తన తల్లిని విముక్తురాలిని చేసుకొమ్మని తెలిపింది.

గరుత్మంతుడు దేవలోకానికి వెళ్ళి అమృతభాండాన్ని తెచ్చి ఇచ్చి తన తల్లి అయిన వినతను దాస్యవిముక్తురాలిని చేశాడు.

ఇటువైపు తల్లి శాపానికి గురి అయిన సర్పశ్రేష్ఠులు శేష, వాసుకిలు శ్రీమన్నారాయణుని అనన్యభక్తిచేత ఆరాధించి, ఆశ్రయించి తాము అధర్మానికి, అన్యాయానికి పాల్పడరాదనే తల్లి మాటను జవదాటామని, అందులో తమదోషం లేదని, తమను అనుగ్రహించమని ప్రార్థించారు. శ్రీహరి వారి భక్తికి ధర్మాచరణకు మెచ్చి వారిని తన ఆంతరంగిక భక్తులుగా వైకుంఠంలో తనను సేవించుకునేలా అనుగ్రహించాడు.

తయా సహాసీన మనంత భోగిని ప్రకృష్ట విజ్ఞానబలైకధామని ।
ఫణామణి వ్రాత మయూఖ మండల ప్రకాశమనోదరదివ్యధామని ॥

నివాస శయ్యాసన పాదుకాంశుకోపధాన వర్షాతప వారణాదిభిః ।
శరీర భేదై స్తవ శేషతాం గతైః యథోచితం శేష ఇతీరితే జనైః ॥

విశేష జ్ఞాన బలములు కలవాడు, తన ఫణామణి పంక్తులచేత దివ్యవైకుంఠ విమానాన్ని ప్రకాశింపజేస్తూ ఆదిశేషుడు స్వామివారికి నివాసభూమిగా, పాన్పుగా, సింహాసనంగా, పాదుకలుగా, వస్త్రంగా, ఆనుకొనే దిండుగా, ఛత్రంగా, శ్రీహరికి అవసరానికి తగినట్లుగా సేవలందిస్తున్న దాసుడుగా ఉన్నాడు.

మరోవైపు శ్రీహరిభక్తచింతామణిఅయిన వినతాసుతుడు గరుత్మంతుడు శ్రీహరిని అనన్య భక్తిచేత ఆరాధించి ఆతని కృపకు పాత్రుడై ఆతని ఆంతరంగిక భక్తునిగా, ఆతని వాహనంగా సేవించుకోసాగాడు.

అందుకే శ్రీహరి కలియుగంలో ఆదిశేష,వాసుకి, గరుత్మంతులకు అవ్యాజమైన తన అనుగ్రహాన్ని ప్రసాదిస్తూ శ్రీనివాసునిగా తిరుమలలో అర్చామూర్తిగా అవతరించి తన బ్రహ్మోత్సవాలలో వారికి ఒక ప్రత్యేకతను ప్రసాదించాడు. తొలి రెండు వాహనాలుగా ఆదిశేష, వాసుకిలను అనుగ్రహించాడు. ఇక ప్రధాన వాహనంగా గరుత్మంతుని అనుగ్రహించాడు.

# 10. మాధవుడు

పూర్వం కాళహస్తి అనే పట్టణంలో సత్యవాక్పాలకుడు, పరమ నిష్ఠాగరిష్ఠుడు, సకలవేదవేదాంగ విశారదుడు అయిన పురందరుడు అనే మహా పండితుడు ఉండేవాడు. ఆతని భార్య ఆతనికి తగిన ఇల్లాలు. ఆ పుణ్యదంపతులకు సంతానంలేని కొరత బాగా వేధించేది. ఎన్నో యజ్ఞ యాగాల ఫలితంగా వారికి ఒక కుమారుడు జన్మించాడు. ఆతనికి మాధవుడు అని పేరుపెట్టి అల్లారుముద్దుగా పెంచసాగారు.

మాధవునికి ఆరేళ్ళు నిండకుండానే ఉపనయనం చేశారు. తండ్రిశిక్షణలో మాధవుడు సకలశాస్త్ర పారంగతుడైనాడు. ఆతనికి యుక్త వయసు రాగానే పాండ్యదేశానికి చెందిన చంద్రలేఖ అనే సదాచార సంపన్నురాలైన కన్యతో వైభవంగా వివాహం చేశారు. ముప్ఫైఏడు సంవత్సరాల మాధవుడు ప్రతినిత్యమూ పంచయజ్ఞములను నిర్వహిస్తూ ముఖములో దేదీప్యమైన తేజస్సును కలిగి రెండవ సూర్యునిలా ప్రకాశించేవాడు. చంద్రలేఖకూడా భర్తకు అనుకూలవతియైన భార్య.

ఒకానొకనాడు విధివశాన మాధవుడు పగటిపూట తనభార్యయైన చంద్రలేఖపై శృంగార కాంక్షతో దగ్గరకు వెళ్ళాడు. ఆమె ఇది సమయం కాదని ఆతనిని ఆపాలని ఎంతగానో ప్రయత్నం చేసింది. అయినా మాధవుడు మానలేదు. అప్పుడు చంద్రలేఖ తాను నీటిని తీసుకొచ్చేందుకు నదికి వెళుతున్నానని అతనిని కూడా రమ్మని పలికి ముందుకు నడిచింది. మాధవుడు కూడా ఆమె వెనువెంటే వెళ్ళాడు.

ఇలా కొద్ది దూరం వెళ్ళాక అక్కడ అందమైన ఒక వేశ్య శృంగారచేష్టలతో ఆతని కంటపడింది. ఆమెపేరు కుంతల. అప్సరసలను సైతం ఓడించే అందమైన ఆ వేశ్యను చూసి మాధవుడు మనసు ఆపుకోలేక పోయాడు. భార్యను నీటిని తీసుకుని ఇంటికి వెళ్ళమని పలికి ఆతను ఆ వేశ్యవెంట పడ్డాడు. ఆమె మాధవుని వేషభాషలను చూసి సదాచార

సంపన్నులైన మీరు ఇలా నావెంట పడకూడదని నేను పతితనని శతవిధాల నచ్చజెప్పి, ఆతనిని వారించే ప్రయత్నం చేసింది. కానీ ఆ ప్రయత్నాలేవీ ఫలించలేదు. చివరి అస్త్రంగా మీరు నా సహవాసం కోరుకుంటే మీ బ్రాహ్మణత్వాన్ని, తల్లిదండ్రులను, కట్టుకున్న భార్యను వదులుకోవలసి ఉంటుందని కఠోరంగా పలికింది. అయినా మాధవుడు వెనుకాడక శృంగారావేశంతో సమస్తాన్ని వదులుకోవడానికి సిద్ధపడ్డాడు. పారిపోబోతున్న ఆమెను వెంటాడి పట్టుకొని బలాత్కారంగా ఆమెతో సంగమించాడు.

అప్పుడు కుంతల 'ఓయీ మాధవా! నీవు నాతో సంగమించి బ్రాహ్మణ్యం నుండి భ్రష్టుడవైనావు. ఇక నీవు నీ యజ్ఞోపవీతాన్ని, శిఖను విసర్జించు నాతోనే ఉంటూ నేను తిన్నదే తింటూ, నేను సేవించిన మద్యామంసాలనే సేవిస్తూ నాతోనే సహజీవనం చేయి' అన్నది. మాధవుడు కుంతల పొందుకోరి ఆమె పలికినవన్నీ తు.చ. తప్పక పాటించాడు. ఇలా కొద్దికాలం జీవించిన తరువాత కుంతల విధి వశాత్తు మరణించింది. మాధవుడు కుంతల సాంగత్యానికి దూరమై మతి భ్రమించినవాడై ఆమెనే తలుచుకుంటూ పెద్దగా కేకలు వేస్తూ తిరుగ సాగాడు.

ఒకానొకసారి కొంతమంది ఉత్తరదేశపురాజులు వరాహపర్వతానికి యాత్రకొరకు గోవింద నామస్మరణచేస్తూ సమూహంగా వెళ్ళడం గమనించి మాధవుడు వారిని అనుసరించాడు. వారు ఏమి చేస్తే తాను అదేచేస్తూ, వారు ఇచ్చినదే తింటూ, వారివెంటే వెళ్ళసాగాడు. ఆ యాత్రీకుల సమూహం కపిలతీర్థాన్ని చేరుకొని శిరోముండనం చేయించుకొని పితృకార్యాలు నిర్వర్తించారు. తానేం చేస్తున్నాడో తెలియని స్థితిలో ఉన్న మాధవుడు తక్కినవారిలా తానుకూడా శిరోముండనం చేయించుకుని పవిత్ర కపిలతీర్థంలో స్నానంచేసి పితృదేవతలకు శ్రద్ధగా

మట్టితో పిండప్రదానం చేశాడు. పితృశ్రాద్ధకర్మలను ఆచరించడంవల్ల వారి అనుగ్రహంతో అతను సగం పాపాన్ని పోగొట్టుకున్నవాడైనాడు.

ఇక వారితో కలిసి తిరుమలను అధిరోహించడం ప్రారంభించాడు. శేషాచల పర్వతంపై కాలు మోపగానే తన శరీరంనుండి పుట్టినఅగ్ని తానుచేసిన పరస్త్రీ సంగమం, మద్య, మాంససేవనం వంటి పాపాలన్నీ దహించి వేయడం ప్రారంభించింది. ఆ సమయంలో ఏర్పడిన దుర్గంధానికి బ్రహ్మాది దేవతలుసైతం కారణం కనుగొనేందుకు తమతమ విమానాలలో విచ్చేశారు. మాధవుని పాపవిమోచనాన్ని చూసి శేషాచల మాహాత్మ్యాన్ని తెలుసుకొని ఆతనిపై పుష్పవర్షాన్ని కురిపించారు. బ్రహ్మ 'మాధవుని సమీపించి మాధవా నీవు శ్రీనివాసుని అనుగ్రహంచేత సకలపాపాలను పోగొట్టుకున్నావు. తిరుమల చేరుకొని స్వామిపుష్కరిణిలో పవిత్రస్నానం చేసి వరాహస్వామిని, శ్రీనివాసుని దర్శించి ఈ శరీరాన్ని విడిచిపెట్టు. ముందు పరీక్షిన్మహారాజు కులములో దక్షిణ దేశములోని నారాయణపురం లో సుధర్మ మహారాజు పుత్రుడవై ఆకాశరాజు అనే పేరుతో జన్మించి తొండదేశానికి అధిపతివి కాగలవు. శ్రీమహాలక్ష్మి నీకు కుమార్తె గాను, శ్రీనివాసుడు నీకు అల్లుడుగాను కాగలరు. అనంతరం నీవు వైకుంఠాన్ని చేరుకుంటావు అని పలికాడు.

ఆ తరువాత శేషాచల పర్వత స్పర్శచేతనే తన సకల పాపాలను పోగొట్టుకొన్న మాధవుడు జ్ఞానాన్ని పొందినవాడై తిరుమల చేరుకొని పవిత్ర పుష్కరిణిలో స్నానంచేసి వరాహస్వామిని, శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించి స్వామివారి అనుగ్రహంతో ఆ శరీరాన్ని విడిచి సుధర్మ మహారాజు కుమారుడై ఆకాశరాజుగా అవతరించాడు.

వేంకటగిరి మాహాత్మ్యం మనకు ఈ మాధవుని వృత్తాంతం వల్ల తెలుస్తున్నది. సర్వపాపాని 'వేం' ప్రాహుః 'కట:'తద్దాహముచ్యతే! అంటే సకల పాపాలను హరించే శక్తిగలది వేంకటాచల పర్వతం అని భవిష్యోత్తర పురాణం ద్వారా తెలుస్తున్నది.

# 11. తొండమానుడు

తొండమానుచక్రవర్తి సాక్షాత్తు ఆకాశరాజు సోదరుడు. పద్మావతి దేవికి పినతండ్రి, శ్రీహరికి పరమభక్తుడు. తిరుమలలో ఆనందనిలయ విమానంతోకూడిన ఆలయాన్ని నిర్మించిన భక్తశిఖామణి. ప్రతిరోజు శ్రీవారిని దర్శించి పూజించనిదే పచ్చిగంగైనా ముట్టని నిష్ఠాపరుడు. తనను ఆశ్రయించి వచ్చిన వారికి కాదనకుండా లేదనకుండా దాన ధర్మాలుచేసేవాడు. శ్రీనివాసునితో స్వయంగా మాట్లాడే వరాన్ని పొందినవాడు. ఆకాశరాజు మరణానంతరం పద్మావతి దేవి సోదరుడు వసుదానునికి, తొండమానునికి జరిగిన యుద్ధంలో శ్రీవారి శంఖచక్రాలను తనకు తోడుగా పొందిన భక్తవరేణ్యుడు.

ఒకానొకసారి కార్తికమాసంలో కూర్ముడనే బ్రాహ్మణోత్తముడు గతించిన తన తండ్రి అస్తికలను గంగానదిలో విసర్జించాలని సంకల్పించాడు. అయితే నాడు గంగాతీరానికి వెళ్ళాలంటే అంత సులభం కాదు. దాదాపు కొన్ని నెలలకాలం పట్టేది. అప్పటిదాకా గర్భవతి అయిన తనభార్య, పిన్నవాడైన కుమారుని పోషణ సంరక్షణ ఎలా అని ఆలోచించసాగాడు. ఈలోపు తొండమానుచక్రవర్తి కీర్తిని, దానగుణత్వాన్ని, ఆశ్రితవాత్సల్యకీర్తిని విని భార్యాపిల్లలతో కలిసి తొండమానుని రాజ్యాన్ని చేరుకున్నాడు.

తన తండ్రి అస్తివిసర్జన విషయాన్ని తెలియజేసి తను తిరిగి వచ్చేవరకు గర్భవతి అయిన తన ఇల్లాలు మహాలక్ష్మికిని, కుమారుడైన రాఘవునికి ఆశ్రయాన్ని కల్పించవలసినదిగా కోరాడు. తొండమానుడు అందుకు అంగీకరించాడు. కూర్ముడు తన భార్యాపిల్లలను ఆతనికి అప్పగించి గంగాతీరానికి బయలుదేరాడు. తొండమానుడు కూర్ముని భార్యాపిల్లలను ఒక అందమైన భవనంలో నివాసం ఏర్పాటుచేసి వారికి 2 మాసముల కాలానికి అవసరమైన నిత్యావసర వస్తువులను, ఆహార పదార్థాలను వారికి అప్పగించాడు. ఆ తరువాత వారి యోగక్షేమాలు మరచిపోయాడు.

కొంతకాలానికి కూర్ముడు తండ్రి అస్తివిసర్జన పూర్తిచేసుకొని తిరిగి వచ్చి తొండమానునికి కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. తన భార్యాపిల్లల గురించి ఆరాతీశాడు. కూర్ముని చూసేదాకా ఆతని భార్యాపిల్లల విషయాన్ని మరచిపోయిన తొండమానుడు తన అపరాధాన్ని తెలుసుకుని వెంటనే రహస్యంగా రాజకుమారుని పంపి వారి పరిస్థితిని పరిశీలించి వివరాలు తెలుపవలసినదిగా ఆదేశించాడు. రాకుమారుడు వారికి కేటాయించిన భవనానికివెళ్ళి చూడగా చక్రవర్తి పంపిన 2 నెలల ఆహారపదార్థాలు అయిపోయాక ఆకలికి తాళలేక వారు మృతిచెంది అస్తిపంజరాలుగా మారారు. ఈ విషయాన్ని రాజకుమారుడు వెంటనే తొండమానునికి రహస్యంగా చేరవేశాడు.

మరోవైపు ఆ బ్రాహ్మణుడు మరలా మరలా తన భార్యాబిడ్డల విషయాన్ని ప్రస్తావించి వారిని పిలిపించవలసినదిగా కోరుతున్నాడు. తొండమానునికి ఏంచేయాలో పాలుపోక " బ్రాహ్మణోత్తమా మీభార్య మహాలక్ష్మివంటి ఆడశిశువునకు జన్మనిచ్చినది. అంతఃపుర స్త్రీలందరు తిరుమల శ్రీనివాసుని అభిషేకం కొరకు తిరుమల వెళ్ళారు. వారంతా ఒకటి రెండు రోజులలో రాగలరు. వారు వచ్చేవరకు మీరు మీ ప్రయాణ బడలికనుతీర్చుకుని విశ్రమించండి అంటూ ఆతనికి ఒక చక్కటి భవనాన్ని కేటాయించాడు. సకల సపర్యలు అందించేందుకు సేవకులను నియోగించాడు. ఇంతటి మహాపరాధాన్ని దుర్వార్తను తొండమానుడు కూర్మునికి ఎలా తెలియజేయాలో అర్థంకాలేదు. బ్రాహ్మణుని భార్యాబిడ్డల విషయంలో ఏంచేయాలో తెలియక రాజకుమారుడు, పురోహితులతో పాటు, తిరుమలకు వెళ్ళి శ్రీనివాసపరబ్రహ్మని శరణువేడాడు.

శ్రీనివాసుడు తొండమానుని అపరాధాన్ని తెలుసుకొని రాజా! నీవు మహాపరాధం చేశావు. బ్రహ్మహత్యా పాపాన్ని పొందావు. అయినా నీవు నా అనన్య భక్తుడవుకాన నిన్ను రక్షించేబాధ్యత నాపై ఉంది. అందువల్ల నాకు అపవాదు వచ్చినా రానీ. వెంటనే నీ కుమారుని పంపి బ్రాహ్మణుని భార్యాపిల్లల అస్తికలను తెప్పించమని ఆదేశించాడు. శ్రీనివాసుని ఆదేశానుసారం తొండమానుడు వారి అస్తికలను తెప్పించాడు.

శ్రీనివాసుడు ఆ అస్తికలను తన ఉపరివస్త్రంలో కట్టుకుని స్వామిపుష్కరిణికి పూర్వదిశలో ఉన్న పాండవతీర్థానికి వెళ్ళి దాని సమీపాన ఉన్న ఒక దేవఖాతం ఒడ్డున ఆ అస్తికలను ఉంచి తాను ఆ నీటదిగి స్నానమాచరించి ఆ నీటిని తన దోసిలితో ఆ అస్తికలపై వేశాడు. అంతట మృతిచెందిన ఆ బ్రాహ్మణుని భార్యాపిల్లలు తిరిగి పునర్జీవుతులయ్యారు. దేవతలందరూ ఈ దృశ్యాన్ని చూసి ఆశ్చర్యచకితులు ఆనందభరితులు అయ్యారు. అస్తికలపై దేవఖాతంలోని నీటిప్రోక్షణ చేయడం వల్ల ఆ ఖాతానికి అస్తిరసాయనతీర్థం అనే పేరువచ్చింది.

అనంతరం శ్రీనివాసుడు వారిని తొండమానునికి అప్పగించి“ రాజా నా భక్తుడవైన నిన్ను మన్నించి వీరిని పునర్జీవితులను చేశాను. కానీ నీవు చేసిన అపరాధం అంత చిన్నదేమీకాదు. ఇదివరకటిలా ఇక నేను మాటలాడక మౌనం వహిస్తాను. ఇక నా ముఖకవళికలచేతనే మాటలాడ గలను. నీవు ధర్మబద్ధంగా రాజ్యపరిపాలనచేసుకో. అంటూ మౌనముద్రను వహించి తిరిగి ఆనందనిలయంలో ప్రవేశించాడు.

మహారాజు శ్రీనివాసుని ఆజ్ఞానుసారం రాజ్యానికి తిరిగివచ్చి జరిగిన ఉదంతాన్ని ఆ బ్రాహ్మణోత్తమునికి తెలిపి తనను క్షమించమని కోరుతూ ఆతని భార్యాబిడ్డలను అప్పగించాడు. కూర్మబ్రాహ్మణుడు శ్రీనివాసుని దయార్ద్రహృదయాన్ని, తన భార్యఅదృష్టాన్ని తలచుకొని శ్రీనివాసుని వేనోళ్ళా కొనియాడుతూ భార్యాపిల్లలతో తన స్వగ్రామానికి వెళ్ళిపోయాడు.

తొండమాను చక్రవర్తి ప్రతిరోజు శ్రీనివాసుని దర్శించనిదే పచ్చిగంగైనా స్వీకరించేవాడు కాదు. వృద్ధాప్యంలో తిరుమల సందర్శనం కష్టతరమవగా శ్రీనివాసుడు తొండమానుని అనుగ్రహించి శ్రీదేవి భూదేవి సమేతంగా ప్రసన్నవేంకటేశ్వరస్వామిగా అతని రాజ్యమైన తొండమనాడులోనే వెలిశాడు. తనను అనుగ్రహించిన శ్రీవేంకటేశ్వరస్వామివారికి తొండమాన్ చక్రవర్తి అద్భుతమైన ఆలయాన్ని నిర్మించి ఆనందనిలయం విమానంతో పోలిన విమాన గోపురాన్ని నిర్మింపజేశాడు.

# 12. కురువరతి నంబి (కుమ్మరి భీముడు)

ఒకానొకసారి శ్రీనివాసుని ఎలా ప్రసన్నంచేసుకోవాలో అర్థం కాక తొండమాను చక్రవర్తి అంగిరసాది మహామునులను ఉపాయాన్ని తెలియజేయమని కోరాడు. మహర్షులు 'రాజా శ్రీనివాసునికి తులసి పత్రాలంటే చాలా ప్రీతి. శతసహస్ర బారువుల సువర్ణ, వజ్ర, వైఢూర్యాలకు ప్రసన్నుడుకాని స్వామి శ్రీకృష్ణావతారంలో ఒక్క తులసీదళానికి సంతుష్టుడైనాడు. కనుక నీవు పవిత్ర తులసీ పత్రాలతో ప్రతినిత్యం సహస్రనామార్చన చేయమ'ని ఆజ్ఞాపించారు.

అంగీరసాది మహామునుల ఉపదేశం మేరకు తొండమానుడు ప్రతినిత్యము బంగారు తులసీదళాలతో శ్రీనివాసుని పూజించసాగాడు. ఇలా మూడుమాసాలు గడిచాయి. కానీ శ్రీనివాసుడు మాత్రం తనకోపాన్ని మానలేదు. మౌనం వీడలేదు. అందువల్ల తొండమానుడు మనోవేదనతో ''జగన్నాథా! నీవు సకల లోకాలకు అధిపతివి. భక్తరక్షకుడవు, కరుణాసముద్రుడవు. నేను చేసిన అపరాధం పెద్దదే అయినా నన్ను మన్నించి నాపై దయజూపు స్వామీ'' అని వేడుకున్నాడు. అప్పుడు ఆకాశవాణి ద్వారా స్వామి "రాజా! నాకు నీవంటి భక్తులు అనేకులున్నారు. కానీ నీవంటి వారు ఎవరూలేరు. నీవు బ్రాహ్మణస్త్రీ, పుత్రఘాతుక రూపమైన ఘోరపాపం చేశావు. నిన్ను ఎలా క్షమించేది. నీ అగ్రజుడు చేసిన ఉపకారంవల్ల నేను వారిని పునర్జీవితులను చేశాను అని పలికాడు. ఈ వాక్కులను విని మోహాన్ని పొందిన తొండమానుడు తిరిగి తేరుకొని అహంకారపూరితుడై ''స్వామీ! ఉపకారం చేసినవారెవ్వరు ఎంత మూఢులైనా నేను చేశానని చెప్పుకోరు. నీ పట్ల ఏకాంతరతుడైన నా వంటి భక్తుడు ఈ ముల్లోకాలలో ఎవ్వరూ లేరు. భక్తులలో నేను

అగ్రగణ్యుడను దయాళువులో నీవు అగ్రగణ్యుడవు” అని గర్వంతో పలికి శ్రీనివాసుని సువర్ణతులసీదళాలతో పూజించడం కొనసాగించాడు.

ఇలా కొన్నాళ్ళు గడిచాయి. ఒకానొకనాడు తొండమానుడు శ్రీనివాసుని అర్చనకై బంగారు తులసీదళాలను తీసుకునిరాగా మునుపటి రోజున పూజించిన బంగారు తులసీదళాలపైన మట్టితోచేసిన తులసీ దళాలను చూశాడు. మరునాడు చూడగా మునుపటిరోజున తను పూజించిన బంగారు తులసీదళాలు కాకుండా మట్టితోచేసిన తులసీ దళాలు మాత్రమే శ్రీహరిపాదాలపై ఉండడం, తను అర్చించిన బంగారు తులసీదళాలు దూరంగా ఉండడం చూచి ఉక్రోషం తీవ్రస్థాయికి చేరింది. ఆవేదనతో ఏడుస్తూ ‘స్వామీ ఈ దాసునిపై ఇంకా కోపం తగ్గలేదా? ఈ పాపాత్ముని అపరాధాన్ని ఇంకా మన్నించలేదా స్వామీ? మట్టితో చేసిన తులసీదళాలు నీ పాదాలను చేరేలా నీచే అనుగ్రహింపబడిన ఆ భక్తాగ్రేసరుడు ఎవరు? ఆతని సందర్శనభాగ్యాన్ని నాకు ప్రసాదించు స్వామి’ అని దీనంగా ప్రాధేయపడ్డాడు.

అప్పుడు స్వామి ‘నాకు అనేకమంది భక్తాగ్రేసరులు ఉన్నారు. వారిలో భీముడు అనే కులాలుడు(కుమ్మరివాడు) మిక్కిలి పేదవాడు. ఇక్కడికి ఉత్తరదిక్కున యోజన దూరంలో నివసిస్తున్నాడు. అతడు పనిచేసుకునే చోటే నన్ను ఉంచి తన మట్టి పనిఅంతా అయ్యాక చేతులకు అంటివున్న మట్టితో పూలను, తులసిదళాలను చేసి వాటిని ప్రతిరోజు నాకు అత్యంత భక్తితో సమర్పిస్తున్నాడు. ఆతని భక్తికి మెచ్చి నేను ఆతడు సమర్పించే మట్టి తులసీదళాలను, పూలను స్వీకరిస్తున్నాను. “నా అంతటి భక్తుడు మరొకడు ఈ ముల్లోకాలలో లేడు– అని మునుపు నీవు పలికిన అహంకారపూరిత మాటలను గుర్తుచేసుకొని వెళ్ళి ఆతని భక్తిని పరిశీలించు” అని పలికాడు.

శ్రీనివాసుని ఆదేశానుసారం తొండమానుడు తన రాజభోగాలను అన్నిటిని విడిచి ఆలయం నుండి సరాసరి కులాలు భీముడు ఉండే నివాసప్రాంతానికి బయలుదేరాడు. ఇంటి గమ్మం వరకు చేరగానే తొండమానుడు మూర్ఛపొందాడు. ఈ విషయాన్ని తెలుసుకుని కులాలు భీముడు 'అయ్యో! మహారాజు నా ఇంటిగుమ్మానికి రావడమేమిటి, వచ్చి ఇలా మూర్ఛపోవడమేమిటి? నావలన ఎటువంటి అపరాధం జరిగిందో? మహారాజు నన్ను ఎంత కఠినంగా శిక్షిస్తాడో? స్వామీ శ్రీనివాసా నీవే నాకు దిక్కు అని పరిపరివిధాలా కుంగిపోసాగాడు. ఇంతలో తొండమానుడు తిరిగి తేరుకొని ' కులాలుభీముడు ఎక్కడ? ఆ మహాభక్తుని దర్శించాలి. ఆతని పాదపద్మాలకు నమస్కరించాలి." అని ఆవేదన వ్యక్తం చేశాడు.

తొండమానుడు భీమునితో 'అయ్యా! మీరు తిరుమలలో శ్రీనివాసుని దర్శించారా? మీ అంతటి మహాభక్తుల సందర్శనం నాకు లభించడం నా అదృష్టం" అని నమస్కరించాడు. అప్పుడు ఆ భీముడు "రాజా! రెక్కాడితేగానీ డొక్కాడని నావంటి పేదవానికి తిరుమల వెళ్ళి స్వామిని దర్శించేంతటి అదృష్టం కూడానా? నేను ఇక్కడే స్వామివారి ఒక రూపాన్ని చేసుకున్నాను. ప్రతిరోజు నా మట్టిపని అయిపోయాక నా చేతికి ఉన్న మట్టితో తులసి, పూలు చేసి స్వామికి సమర్పిస్తాను. దేవుడా నీవే దిక్కు అని ప్రార్థిస్తాను. ఇక నాభార్య మట్టికుండలో వండిన కూటినే స్వామికి చూపించి స్వామి ఈ కూడు నీవు ప్రసాదించిందే. నీకే పెడుతున్నాను, ఆరగించు అని చెబుతుంది. ఇంతకన్నా మేము ఏం చేయగలం మారాజా? తిరుమల వెళ్ళడం, ఆ స్వామిని చూడడం పేదోళ్ళమైన మాతో అయ్యే పనేనా?" అని పలికాడు. ఆ దంపతులిరువురు చేసే పనిలోనే పరమాత్ముని దర్శిస్తూ ఆడంబరాలులేని అనన్యభక్తిని ప్రకటించడం చూసి

తొండమానుడు ఆశ్చర్యపోయాడు. తన తప్పిదాన్ని గ్రహించాడు. నిరహంకార, నిరాడంబరాలతో స్వామిని పూజించాలే కానీ నేను అహంకారంతో, ఆడంబరాలతో శ్రీనివాసుని కొలిచాను. అందుకే స్వామి నా భక్తిని స్వీకరించలేదు. ఈ కులాలు దంపతులు ఎంతటి ధన్యజీవులో కదా? శ్రీనివాసుని మహిమ అపారమైనది కదా? అని అనుకుంటుండ గానే శ్రీనివాస పరబ్రహ్మ అక్కడ ప్రత్యక్షమైనాడు. వెంటనే ఆ కులాలు స్వామిని పరిపరి విధాల స్తుతించాడు. ఆ స్వామిని చూసి ' స్వామీ! నేను శూద్రుడను. పైగా విదుర,శబరి,గజేంద్ర, విభీషణుల వంటి జ్ఞానిని కాను. నీకు సమర్పించేందుకు నా ఇంట ఏమీ లేదు. అటువంటిది నా ఇంట విచ్చేసిన నీకు నేనేమి ఇవ్వగలను? అని భక్తితో పలుకగా ఆ కులాలుభీముని భార్య తమాలిని స్వామీ నీవు మావంటి వారి ఇంట ప్రత్యక్షమవడం మా అదృష్టం. దయచేసి మీరు మా ఇంట మేమువండిన ఆహారాన్ని భోజనంగా స్వీకరించి మమ్ములను అనుగ్రహించండి అని ప్రార్థించింది. ఆ ప్రార్థనను మన్నించి శ్రీనివాసుడు రమాసహితుడై వారి ఇంట తమాలిని వండిన పదార్థాలను సంతృప్తిగా స్వీకరించి వారికి పరమపదాన్ని అనుగ్రహించాడు.

ఈ దృశ్యాన్ని గమనించిన దేవతలు పుష్పవృష్టిని కురిపించారు. ఆకాశం నుండి ఒక దివ్యవిమానం రాగా ఆ దంపతులు ఆ విమానాన్ని అధిరోహించారు. శ్రీనివాసుడు పద్మావతిదేవి వారి దివ్యాభరణాలను ఆ దంపతులకు ప్రసాదించారు. ఆ దంపతులు దేవదేవుడు ప్రసాదించిన దివ్యాభరణాలతో వెలుగొందుతూ దివ్యవిమానంలో వైకుంఠాన్ని చేరుకున్నారు.

ఈ దృశ్యాన్ని గమనించిన తొండమానుడు తన అపరాధాన్ని గ్రహించి 'దేవదేవా! నా రాజ్యమందే వసించిన కులాలునికి పరమపదాన్ని

ప్రసాదించావే ! నీ బంధువునైన ఈ దాసుని అనుగ్రహించవా? నా గతి యేమిటి? అనుగ్రహించు దేవదేవా?' అని ప్రార్థించాడు. అప్పుడు శ్రీనివాసుడు "రాజా! నీవు ఈ దేహాన్ని వీడి మరో దేహాన్ని పొంది నన్ను ఆశ్రయించు. అప్పుడు నీకు వైకుంఠం లభించగలదు" అని తెలియజేశాడు.

శ్రీనివాసుని ఆజ్ఞమేరకు తొండమానుడు స్వామిపుష్కరిణిని చేరి అందులో స్నానమాచరించి పవిత్రుడై అహంకారపూరితమైన ఈ దేహాన్ని వీడి శ్రీనివాసుని అనుజ్ఞమేరకు మరో దేహాన్ని పొంది శ్రీనివాసుని ఆరాధించి ఆతని ఆజ్ఞానుసారం వైకుంఠాన్ని చేరుకున్నాడు.

చేసే పనిపట్ల అంకితభావంచేత, నిరాడంబర, నిరహంకార పూరితమైన అనన్యభక్తిచేత భగవంతుని ఆరాధించినట్లైతే ఆతని అనుగ్రహాన్ని పొందగలమని కులాలుభీముని కథ మనకు తెలియజేస్తుంది.

అలాగే ఎంతటివారైనా అహంకార మమకారాలను వీడితేనే భగవదనుగ్రహం పొందగలమని తొండమాను చక్రవర్తికథ తెలియ జేస్తున్నది.

* * *

## 13. భగవంతుడినే బంధించిన భక్తుడు–అనంతాళ్వాను

అది ఆదిశేషుని పరమావతారమైన భగవద్రామానుజాచార్యులు ఒకసారి శ్రీరంగంలో తమ శిష్యులతో సంభాషిస్తున్న సందర్భం. “తిరుమలలో శ్రీనివాసుని పూజకు పుష్పాలు ప్రతిరోజు కొండదిగువ నుండి తీసుకెళ్ళి అందించడంలో మనవాళ్ళు కొంత ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు. మీరెవరైనా తిరుమలలోనే ఉంటూ పూజకు కావలసిన పుష్పాలను పెంచి అందించే పుష్పకైంకర్యం చేసేందుకు సిద్ధంగా ఉన్నారా?” అని ప్రశ్నించారు.

అప్పుడు అనంతాళ్వాను అనే శిష్యుడు ‘‘స్వామీ! తమకు అంగీకారమైతే శ్రీనివాసునికి పుష్పకైంకర్యం నిర్వహించే భాగ్యాన్ని నేను స్వీకరిస్తాను”అన్నాడు. “మంచిది అనంతాళ్వాను శ్రీనివాసుని అనుగ్రహం నీకు సర్వత్రా ఉంటుంది” అని పలికారు భగవద్రామానుజులు.

మరునాడు అనంతాళ్వానులు తమ భార్యతో కలిసి తిరుమల ప్రయాణమయ్యారు. శ్రీవారి ఆలయం ప్రక్కనే ఒక చిన్న కుటీరాన్ని ఏర్పాటు చేసుకున్నారు. తిరుమల అయితే చేరుకున్నారు. మరి పుష్ప కైంకర్యం నిర్వహించాలంటే ఒక పూలతోటను సాగుచేయాలి. అందుకు నీళ్ళుకావాలి.

తిరుమల కొండప్రాంతం కనుక నీళ్ళు దొరకడం కష్టం. అందువల్ల తామే శ్రీవారి పుష్పవన సాగుకొరకు ఒక తటాకాన్ని త్రవ్వాలనుకున్నారు. మర్నాడే గర్భవతి అయిన తన భార్యతోపాటు తటాకాన్ని త్రవ్వేందుకు సిద్ధమైనాడు. అనంతాళ్వానులు గునపంతో బావిని తవ్వుతుండగా ఆ మట్టిని గర్భవతి అయిన అతని భార్య మోసుకెళ్ళి దూరంగా వేసి వస్తూ

ఉండేది. నిరంతర హరినామస్మరణ తత్పరులైన ఆ పుణ్యదంపతులు అలుపెరుగక శ్రీనివాసుని పుష్పకైంకర్యానికై తటాకాన్ని త్రవ్వడం గమనించి శ్రీనివాసుడు తానే స్వయంగా వారికి తటాకనిర్మాణంలో సహాయం చేయాలనుకున్నాడు.

శ్రీనివాసుడు ఒక చిన్న బాలుని రూపంలో వారిని సమీపించాడు. "స్వామీ మీరేం చేస్తున్నారు" అని అనంతాళ్వానును ప్రశ్నించాడు. అనంతాళ్వాను కార్యమగ్నుడై సమాధానం ఇవ్వలేదు. ఆ బాలుడు మరలా మరలా ప్రశ్నించసాగాడు. తమ పనికి ఆటంకం కల్పిస్తున్న బాలుని విసుగుతో 'ప్రక్కకు తొలగు' అన్నాడు. ఆ బాలుడు అంతటితో ఊరుకోక 'స్వామి పాపం ఎండనక వాననక మీరిరువురు చాలా కష్టపడుతున్నారు. తమరు చేస్తున్న పనిలో నేనేమైన సహాయం చేయవచ్చా.... మీరు గునపం ఇస్తే కాసేపు నేను త్రవ్వుతాను' అని గునపం తీసుకోబోయాడు ఆ బాలుడు. అనంతాళ్వాను కోపంతో 'ఊ... నీ సహాయం మాకక్కరలేదు ప్రక్కకు తొలగు' అని గదమాయించాడు. ఆ బాలుడు 'కనీసం ఈ మట్టిబుట్టను తీసుకెళ్ళి దూరంగా వేసివస్తాను. మీకు సహాయం చేస్తాను స్వామీ..' అంటూ అనంతాళ్వానుల భార్య చేతిలోని మట్టిబుట్టను తీసుకోబోయాడు.. హరి...హరీ... వీడెక్కడ దాపురించాడు స్వామీ.. అనుకుంటూ అనంతాళ్వాను 'మాకు నీ సహాయం ఏమీ అక్కరలేదని చెప్పానా? వెళ్ళు ఇక్కడి నుండి' అని ఈసడించుకున్నాడు.. గొయ్యిలో దిగి మళ్ళీ త్రవ్వడం ప్రారంభించాడు అనంతాళ్వాను.

చిన్న బాలుని రూపంలో వచ్చిన స్వామివారు గర్భిణి అయిన అనంతాళ్వాను భార్య మట్టిని మోస్తూ పడుతున్న కష్టాన్ని చూచి ' అమ్మా అనంతాళ్వానులవారు ఎలాగూ గొయ్యిలో దిగి త్రవ్వుతున్నారు. మీరు

కాస్త విశ్రమించండి నేను మట్టిని తీసేస్తాను అని పలికి ఆమెను ఒక చెట్టుక్రింద సేదతీరమని తాను మట్టిని మోసేయడం ప్రారంభించాడు.

సాయంత్రం అయ్యింది. అనంతాళ్వాను గొయ్యినుండి పైకివచ్చాడు. ఆశ్చర్యం మట్టికుప్పంతా మాయమై దూరం పడిఉంది. తన భార్యను చూసి 'ఎవరుచేశారు ఇంత పని' అని గదమాయించగా ఆతని భార్య జరిగిన విషయం చెప్పింది. ఎదురుగా వస్తున్న ఆ బాలుడిని చూసి వద్దన్నా కూడా వినకుండా మట్టిని మోశాడన్న కోపంతో తన చేతిలో ఉన్న గునపాన్ని ఆ బాలునిపై విసిరాడు. ఆ గునపం ఆ బాలుని గడ్డంపై తగిలింది. బాలుని రూపంలో ఉన్న శ్రీనివాసుడు మాయమైపోయాడు.

ఆ పై సాయంకాలం కావడంతో అనంతాళ్వాను సంధ్యాదులు ముగించి శ్రీవారిదర్శనానికి ఆలయంలో ప్రవేశించాడు. శ్రీవారి విగ్రహానికి గడ్డం గాయమై రక్తం కారుతూంది. ఆ దృశ్యాన్నిచూసి ఒక్కసారిగా నిశ్చేష్టుడైపోయాడు. అప్పుడు గ్రహించాడతడు తమకు సహాయం చేస్తానని వచ్చిన బాలుడు ఎవరో కాదు, సాక్షాత్తు శ్రీనివాసుడే అని. తన అపరాధాన్ని తెలుసుకున్నాడు. స్వామివారి పాదాలపై పడి తన అపరాధాన్ని మన్నించమని కన్నీటి పర్యంతం వేనోళ్ళా ప్రార్థించాడు. రక్తమోడుతున్న గడ్డంపై పచ్చకర్పూరాన్ని అద్దాడు.

స్వామివారు ప్రత్యక్షమై 'అనంతాళ్వాను నీ భక్తి అపారమైనది. నాకు పుష్పవనాన్ని నిర్మించాలన్న నీ ఏకాగ్రత ఏపాటిదోనని పరీక్షించేందుకే ఇలా చేశాను. నీ అపారభక్తికి మెచ్చాను. ఇకపై నాకు ఎన్ని అలంకారాలున్నా గడ్డంపై నీవు అలదిన పచ్చకర్పూరం మాత్రం అలాగే ఉంటుంది. గడ్డంబొట్టుగా ప్రసిద్ధి పొందుతుంది. తద్వారా నీ ఇతివృత్తం ఈ లోకానికి తెలుస్తుంది' అని స్వామివారు పలికి అంతర్ధానమైనారు.

నాటి నుండి ఈ ఇతివృత్తానికి గుర్తుగా తిరుమల శ్రీవారికి గడ్డానికి పచ్చకర్పూరాన్ని అలంకరించడం ఆనవాయితీగా వస్తూంది. ఇలా కొన్నాళ్ళు గడిచాయి. అనంతాళ్వానుల పుష్పవనం వివిధ రంగులతో కూడి చాలా అందంగా తయారైంది. ప్రతిరోజు ఈ పుష్పవనంలోని పుష్పాలన్నీ శ్రీవారికి అలంకరించబడుతున్నాయి.

ఒకనాడు శ్రీవారి పుష్పవనాన్ని సందర్శించాలన్న శ్రీదేవి భూదేవి అమ్మవార్ల కోరికమేరకు శ్రీనివాసుడు వారితోకలిసి మారువేషంలో పుష్పవనంలో విహరించసాగారు. ఈ సందర్భంలో అమ్మవార్లు వనంలోని అందమైన పూలనుకోసి అలంకరించుకున్నారు. ఈ దృశ్యం అనంతాళ్వానుల కంటపడింది.

స్వామివారి పూజకై పూసిన పూలను సాధారణ మానవులు ధరించడమా! హరి హరీ.. ఎంత అపచారం... అనుకుని వెంటనేవెళ్ళి కొండపై పూసిన పూలన్నీ శ్రీనివాసునికే చేరాలి అలాంటిది మీరు ఇలా వనంలో విహరిస్తూ పూలను కోసి ధరించడం భగవదపచారం... అని కోపగిస్తూ స్వామివారి చేయి గట్టిగా పట్టుకున్నాడు. సరిగ్గా అదే సమయానికి కైంకర్యపరులు ఆలయాన్ని చేరుకోవడంతో స్వామివారు అనంతాళ్వాన్ వద్దనుండి అంతర్ధానమైనారు. అమ్మవార్లు ఇద్దరూ అక్కడే ఉండడంతో వారిని తోటలోని పొన్నచెట్టుకు కట్టేశారు అనంతాళ్వానులు.

గర్భాలయంలో కైంకర్యానికి వెళ్ళిన అర్చకులకు స్వామివారి మెడలో అలంకరించిన శ్రీదేవి భూదేవి అమ్మవార్లు కనిపించకపోవడంతో అర్చకులు ఏదో అపచారం జరిగిందని భావించారు. ఈలోపు ఈ విషయం ఆ నోట ఈ నోట అనంతాళ్వానులను చేరింది. హరి హరీ.... ఏమిటీ అపచారం అమ్మవార్లు కనిపించకపోవడమా అంటూ పరుగెత్తుకెళ్లి స్వామీ

ఏమిటీ వైపరీత్యం అని భోరున రోదించాడు.  అప్పుడు స్వామివారు అమ్మవార్లను నీవు నీ తోటలో బంధిస్తే ఇక్కడెలా ఉంటారు అనంతాళ్వానూ.. వారు నీ భక్తికి బందీలయ్యారుకదా.. అన్నారు. అప్పుడు అనంతాళ్వాను పుష్పవనానికి విహారంగా వచ్చి పూలుకోసింది ఉభయ దేవేరులతోకూడిన స్వామివారే అని గ్రహించి అమ్మవార్లను బంధించిన పుష్పవనంలోని పొన్నచెట్టు వద్దకు పరుగెత్తాడు. అమ్మవార్ల పాదాలపై పడి తన అపరాధాన్ని మన్నించమని ప్రాధేయపడి బంధవిముక్తులను చేశాడు. అమ్మవార్లు అక్కడినుండి మాయమై శ్రీవారిహృదయాన్ని చేరుకున్నారు.

ఈ ఉదంతాన్ని గుర్తుచేసుకుంటూ నేటికీ బ్రహ్మోత్సవాల తరువాత శ్రీదేవీ భూదేవీ సమేతంగా శ్రీవారు ఉత్సవంగా అనంతాళ్వాన్ తోటను సందర్శించి వృక్షరూపంలోఉన్న అనంతాళ్వానులకు తమ పుష్పమాలను శఠారిని అనుగ్రహిస్తారు.

ఇది ఈ కలియుగంలో జరిగిన సాక్షాత్ ఇతివృత్తం.

* * *

## 14. దాసశ్రేష్ఠులు - పురందరదాసులు

'దాసభక్తులలో పురందరదాసులు శ్రేష్ఠులు" అని తమ దీక్షాగురువులైన వ్యాసతీర్థులవారిచేత ప్రశంసలందుకున్న భక్తశిఖామణి పురందరదాసు. వీరు సంగీతకర్త, కవి, వాగ్గేయకారులు. కర్ణాటకసంగీతానికి ఆద్యులు. అందుకే ''కర్ణాటక సంగీత పితామహులని' పురందరదాసులను గౌరవంగా సంబోధిస్తారు.

'కలౌ హరినామసంకీర్తనమ్' కనుక కలియుగంలో మోక్షమార్గమైన హరినామాన్ని ప్రచారం చేసేనిమిత్తం శ్రీహరి ఆజ్ఞానుసారం సాక్షాత్తు నారదమహర్షి ఈ భూలోకంలో పురందరదాసుగా జన్మించారని ప్రతీతి.

1484 లో కర్ణాటకలో శివమొగ్గ జిల్లా తీర్థహళ్లిలో సంపన్న వర్తక కుటుంబంలో వరదప్ప నాయకుడు, లీలావతుల ఏకైక కుమారునిగా పురందరదాసు జన్మించాడు. తిరుమల శ్రీనివాసుని దయతో జన్మించినందున ఈతనికి 'శ్రీనివాస నాయక' అని పేరుపెట్టారు. వీరి స్వస్థలం మహారాష్ట్రలోని 'పురందర ఘడ'. శ్రీనివాసనాయకుడు సంప్రదాయ విధానంలో కన్నడ, సంస్కృతాలతోపాటు సంగీతమూ అభ్యసించాడు. 16 ఏళ్లకే సరస్వతీ బాయితో వివాహమైంది. సంప్రదాయంగా వచ్చిన రత్న, మాణిక్య, వడ్డీవ్యాపారాలలో ఇబ్బడిముబ్బడిగా సంపాదించి కోట్లకు పడగలెత్తి నవకోటి నారాయణుడైనాడు.

మహాత్ములు తమ జన్మకారణాన్ని విస్మరించినపుడు ఆ పరమాత్ముడే వారికి కార్యనిర్దేశం చేస్తాడు. శ్రీనివాస నాయకుడు తన జన్మకారణాన్ని విస్మరించి లౌకికమైన సుఖాలలో మునిగితేలుతున్నాడని గ్రహించి మార్గనిర్దేశం చేసేందుకు సాక్షాత్తు నారాయణుడు బ్రహ్మదేవుని బాలునిగా

చేసి కుమారునితో కలిసి శ్రీనివాసనాయకుని సమీపించాడు. తన కుమారుని ఉపనయనానికి ధనసహాయం చేయమని అర్థించాడు.

ధనవ్యామోహంలో పడి లోభగుణంతో దానధర్మాలపట్ల అనాసక్తతను ప్రదర్శిస్తున్న శ్రీనివాసనాయకుడు 'ఇవ్వను' అని అనకుండా 'రేపటికి రమ్మని మాపటికి రమ్మని' తిప్పసాగాడు. తిరిగి తిరిగి విసుగెత్తి వాళ్ళే వెళ్లిపోతారని అతని భావన. కానీ శ్రీహరి అలా చేయకుండా శ్రీనివాస నాయకుని భార్యయైన సరస్వతీబాయిని సంప్రదించి జరిగినదంతా చెప్పి ఏదైన సహాయం చేయమని కోరాడు. ఆమె భర్తకు తెలియకుండా తనవద్ద స్వంతంగా ఏమీలేదని చెబుతూ తన పుట్టినింటి వారిచ్చిన ముక్కుపుడకను దానంగా ఇచ్చింది.

తాను ఇచ్చింది సాక్షాత్తు శ్రీనివాసుడికే అని ఆమెకు తెలియదు. ఆ ముక్కుపుడకను శ్రీనివాసనాయకుని నగల దుకాణంలోనే అమ్మాడు బ్రాహ్మణుడు. అది తన భార్య నగ అని గ్రహించి, హడావిడిగా ఇంటికి వచ్చి భార్యను గద్దించాడు. తనకు భర్త చేతిలో అవమానం తప్పదని పాలలో విషం కలిపి తాగటానికి నోటిదగ్గర పెట్టుకోగానే అందులో తన ముక్కుపుడక కనిపించింది. భర్తకూడా ఆశ్చర్యపోయాడు. ఆ పేద బ్రాహ్మణుడి కోసం వెతికారు కాని జాడ లేదు.

ఇదంతా పరమాత్ముని లీల అని తన భార్యను కాపాడినవాడు సాక్షాత్తు తిరుమల శ్రీనివాసుడేనని గ్రహించి, తప్పు తెలుసుకొన్నాడు. తను సంపద మీద ఎక్కువ దృష్టిపెట్టటం వలన జరిగిన అనర్థమే ఇది అని గ్రహించాడు. 30 వ ఏటనే తన సంపదనంతా దానంచేసి నవకోటి నారాయణుడు కటిక పేదవానిగా కట్టుబట్టలతో బయలుదేరి తమగురువైన వ్యాసరాయల వారిని శరణువేడాడు.

కృష్ణదేవరాయల రాజగురువైన వ్యాసరాయలవారి దర్శనం వలన మార్గం సుగమమై "పురుందర విఠల" నామాంకితంతో దాసదీక్షను స్వీకరించి పురందరదాసులుగా కొనియాడ బడ్డారు. హంపీ చేరి ఒక మండపంలో ఉంటూ జీవితాన్ని గడిపాడు. 5లక్షల సంకీర్తనలను చేయాలని సంకల్పించినా, విధిననుసరించి పురందరదాసులు తమ అంకితనామంతో 4 లక్షల 75వేల కీర్తనలు మాత్రమే రచన చేయగలిగారు.

మిగిలిన 25 వేల కీర్తనలూ రాసి తాము అనుకొన్న 5 లక్షల కీర్తనలు పూర్తి చేయమని చిన్న కొడుకు 'మధ్వపతి'ని కోరారు. తాను ఈ జన్మలో అంతటి పని చేయలేనని మరోజన్మలో రాసి తండ్రి కోరిక తీరుస్తానని అన్నాడు. అతడే తర్వాత జన్మలో 'విజయదాసు'లు గా జన్మించి 25 వేల కీర్తనలు 'విజయవిఠల' అనే అంకిత నామంతో వ్రాసి తండ్రికిచ్చిన మాట నిలబెట్టుకున్నాడు. త్యాగరాజ స్వామి తన 'ప్రహ్లాద భక్త విజయం' గేయనాటకం లో పురందరదాసులను ప్రస్తుతించారు. పురందరదాసులు అన్నమాచార్యులు ఒకే కాలంలో ఉన్నట్లు, ఇరువురు కలిసి ఒకే కీర్తనను శ్రీనివాసునిపై ఆలపించినట్లు ఆధారాలున్నాయి.

ఆధ్యాత్మిక వేత్తలైన వారికి మాత్రమే బోధపడే శ్రీమద్ భాగవతాన్ని సుందర సరళతరమైన శ్రావ్యమైన పాటలుగా రాసి సామాన్యులకు కూడా భాగవతపరమార్థాన్ని తెలియజేశాడు. కర్ణాటక సంగీతంలో వ్రేళ్లమీద లెక్కింపదగిన వాగ్గేయకారుడిగా గుర్తింపుపొందాడు. స్వరావళి, అలంకారాలతో సంగీతానికి శోభ సమకూర్చాడు. "మాయామాళవగౌళ" రాగాన్ని సృష్టించి సంగీతం నేర్చుకొనేవారికి మొట్టమొదట పాడుకోవటానికి సులభంగా ఉత్సాహజనకంగా వరప్రసాదంగా అందుబాటులోకి తెచ్చాడు.

కొన్నాళ్ళకు పురందరదాసులు పండరిపురం చేరుకున్నారు. పాండురంగ విఠలుని ఆలయంలో ప్రతిరోజు ఏకాంత సేవవరకు ఉండి కీర్తనలను గానం చేసి ఇంటికి వెళ్ళేవారు. ఒకానొకనాడు పురందర దాసులు తమ భజనకార్యక్రమాన్ని ముగించి ఇంటికి తిరిగివచ్చి తన కుమారుని కాళ్ళు కడుక్కునేందుకు చెంబులో నీటిని తీసుకురమ్మని కోరాడు.. ఒకటికి రెండుసార్లు పిలిచినా అతను రాలేదు. మూడవసారి గట్టిగా కోపంతో పిలవగా శ్రీహరియే అతని కుమారుని రూపంలో కాళ్ళకు నీటిని తీసుకువచ్చాడు. అది తెలియని పురందరదాసులు ఆతని తలపై చెంబుతో మొట్టి 'ఎన్ని సార్లు పిలవాలి..' అని గద్దించాడు.

కొన్నాళ్ళకు అర్చకులు స్వామివారి ఆలయంలో పూజకు వెళ్ళగా అక్కడ స్వామివారి నగ ఒకటి కనిపించలేదు. ఆశ్చర్యంతో అధికారులకు తెలియజేయగా వారు వచ్చి విచారించారు. ముందురోజు రాత్రి చివరగా వెళ్ళినది పురందరదాసులేనని కొందరు చెప్పారు.

ఈలోపు ఒక దేవదాసి ఆలయానికి రాగా ఆమెకంఠంలో అలంకరించుకున్న ఆభరణాన్ని చూసి అది పాండురంగ విఠలుని హారంగా గుర్తించారు. ఆ హారం ఎవరిచ్చారని విచారించగా క్రితం నాటి రాత్రి పురందరదాసులు తమ ఇంటికి వచ్చారని ఈ హారాన్ని బహుమతిగా ఇచ్చారని ఆమె చెప్పింది.

అధికారులు పురందరదాసులకు విషయంచెప్పి తీసుకురమ్మని సేవకులను ఆజ్ఞాపించారు. వారు పురందరదాసులను తీసుకువచ్చారు. వారిని ఆభరణం విషయంలో వివరణ కోరగా తనకేమీ తెలియదని తాను వెళ్ళలేదని చెప్పారు. కానీ దేవదాసి పురందరదాసులే రాత్రి వచ్చారని, ఇచ్చారని చెప్పింది. అధికారులు నిజం చెప్పమని దాసులను ఆలయంలో స్థంబానికి కట్టేసి కొరడాతో దండించసాగారు. దాసులు విఠలుని ప్రార్థిస్తూ

స్వామీ నేనేమి అపరాధం చేశాను. నాకెందుకు ఈ శిక్ష ఈ అవమానం.. మానావమానాలన్నీ నీకే సమర్పిస్తున్నాను శ్రీకృష్ణార్పణమస్తు- అని పలుకగానే దాసులవారి కొరడాదెబ్బలు పాండురంగవిఠలుడు స్వీకరించాడు. అర్చకులు స్వామివారి విగ్రహంపై కొరడాదెబ్బలను చూసి అధికారులకు తెలిపారు.

అప్పుడు విఠలుడు 'పురందరదాసా ఆనాడు ఆలస్యంగా వచ్చి కాళ్ళుకడుక్కొనేందుకు నీళ్ళడిగితే తెచ్చిచ్చాను. గుర్తుందా.. అందుకు నీవు నన్ను చెంబుతో మొట్టి బహూకరించావుకదా... అందుకే ఈ బహుమానం ఇప్పించాను.. దెబ్బకు దెబ్బ సరిపోయింది.. అంటూ పలికి అధికారులకు దాసుల అపరాధంలేదని తానే దాసులరూపంలో వెళ్ళి దేవదాసికి బహుమానం ఇచ్చానని దాసులను విడుదలచేయమని ఆజ్ఞాపించాడు.

మరోసారి తిరుమల బ్రహ్మోత్సవసమయంలో బ్రాహ్మణులకు అన్నసంతర్పణ చేస్తూ నెయ్యిలేకపోవడంతో కొడుకును నెయ్యికోసం పంపాడు. ఎంతకూ రాకపోవడంతో ఆలస్యమవుతూందని శ్రీనివాసుని ప్రార్థిస్తే, శ్రీనివాసుడే కుమారుని రూపంలో కావలసినంత నెయ్యిని తీసుకువచ్చి ఇచ్చారట.. ఆ తరువాత అసలు విషయంతెలుసుకుని భక్తసులభుడు, పరమాత్ముడు శ్రీనివాసుడని కీర్తించారు దాసులు. తమ సంకీర్తనలతో పరమాత్ముని కీర్తించి సాక్షాత్కరించుకుని తరించిన ధన్య జీవులు కర్ణాటకసంగీత పితామహులు, దాససాహిత్యా గంగా ప్రవాహానికి మార్గాన్ని సుగమం చేసినదాసశ్రేష్ఠులు శ్రీ పురందరదాసవరేణ్యులు.

* * *